పార్లమెంట్‌లో అరకు కాఫీ

స్పీకర్‌కు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వినతి

ఈ సమావేశాల్లోనే స్టాల్ ఏర్పాటుకు ఓం బిర్లా ఓకే

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 326 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి ఉ.9.12 తదుపరి చతుర్దశి, నక్షత్రం: మఖ తె.4.05 తదుపరి పుబ్బ, వర్జ్యం: మ.3.10-4.53, అమృతఘడియలు: రా.1.30-3.13, దుర్ముహూర్తం: మ.12.01-12.48, రాహుకాలం మ. 12.00-1.30, సూర్యోదయం: 6.29, సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



‘ఆడుదాం..’ అవినీతిపై ఏసీబీ విచారణ

అసెంబ్లీలో ప్రకటించిన ప్రభుత్వం

- నాలుగున్నరేళ్లు క్రీడల్ని గాలికొదిలేసిన వైసీపీ.. చివరి ఏడాది మాత్రం రాష్ట్రమంతటా ఓట్లాట
- టీ షర్టులపై వైసీపీ రంగులు, జగన్ బొమ్మలు.. ప్రచార వ్యయమంతా అస్మదీయుల జేబుల్లోకి
- మైదానంలో వైసీపీ కార్యకర్తలదే హడావుడి.. ‘ఆడుదాం ఆంధ్రా’ పేరిట రూ.119 కోట్లు ఖర్చు!
- క్రీడాకారులకు నాసిరకం కిట్లు.. ఈవెంట్ నిర్వహణ, ముగింపు సభ, ప్రైజ్‌మనీ.. అన్నిట్లో దోపిడే


నాటి మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డిపై ఆరోపణలు

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ‘ఆడుదాం.. ఆంధ్రా’లో అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గత జగన్ ప్రభుత్వం ఎన్నికల చివరి ఏడాది ఈ కార్యక్రమం పేరిట రాష్ట్రమంతటా ఓట్లాట సాగించింది. రూ.వంద కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ‘ఆడుదాం ఆంధ్రా’లో అసలు ఏం జరిగిందన్న దానిపై వాస్తవాలు బయటికి తీసేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికోసం ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు అసెంబ్లీలో మంగళవారం ప్రభుత్వం ప్రకటన చేసింది. నిజానికి, అప్పట్లో తొలి నాలుగున్నరేళ్ల పాటు శాప్‌ను, క్రీడలను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఎన్నికలకు ముందు మాత్రం హడావుడి మొదలుపెట్టింది. ‘ఆడుదాం ఆంధ్రా’ అంటూ కొత్తరకం

మిగతా 12వ పేజీలో...

నేనెప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయలేదు. ఇప్పుడు కూడా చేయను. దీనిని అలుసుగా తీసుకుని శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే మాత్రం ఉపేక్షించేది లేదు. నేరస్థులకు మా ప్రభుత్వం సింహస్వప్నంలా మారి వారిపై ఉక్కుపాదం మోపుతుంది. రౌడీలు, ఫ్యాక్షనిస్టులు, ముఠా తగాదాల మాటే వినబడకూడదని శాసనసభ వేదికగా హెచ్చరిస్తున్నా.

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు



తప్పుచేస్తే తాట తీస్తాం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం: సీఎం

- రౌడీలు, ఫ్యాక్షనిస్టులు అనే మాటే వినబడకూడదు
- ఆడబిడ్డల జోలికొస్తే అదే చివరి రోజవుతుంది
- మహిళలకు రక్షణగా ‘శక్తి’ యాప్ ప్రారంభించాం
- గంజాయి, డ్రగ్స్‌పై ‘ఈగల్’ యుద్ధం ఆపేది లేదు
- నేరస్థులకు కూటమి ప్రభుత్వం సింహస్వప్నమే
- శాసనసభలో సీఎం చంద్రబాబు హెచ్చరికలు

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు తలెత్తాయని, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని చెప్పారు. మంగళవారం శాసనసభలో శాంతిభద్రతల అంశంపై ఆయన మాట్లాడారు. ప్రజలు భయం లేకుండా

మిగతా 12వ పేజీలో...


పాపులేషన్ డైనమిక్స్ సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

జనాభా పెరగాలి

- ఎక్కువ మంది ఉంటే ఎక్కువ సంక్షేమం
- దక్షిణ భారతంలో జననాల రేటు తగ్గుతోంది
- రాష్ట్రంలో జననాల రేటు 1.5 నుంచి 2.1కి చేరాలి
- రిటైరైన వారూ పనిచేస్తే ఉత్పాదకత వృద్ధి
- ఎస్ఆర్ఎం 10 వేల కుటుంబాలను దత్తత తీసుకోవాలి
- పాపులేషన్ డైనమిక్స్ సదస్సులో సీఎం చంద్రబాబు

12

ఎస్సీ వర్గీకరణపై సీఎంకు చేరిన నివేదిక

- శరవేగంగా ముగిసిన ప్రక్రియ
- తుది నిర్ణయం ముఖ్యమంత్రిదే!
- తొలుత ఎస్సీ ప్రతినిధులతో భేటీ
- కేబినెట్‌లోనూ చర్చ జరిగే చాన్స్

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అదే సమయంలో... కమిషన్ కాల పరిమితిని మరో నెల రోజుల పాటు పొడిగిస్తూ మంగళవారంనాడు సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం కోసం గత ఏడాది నవంబరు 15న రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ప్రభుత్వం కమిషన్‌ను నియమించింది. వీలైనంత త్వరగా అధ్యయనం పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని అందులో కోరింది. గత ఏడాది నవంబరు 27న కమిషన్ తన విధులు ప్రారంభించింది.



రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి ఎస్సీ రిజర్వేషన్ల అమలులో వర్గీకరణపై సంబంధిత వర్గాల అభిప్రాయాలను సేకరించింది. శరవేగంగా ఈ ప్రక్రియను ముగించింది. తన సిఫారసులతో నివేదికను సిద్ధం చేసి... దానిని సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు అందజేసింది. దీనిని సీఎస్ మంగళవారం సీల్డ్ కవర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలన కోసం పంపించారు. దీనిపై సీఎం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈలోపే ఆయన మాల, మాదిగ, ఇతర ఎస్సీ ఉపకులాల ప్రతినిధులతో సమావేశమై... వర్గీకరణపై చర్చిస్తారని తెలుస్తోంది. ఈ నెల 18వ తేదీన జరగనున్న కేబినెట్ ప్రత్యేక భేటీలో వర్గీకరణ అమలుపై తీర్మానం చేసే అవకాశముందని కూడా సమాచారం.



బోరుగడ్డ పరార్!

బెయిలు గడువు ముగిసినా గాయబ్

- హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు
- రాజమండ్రి జైలుకు రాని అనిల్
- హైకోర్టుకు జైలు సూపరింటెండెంట్ సమాచారం
- సంబంధం లేని వాళ్లతో పూచీకత్తులు
- బెయిలులో ఉన్న సమయంలో తెలంగాణలో చక్కర్లు?
- నకిలీ సర్టిఫికెట్ సంగతి బయటపడినా వీడియో సందేశంలో బెదిరింపులు
- కుటుంబ సభ్యుల ఫోన్లూ స్విచ్‌ఆఫ్
- విదేశాలకు పారిపోయే అవకాశం!?
- రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు

గుంటూరు/రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో చెలరేగిపోయిన రాజ్యాంగేతర శక్తి, రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ హైకోర్టు ఆదేశాలను ధిక్కరించాడు. తల్లి అనారోగ్యాన్ని అడ్డం పెట్టుకుని, తప్పుడు మెడికల్ సర్టిఫికెట్‌తో హైకోర్టుకే టోకరా వేసి మధ్యంతర బెయిలు పొడిగించుకున్న సంగతి తెలిసిందే. బెయిలు గడువు మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసిపోయింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం అతడు ఆ సమయంలోపు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో లొంగిపోవాల్సి ఉంది. కానీ, మళ్లీ బెయిలు పొడిగించాలంటూ

మిగతా 14వ పేజీలో...

విమానంలో వచ్చైనా లొంగిపోవాల్సిందే!

- బోరుగడ్డ అనిల్‌కు హైకోర్టు ఆదేశం.. బెయిల్‌ను పొడిగించేది లేదని స్పష్టీకరణ
- పిటిషనర్ తల్లి చెన్నై అపోలోలో ఇంకా చికిత్స పొందుతున్నారు
- బెయిల్ పొడిగించాలన్న న్యాయవాది.. తీవ్రంగా స్పందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్
- ఆమె గత నెల 23నే డిశ్చార్జ్ అయ్యారు.. 1న పిటిషన్ వేసేనాటికి ఆస్పత్రిలోనే లేరు
- తల్లి అనారోగ్యాన్ని చూపి నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టి: పీపీ

14

ఫ్యాన్సీ నంబర్.. ఆర్మీ స్టిక్కర్!

కారులో 150 కిలోల గంజాయి

- ముందస్తు సమాచారంతో పోలీసుల నిఘా
- తూర్పుగోదావరి జిల్లాలో ఐదుగురి అరెస్టు
- పట్టుబడ్డ గంజాయి విలువ రూ.30 లక్షలు


కారు డిక్కీలో గంజాయి ప్యాకెట్లు

14


హైజాక్‌కు గురైన రైలు ఇదే..



రైలు హైజాక్

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో ఘటన

రైల్లో 500 మందికి పైగా ప్రయాణికులు

- క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసిన బలూచ్ ఆర్మీ
- రైలుపై తొలుత కాల్పులు జరిపిన సాయుధులు.. పలువురికి గాయాలు
- పౌరులను వదిలేసి భద్రతా సిబ్బంది సహా 214 మందిని బంధించిన బీఎల్ఏ
- సైనిక చర్య చేపడితే అందర్నీ చంపేస్తాం.. జైళ్లలో ఉన్న బలూచ్ ఉద్యమకారులను 48 గంటల్లోగా వదిలేయాలి.. పాక్ సర్కారుకు అల్టిమేటం
- హెలికాప్టర్లు, డ్రోన్లతో పాక్ ఆపరేషన్.. 80 మందిని విడిపించినట్లు వార్తలు
- 150 మందికి పైగా సైనికుల దుర్మరణం.. మాజీ ఎంపీ అబ్దుల్ ఖదీర్ వెల్లడి

కరాచీ, మార్చి 11: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో వేర్పాటువాదులు రైలును హైజాక్ చేశారు. 9 బోగీలతో, 500 మందికి పైగా ప్రయాణికులతో క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పెషావర్‌కు వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం సాయుధులైన దుండగులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ మార్గంలో 17 సొరంగాలు ఉంటాయని పాక్ రైల్వే అధికారులు తెలిపారు. 8వ నంబరు టన్నెల్ వద్ద వారు

మిగతా 2వ పేజీలో...

రూ. 348.75 లక్షల కోట్లు

ఉఫ్

- 20 రోజుల్లో అమెరికా స్టాక్‌మార్కెట్లు మూటగట్టుకున్న నష్టం
- మన దేశ బడ్జెట్‌కు ఇది ఏడింతలు
- ట్రంప్ భస్మాసురహస్తం ఫలితం
- సుంకాల యుద్ధం, యథేచ్ఛగా ఉద్యోగుల తొలగింపుతో అమెరికాలో ఆర్థిక అనిశ్చితి
- పెట్టుబడులు వెనక్కి తీసుకుంటున్న ఇన్వెస్టర్లు
- తీవ్ర ఆందోళనలో కార్పొరేట్ కంపెనీలు
- కెనడా కార్లు, కలప, విద్యుత్ మాకు అవసరం లేదు.. ఆ దేశంపై సుంకాలు డబుల్: ట్రంప్
- టెస్లా షేర్ల ధర పడిపోతున్న నేపథ్యంలో ఆ సంస్థ కారు కొంటానని ప్రకటించిన ట్రంప్
- సుంకాల తగ్గింపుపై అమెరికాకు హామీ ఇవ్వలే
- పార్లమెంటరీ కమిటీకి వెల్లడించిన కేంద్రం



(సెంట్రల్ డెస్క్)

రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన వెంటనే ట్రంప్ మొదలుపెట్టిన సుంకాల యుద్ధం అమెరికాకే గుదిబండగా మారుతోంది. చైనా, భారత్, కెనడా, మెక్సికో, యూరప్ దేశాల మీద.. పరస్పర పన్నుల పేరిట ట్రంప్ కొరడా ఝుళిపిస్తున్న విషయం తెలిసిందే. గత కొన్ని దశాబ్దాలుగా అమలైన ప్రపంచీకరణ విధానాలతో యావత్ ప్రపంచం ఓ కుగ్రామంలా తయారైంది. ఇలాంటప్పుడు, ట్రంప్ కొత్తగా.. ‘మాకు మేమే.. మీకు మీరే’ అంటూ తెచ్చిన సుంకాలతో ఆర్థిక వ్యవస్థలు

మిగతా 2వ పేజీలో...

జగన్ కక్షల నుంచి 386 మంది ఇంజనీర్లకు విముక్తి

- నీరు-చెట్టు పనుల్లో క్రమశిక్షణ చర్యలు ఉపసంహరణ
- జలవనరుల ప్రత్యేక సీఎస్ ఉత్తర్వులు

11

‘ఫైబర్’ ఉద్యోగుల వివరాలు తక్షణమే ఇవ్వండి

- ఇన్‌చార్జి ఎండీ ప్రవీణ్ ఆదిత్యకు సీఎంఓ ఆదేశం
- నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకునే చాన్స్

14

పర్యాటక పెట్టుబడుల కోసం భూ కేటాయింపు పాలసీ

- ఇక పెట్టుబడి ఆధారంగా భూమి కేటాయింపు

2

మీకెందుకు అంత నిర్లక్ష్యం?

- సభ్యుల ప్రశ్నలకు సమగ్ర సమాధానం తయారు చేయలేరా?
- ఎంఎస్ఎంఈ అధికారులపై మంత్రి కొండపల్లి ఆగ్రహం

13



11

లడ్డూ తయారీకి సకాలంలో అందని నెయ్యి

- కొత్త పరికరాలతో ల్యాబ్ పరీక్షలకు అధిక సమయం.. ఇబ్బంది పడుతున్న టీటీడీ!

పోలవరానికి మరో 2,704 కోట్లు

- కేంద్రం నిర్ణయం.. ఒకట్రెండు రోజుల్లో విడుదల
- తొలి విడతలో 2,348 కోట్లు ఇచ్చిన వైనం
- పనుల పురోగతిపై 17న పీపీఏ సమీక్ష

12

అమరావతిలో 64 వేల కోట్లతో 73 పనులు

- మూడేళ్లలో నిర్మాణాల పూర్తికి ప్రణాళికలు
- రెండేళ్లలో ప్రధాన రోడ్లు పూర్తి
- రాజధానిలో 31 సంస్థలకు భూములు
- ఆర్-5లో సెంటు భూమి తీసుకున్న వారికి వేరే చోట భూమి: మంత్రి నారాయణ

13

రైలు హైజాక్

(మొదటి పేజీ తరువాయి)

రైలును అడ్డుకున్నారని చెప్పారు. తొలుత సాయుధ దుండగులు రైలుపై భారీస్థాయిలో కాల్పులు జరిపారని బలూచిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రిండ్ వెల్లడించారు. పలువురు ప్రయాణికులు గాయపడినట్లు తెలుస్తోందన్నారు. ఈ ఘటనకు తామే బాధ్యులమని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ప్రకటించింది. బీఎల్‌ఏ తీవ్రవాదులు రైల్వే ట్రాక్‌ను పేల్చివేయడంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. వెంటనే వారు రైలుపై కాల్పులు జరిపి తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఈ దాడిలో 30 మంది పాక్ సైనికులు మరణించినట్లు బీఎల్‌ఏ వెల్లడించింది. రైల్లో ఉన్న మహిళలు, వృద్ధులు, చిన్నారులు.. ప్రధానంగా బలూచిస్థాన్‌కు చెందిన వారిని వదిలిపెట్టి, వారిని సురక్షిత మార్గాల్లో గమ్యస్థానాలకు పంపినట్లు తెలిపింది. ప్రస్తుతం 214 మంది (ఇందులో 100 మందికిపైగా పాక్ భద్రతా సిబ్బంది) బందీలుగా ఉన్నట్లు తెలిపింది. తమపై ఏదైనా సైనిక చర్యకు ప్రయత్నిస్తే.. బందీలందరినీ చంపేస్తామని బెదిరించింది. ఘటనా స్థలానికి సహాయక, భద్రతా సిబ్బంది చేరుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. పాక్ ఆర్మీ సిబ్బంది, వైద్యులతో ఎమర్జెన్సీ రైలును పంపినట్లు అధికారులు తెలిపారు. బందీలను కాపాడేందుకు సైనిక చర్య ప్రారంభించామని, చివరి ఉగ్రవాదిని మట్టుబెట్టేవరకు ఇది కొనసాగుతుందని భద్రతా బలగాలు వెల్లడించాయి. హెలికాప్టర్లు, డ్రోన్లతో బాంబు దాడులకు దిగినట్లు సమాచారం. అయితే భద్రతా బలగాలు వైమానిక దాడులను ఆపకపోతే బందీలను చంపేస్తామని బీఎల్‌ఏ హెచ్చరించింది. ఇదిలా ఉండగా పాక్‌కు చెందిన మాజీ ఎంపీ అబ్దుల్ ఖదీర్ బలూచ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. బందీలను విడిపించేందుకు బీఎల్‌ఏతో పోరాటానికి దిగిన పాక్ సైనికుల్లో 150 మందికి పైగా మరణించినట్లు చెప్పారు.

● జైళ్లలో ఉన్న బలూచిస్థాన్ ఉద్యమకారులందరినీ విడిచిపెట్టాలని బీఎల్‌ఏ డిమాండ్ చేసింది. వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని పాక్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. 214 మంది బందీల్లో పాకిస్థాన్‌కు చెందిన మిలిటరీ, పారామిలిటరీ, పోలీస్, నిఘా అధికారులు ఉన్నట్లు తెలిపింది. 48 గంటల్లోగా బలూచిస్థాన్ రాజకీయ ఖైదీలు, ఇతర ఉద్యమకారులను విడిచిపెట్టకపోతే బందీలందరినీ చంపేస్తామని హెచ్చరించింది.

80 మంది బందీలను విడిపించాం

జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లో బీఎల్‌ఏ చెరలో ఉన్న వారిలో 80 మందిని విడిపించినట్లు బలూచిస్థాన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి షాహింద్ రింద్ తెలిపారు. రైల్లోని ఒక బోగీ నుంచి 43 మంది పురుషులు, 26 మంది మహిళలు, 11 మంది చిన్నారులను రక్షించినట్లు వెల్లడించారు. రైలు ఇంకా టన్నెల్‌లోనే ఉందని, భద్రతా బలగాలకు బీఎల్‌ఏ ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరుగుతున్నాయని చెప్పారు. రైల్లో ఇంకా 400 మంది వరకు ప్రయాణికులు ఉన్నారన్నారు.

గత ఐదేళ్లలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం: మంత్రి అనిత

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. గత ఐదేళ్లు భయానకమైన అనుభవాలను చూశాం. నాటి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ గట్టిగా మాట్లాడితే కేసులు పెట్టి వేధించారు. ప్రస్తుత శాసనసభలో సీఎం చంద్రబాబుతో సహా... దాదాపు ఎమ్మెల్యేలందరిపై అక్రమ కేసులున్నాయి' అని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. రాష్ట్ర హోం శాఖకు నిధులు అభ్యర్థిస్తూ మంగళవారం శాసనసభలో ఆమె ప్రవేశపెట్టిన డిమాండ్‌పై చర్చ జరిగింది. పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడిన అనంతరం మంత్రి అనిత సమాధానమిచ్చారు. 'ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నాం. ప్రతి పోలీసు స్టేషన్‌లో సీసీటీవీలతోపాటు 2 డ్రోన్లు అందుబాటులో ఉంచుతాం. ఇప్పుడు ప్రతి పోలీసుస్టేషన్‌కు కొత్త వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. పోలీసులకు ఇన్వెస్టిగేషన్ చార్జీలు, పెట్రోలు, డీజిల్ ఇస్తాం. గత ప్రభుత్వం రూ.12 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో సీసీ కెమెరాల వ్యవస్థ మూలనపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.60 కోట్ల బడ్జెట్ కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను పునరుద్ధరించాలనేది లక్ష్యం. ఇప్పటికే 50 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఇప్పుడు మళ్లీ ఆ ల్యాబ్ పనులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.


'హద్దు' మీరితే ఐదేళ్ల జైలు

పాస్‌పోర్టు లేకుండా దేశంలోకి ప్రవేశిస్తే రూ.5 లక్షల జరిమానా కూడా

» లోక్‌సభలో వలస, విదేశీయుల బిల్లు

» ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిత్యానంద్

న్యూఢిల్లీ, మార్చి 11: వలస విధానం సహా విదేశీయుల రాక, పోక, బసకు సంబంధించిన కీలక బిల్లును కేంద్ర హోం శాఖ మంగళవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్-2025'ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సభలో ప్రవేశ పెట్టారు. ఈ బిల్లు ద్వారా వలస విధానంలోని వివిధ సేవలను క్రమబద్ధీకరించనున్నారు. అదేవిధంగా విదేశీయులు భారత్‌లోకి రావడం, వెళ్లడం సహా నివాసం, వారి పర్యటనలు వంటి అన్ని వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. విదేశీయులపై పూర్తి నియంత్రణ కేంద్రానికే ఉంటుంది. అయితే, ఈ బిల్లును ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి మరీ ఈ బిల్లును తీసుకువచ్చారని కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలను నిత్యానంద రాయ్ తోసిపుచ్చారు. వలస విధానం సహా, విదేశీయులకు సంబంధించిన అంశాలపై చట్టం చేసే సంపూర్ణ హక్కు కేంద్రానికి ఉందన్నారు. రాజ్యాంగంలోని కేంద్ర జాబితాలో ఈ అంశాన్ని చేర్చిన విషయాన్ని గుర్తు చేశారు. విదేశీ పర్యాటకులను స్వాగతిస్తామని, అదేసమయంలో దేశ శాంతి, సౌభ్రాతృత్వాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని నొక్కి చెప్పారు. బిల్లును ప్రవేశ పెడుతున్న సమయంలోనే అడ్డుకున్న కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ.. పాలక పక్ష భావజాలాన్ని అంగీకరించని విదేశీయులను దేశంలోకి అడుగుపెట్టకుండా చేయాలన్న ఉద్దేశం ప్రతిపాదిత బిల్లులో కనిపిస్తోందన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన విదేశీయులను దేశంలోకి అడుగుపెట్టకుండా చేసేలా ఈ బిల్లు ఉందని టీఎంసీ ఎంపీ సౌగత్ రాయ్ అన్నారు. అదే సమయంలో ప్రస్తుతం ఉన్న చట్టాల్లోని లోపాలను ఈ బిల్లు సరిచేస్తుందని, నకిలీల బెడదను తప్పించే అవకాశం ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం.



లోక్‌సభలో మాట్లాడుతున్న నిత్యానంద్‌రాయ్

కాగా, ప్రస్తుతం 1939 నాటి విదేశీయుల రిజిస్ట్రేషన్ చట్టం, 1946 నాటి విదేశీయుల చట్టం అమల్లో ఉన్నాయి. వీటి ఆధారంగానే బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ఏడు విభాగాలుగా వీసాలను వర్గీకరించి 167 దేశాల ప్రజలకు వీసాలను మంజూరు చేస్తోంది. అదేవిధంగా జపాన్, దక్షిణ కొరియా, యూఏఈ దేశాల ప్రజలకు ఆరు ప్రధాన విమానాశ్రయాల్లో 'వీసా ఆన్ అరైవల్' విధానాన్ని కొనసాగిస్తోంది.

తాజా బిల్లులో ఏముంది?

- విదేశీయుల లీగల్ స్టేటస్ అంశం ఇకపై ప్రభుత్వంపై ఉండదు. వారే బాధ్యత వహించాలి.
- దేశ భద్రతకు, సౌభ్రాతృత్వానికి భంగం వాటిల్లుతుందని సందేహిస్తే.. సదరు వ్యక్తులను దేశంలోకి ప్రవేశించకుండా ఈ బిల్లు అడ్డుకుంటుంది.
- నకిలీ పత్రాలతో పాస్ పోర్టు పొందే వారికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించడంతోపాటు రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.
- ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఈ బిల్లు విస్తృత అధికారాలను కల్పిస్తోంది. తద్వారా ఎలాంటి వారెంటు లేకుండానే వారు విదేశీ వ్యక్తులను అరెస్టు చేసే అధికారం లభిస్తుంది.

పీఎం కిసాన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు

పీఎం కిసాన్ పథకంలో ఇప్పటిదాకా చేరని రైతులు.. ఇప్పుడు పథకంలో చేరినా పెట్టుబడి సాయం అందిస్తామని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ చౌహాన్ పేర్కొన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇక, క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలో 200 డే క్యాన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా రాజ్యసభలో వెల్లడించారు.

డీలిమిటేషన్‌తో 9 రాష్ట్రాలకు నష్టం: కాంగ్రెస్

కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పాలిట లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) శాపంగా పరిణమించనుందని కాంగ్రెస్ ఆక్షేపించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మంగళవారం 'ఎక్స్'లో ఈ మేరకు భారీ పోస్టును ఉంచారు. 2026లో జనాభా అంచనా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణ 8 సీట్లు చొప్పున కోల్పోనున్నాయని తెలిపారు. అలాగే, పశ్చిమబెంగాల్(4), ఒడిసా(3), కర్ణాటక(2), హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్ ఒక్కో సీటు కోల్పోతాయన్నారు. ఇక యూపీకి 11, బిహార్‌కు 10, రాజస్థాన్‌కు 6, మధ్యప్రదేశ్‌కు 4 సీట్లు పెరుగుతాయని తెలిపారు. జార్ఖండ్, హరియాణా, గుజరాత్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఒక్కో సీటు పెరగనున్నట్టు వివరించారు. అసోం, జమ్మూకశ్మీర్, మహారాష్ట్రలో సీట్ల సంఖ్యలో మార్పు ఉండదన్నారు.

ఖర్గే వ్యాఖ్యలపై దద్దరిల్లిన రాజ్యసభ

» చైర్మన్‌ను అవమానించారంటూ అధికారపక్షం ధ్వజం

న్యూఢిల్లీ, మార్చి 11: రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలపై మంగళవారం దుమారం రేగింది. డిప్యూటీ చైర్మన్‌ను ఉద్దేశించి తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని, ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాత్రమే చేశానని వివరణ ఇచ్చిన ఖర్గే.. డిప్యూటీ చైర్మన్‌కు క్షమాపణ చెప్పారు. ప్రశ్నోత్తరాల అనంతరం జాతీయ విద్యా విధానంపై కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ మాట్లాడాలని డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సూచించారు. ఆ సమయంలో తమిళనాడు ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకుగాను మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పాలంటూ పలువురు ప్రతిపక్ష సభ్యులు నిల్చొని డిమాండ్ చేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో జోక్యం చేసుకునేందుకు ఖర్గే లేచి నిల్చున్నారు. అయితే, ఖర్గేకు ఉదయమే మాట్లాడే అవకాశం ఇచ్చామని, ఇప్పుడు





దిగ్విజయ్ సింగ్ మాట్లాడాలని డిప్యూటీ చైర్మన్ స్పష్టం చేయగా, తాను మాట్లాడిన సమయంలో విద్యాశాఖ మంత్రి సభలో లేరన్న ఖర్గే.. 'ఇది నియంతృత్వం' అంటూ అసహనం వ్యక్తం చేశారు. 'అనాగరికులు, సంస్కృతి లేనివారంటూ దేశంలోని ఒక ప్రాంతం, ప్రజల ఆత్మగౌరవాన్ని మీరు కించపరుస్తున్నారు. దేశాన్ని ముక్కలు చేసేలా మాట్లాడుతున్నారు. మంత్రి రాజీనామా చేయాలి' అని ఖర్గే డిమాండ్ చేశారు. దీంతోపాటు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం సిద్ధమైందనేలా ఖర్గే హిందీలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సభాధ్యక్షుడి గురించి ఖర్గే అమర్యాదకరమైన వ్యాఖ్యలు చేశారంటూ అధికార పక్షం ఆందోళనకు దిగింది. ఖర్గే వ్యాఖ్యలు ఖండించదగినవని సభాపక్ష నేత జేపీ నడ్డా అన్నారు. దీంతో ఖర్గే వెంటనే క్షమాపణ చెప్పారు.

లోకం తీరు

59% మంది భారతీయులకు కంటి నిండా నిద్ర కరువు: సర్వే



ఎన్నికల ప్రక్రియ బలోపేతంపై చర్చిద్దాం

» దీనిపై త్వరలో సమావేశం అవుదాం

» రాజకీయ పార్టీలకు ఈసీ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 11: ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియ బలోపేతంపై సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిల్లో ఏవైనా పరిష్కారం కాని సమస్యలపై ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది. చట్టానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడంపై రాజకీయ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నేతలతో సమావేశానికి కూడా ఈసీ ప్రతిపాదించింది. ఈ మేరకు పరస్పర అనుకూల సమయంలో భేటీ అవుదామని పేర్కొంటూ అన్ని పార్టీలకు మంగళవారం వేర్వేరుగా లేఖలు పంపింది. ఓటర్ల జాబితాల అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చ చేపట్టాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో.. నకిలీ గుర్తింపు కార్డు (ఈపీఐసీ) నంబర్ల అంశం పార్లమెంట్‌లో దుమారం రేపింది. దీనిపై పలు రాజకీయ పార్టీలు కూడా ప్రశ్నలు లేవనెత్తాయి. గత కొన్నేళ్లుగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్నికల సంఘం విఫలమౌతోందని, ఈసీపై చర్యలు తీసుకోవాలని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ డిమాండ్ చేశారు. కాగా, బీజేపీ, టీఎంసీ, బీజేడీ పార్టీల ప్రతినిధి బృందాలు మంగళవారం విడివిడిగా ఈసీని కలిసి, ఓటర్ల జాబితాలో అవకతవకలపై తమ వాదన వినిపించాయి. దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిందిగా ఈసీని కోరాయి.

కెనడాపై సుంకాలు డబుల్

వాషింగ్టన్, మార్చి 11: తమ పొరుగు దేశం కెనడాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కన్నెర్ర జేశారు. కెనడా నుంచి అమెరికాకు దిగుమతయ్యే స్టీలు, అల్యూమినియంపై ఇప్పటికే విధించిన 25% టారిఫ్‌ను రెట్టింపు చేస్తూ 50 శాతానికి పెంచబోతున్నట్లు ప్రకటించారు. ఈ పెంపు నిర్ణయం బుధవారం నుంచి అమల్లోకి రానుందన్నారు. మరోవైపు కెనడాపై అమెరికా విధించిన 25 శాతం టారిఫ్‌లకు ప్రతిగా అమెరికాలోని మూడు రాష్ట్రాలకు తాము సరఫరా చేస్తున్న విద్యుత్ ఎగుమతులపై సుంకాలను 25 శాతానికి పెంచుతున్నట్లు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రకటించింది. కెనడా తీసుకున్న ఈ నిర్ణయంపై మండిపడిన ట్రంప్ ఆ దేశానికి చెందిన కార్లు, కలప, విద్యుత్ ఇకపై తమకు అవసరం లేదని అన్నారు. సుంకాల విషయంలో కెనడా వైఖరిని తప్పుబడుతూ ఆ దేశాన్ని అతిపెద్ద సుంకాల దుర్వినియోగదారుగా అభివర్ణించారు. ఇకపై కెనడాకు అమెరికా సబ్సిడీ ఇవ్వబోదని ప్రకటించారు. కెనడా సుంకాలను పెంచుతున్నట్లు చెప్పిన అమెరికాలోని మూడు రాష్ట్రాల్లో విద్యుత్ ఎమర్జెన్సీని ప్రకటిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. కాగా, ప్రస్తుతం అమెరికాకు అత్యధిక ఇంధన ఎగుమతులు కెనడా నుంచే వస్తున్నాయి.

టెస్లా కారు కొంటా: ట్రంప్

టెస్లాను బహిష్కరించాలంటూ ఇటీవల అమెరికాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు జరగడం, ఆ సంస్థ షేర్లు పడిపోతున్న నేపథ్యంలో తాను టెస్లా కారును కొనుగోలు చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. మస్క్‌కు మద్దతుగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. "రాడికల్ లెఫ్ట్ భావజాలం కలిగిన కొంత మంది వ్యక్తులు కావాలనే కుట్రపూరితంగా టెస్లాను బహిష్కరించాలని ప్రయత్నిస్తున్నారు. టెస్లా ప్రపంచంలోనే గొప్ప ఆటోమేకర్. ఎలాన్ మస్క్ ఓ గొప్ప అమెరికన్. తనకు మద్దతుగా నేను రేపు సరికొత్త టెస్లా కారును కొనుగోలు చేస్తున్నాను. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో సహాయం చేస్తున్న అతణ్ని ఎందుకు శిక్షించాలి." అని ట్రంప్ పేర్కొన్నారు.

పర్యాటక పెట్టుబడుల కోసం

భూ కేటాయింపు పాలసీ

ఆ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ ఉత్తర్వులు

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక పెట్టుబడుల కోసం ఉద్దేశించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక భూ కేటాయింపుల పాలసీ (2024-29)ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో హోటళ్లు, రిసార్టులు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ఈ పాలసీని తీసుకువచ్చారు. రూ.కోటి పెట్టుబడి ప్రాజెక్టును మైక్రో, రూ.10 కోట్ల లోపు పెట్టుబడి ప్రాజెక్టును చిన్న, రూ.50 కోట్ల లోపు మధ్యతరహా, రూ.250 కోట్ల లోపు పెద్ద, రూ.500 కోట్ల లోపు పెట్టుబడి ప్రాజెక్టులను మెగా, రూ.500 కోట్లపైన ప్రాజెక్టులకు అల్ట్రా మెగా ప్రాజెక్టులుగా పరిగణిస్తారు. ప్రతి ప్రాజెక్టు పెట్టుబడి ఆధారంగా 33 ఏళ్ల నుంచి 66 ఏళ్ల వరకు భూ కేటాయింపులు చేయనున్నారు. అత్యధికంగా 5 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు కేటాయింపులు చేస్తారు. ఈ భూ కేటాయింపుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ చైర్మన్‌గా ఉంటారు. మరో 8 మంది సభ్యుల పర్యవేక్షణలో భూకేటాయింపులు జరుగుతాయి.

రూ.348.75 లక్షల కోట్లు ఉఫ్

(మొదటి పేజీ తరువాయి)



అతలాకుతలమవుతున్నాయి. స్వయంగా అమెరికా కూడా దీన్ని తప్పించుకోలేకపోతోంది. తీవ్ర అనిశ్చితి, ఆందోళన నేపథ్యంలో భారీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను అమెరికా స్టాక్ మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకుంటున్నారు. దీంతో గత 20 రోజుల వ్యవధిలో ఆ దేశ స్టాక్ మార్కెట్లలో నమోదైన టాప్-500 కంపెనీలు (వీటిని స్టాండర్డ్ అండ్ పూర్స్ 500 లేదా ఎస్ అండ్ పీ 500 అని అంటారు) ఏకంగా 4 లక్షల కోట్ల డాలర్ల (రూ.348.75 లక్షల కోట్ల) నష్టాన్ని చవి చూశాయి. మన దేశ బడ్జెట్ (రూ.50.65 లక్షల కోట్లు)తో పోల్చుకుంటే ఇది దాదాపు ఏడింతలు.

కొత్తలో మార్కెట్ల జోరు

వాస్తవానికి, గత ఏడాది నవంబరు 5వ తేదీన ట్రంప్ మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అమెరికా స్టాక్‌మార్కెట్లు జోరు చూపాయి. పన్ను తగ్గింపులు, నియంత్రణల తొలగింపు వంటి విధానాలను ట్రంప్ తీసుకొస్తారని మార్కెట్ వర్గాలు ఆశించాయి. ఫలితంగా, స్టాక్‌మార్కెట్లు మంచి వృద్ధి రేటును నమోదు చేశాయి. గత నెల 19న ఎస్ అండ్ పీ 500 రికార్డు స్థాయిలో ముగిసింది. అయితే, ట్రంప్ పలు దేశాలతో సుంకాల యుద్ధం మొదలుపెట్టటం, స్వదేశంలో ప్రభుత్వ ఉద్యోగులను యథేచ్ఛగా ఉద్యోగాల్లోంచి తొలగించటం వంటి విధానాలను తెస్తున్న క్రమంలో స్టాక్‌మార్కెట్ల జోరు తగ్గిపోవటమే కాదు.. బతుకుజీవుడా అనే స్థాయికి చేరుకున్నాయి. సోమవారం ఒక్కరోజే ఎస్ అండ్ పీ 500.. 2.7% మేర పతనమై 8.6% వద్ద ముగిసింది. గత ఏడాది కాలంలో ఇదే అతి పెద్ద రోజువారీ పతనం. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి సోమవారం వరకు 20 రోజుల్లో ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్‌లో దాదాపు 10 శాతం పతనం నమోదైంది. ఫలితంగా కంపెనీలు 4 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయాయని వెల్లడైంది. అమెరికా స్టాక్‌మార్కెట్లలో అతి ముఖ్యమైన నాస్డాక్ కూడా సోమవారం 4% పడిపోయింది. 2022 సెప్టెంబరు నుంచి.. ఒక్కరోజులో నాస్డాక్ ఈ స్థాయిలో పతనం కావటం ఇదే తొలిసారి.

తీవ్ర గందరగోళం

కెనడా, మెక్సికో, యూరప్‌తో మొదలుపెట్టిన సుంకాల యుద్ధం కారణంగా నెలకొన్న అనిశ్చితి.. అనేక కార్పొరేట్ సంస్థలను, సీఈఓలను భవిష్యత్ ప్రణాళికలు సమీక్షించుకునేలా చేస్తోంది' అని హ్యూస్టన్‌లో జరిగిన ఓ వాణిజ్య సదస్సులో లాజార్డ్ సీఈఓ పీటర్ ఆర్జజగ్ ఆందోళన వ్యక్తం చేశారు. లాజార్డ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇండిపెండెంట్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు. చైనాతో సై అంటే సై అనే విధానాన్ని అర్థం చేసుకోవచ్చుగానీ.. కెనడా, మెక్సికో, యూరప్‌తో ట్రంప్ ఎందుకు దుందుడుకు విధానాల్ని అవలంబిస్తున్నారనే దానిపై గందరగోళం నెలకొందని పీటర్ పేర్కొన్నారు. దీనిపై రానున్న నెల రోజుల్లోపు స్పష్టత రాకపోతే అమెరికా ఆర్థిక రంగం తీవ్రంగా దెబ్బతినబోతోందని ఆయన హెచ్చరించారు. అమెరికాలోని ప్రముఖ వైమానిక సేవా సంస్థల్లో ఒకటైన డెల్టా ఎయిర్‌లైన్స్.. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక అంచనా లాభాలను సోమవారం సగానికి తగ్గించుకుంది. ఫలితంగా ఆ కంపెనీ షేర్ల ధర ఒక్కరోజులోనే 14 శాతం పడిపోయింది. ట్రంప్ 2.0 కేవలం నెలన్నర రోజుల్లో సృష్టించిన ప్రకంపనలు అమెరికా కార్పొరేట్ రంగాన్ని వణికిస్తున్నాయి. స్వయంగా వ్యాపారవేత్త అయిన ట్రంప్ విధానాలు వ్యాపారుల ప్రయోజనాలకు లబ్ధి చేకూర్చకపోగా.. పూర్తి విరుద్ధంగా ఉండటం విచిత్రం.

సుంకాల తగ్గింపుపై అమెరికాకు హామీ ఇవ్వలేదు

పార్లమెంటరీ కమిటీకి వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 11: సుంకాల తగ్గింపు అంశంపై అమెరికాకు ఎలాంటి హామీ ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ పదేపదే లేవనెత్తుతున్న ఈ సమస్య పరిష్కారానికి సెప్టెంబరు వరకూ సమయం కోరినట్లు పార్లమెంటరీ ప్యానెల్‌కు వెల్లడించింది. తక్షణం సుంకాల సర్దుబాటు కంటే దీర్ఘకాలిక సహకారానికి ప్రాధాన్యం ఇస్తూ పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనే దిశగా భారత్, అమెరికా కృషి చేస్తున్నాయని విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముందు మంగళవారం హాజరైన వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ వివరించారు. కాగా, అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. అమెరికాపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందని, అవి ఆ దేశంలో ఏ వస్తువూ విక్రయించడానికి వీల్లేనంత స్థాయిలో ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు.

రష్యాపై ఉక్రెయిన్ భీకర డ్రోన్ దాడులు

మాస్కో సహా పది ప్రాంతాలే లక్ష్యం.. శాంతి చర్చల వేళ అనూహ్య చర్య

» 337 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశాం

» దాడుల్లో ఇద్దరి మృతి: రష్యా

మాస్కో, మార్చి 11: తమ రాజధాని మాస్కో సహా దేశంలోని పది ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ అతి భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు తెగబడిందని రష్యా సైన్యం మంగళవారం ప్రకటించింది. ఈ దాడుల్లో ఇద్దరు చనిపోయారని, 18 మంది గాయపడ్డారని వెల్లడించింది. ఉక్రెయిన్‌కు చెందిన 337 డ్రోన్లను కూల్చివేశామని వివరించింది. ఒక్క మాస్కో వైపే ఉక్రెయిన్ 91 డ్రోన్లను ప్రయోగించిందని పేర్కొంది. రష్యా దేశ భూభాగంలోపల, సరిహద్దులకు బాగా దూరంగా ఉన్న ప్రాంతాలు కలుగా, లిపెస్క్, ఓర్యోల్, ర్యాజాన్ ప్రాంతాలపై కూడా ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు దిగడం, అది కూడా యుద్ధం ముగింపుపై చర్చలు ప్రారంభమైన వేళ ఈ చర్యకు పూనుకోవడం ప్రాధాన్యం సంతరించుకొంది. మూడేళ్ల రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్ ఇంతకుముందెన్నడూ రష్యాపై ఈ స్థాయిలో డ్రోన్ దాడులు చేయలేదు. మరోవైపు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై చర్చల కోసం అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధి బృందాలు మంగళవారం సౌదీ అరేబియాలోని జెద్దా చేరుకున్నాయి. 2 బృందాల మధ్య ప్రాథమిక చర్చలు జరిగాయి.

కోటి రూపాయలు కొట్టేశారు

» సీబీఐ అధికారులమంటూ ఓ విశ్రాంత ఉద్యోగికి టోకరా

నెల్లూరు(క్రైం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారులమంటూ ఓ విశ్రాంత ఉద్యోగి వద్ద సైబర్ నేరగాళ్లు రూ.1.02 కోట్ల నగదు దోచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. నెల్లూరుకు చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి గత నెల 25న ట్రాయ్ అధికారులమంటూ ఫోన్ వచ్చింది. 'ఢిల్లీలో మీరు కొనుగోలు చేసిన సిమ్‌పై 85 ఫిర్యాదులు అందాయి. మీ పేరుపై ఉన్న బ్యాంకు ఖాతాను మనీ లాండరింగ్‌కు ఉపయోగించారు. జాతీయ భద్రతా చట్టాన్ని దుర్వినియోగం చేశారు' అని గద్దిస్తూ మాట్లాడారు. దీంతో గాబరా పడ్డ బాధితుడు.. తనకు సంబంధం లేదని వాపోయాడు. ఆ వెంటనే విశ్రాంతి ఉద్యోగికి మరో ఫోన్ వచ్చింది. సీబీఐ అధికారి శర్మను మాట్లాడుతున్నానని, మీపై కేసు నమోదైనట్లు చెప్పారు. అనంతరం మోహిత్ కంథా అనే మరో వ్యక్తి ఫోన్ చేసి తాను సీబీఐ అధికారినని, మీ కేసును దర్యాప్తు చేస్తున్న రాకేశ్ కుమార్‌తో మాట్లాడి కేసు నుంచి తప్పిస్తానన్నారు. అందరూ కలిసి ఫిబ్రవరి 27 నుంచి మార్చి 5వ తేదీ వరకు ఆ విశ్రాంత ఉద్యోగిని 'డిజిటల్ అరెస్ట్' చేశారు. అతని నుంచి రూ.1,02,47,680 నగదును డిపాజిట్ చేయించుకున్నారు. అనంతరం కేసు నుంచి తప్పించడం వీలు కావడం లేదని, బెయిల్ పొందేందుకు మరో రూ.3 కోట్లు డిపాజిట్ చేయాలని వారు చెప్పడంతో ఆయనకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, రూ.23 లక్షలను మంగళవారం ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు.


గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ పార్థివదేహంపై జాతీయ పతాకాన్ని కప్పుతున్న పోలీసులు

గరిమెళ్లకు కన్నీటి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు
- బాలకృష్ణ ప్రసాద్ మృతిపై ప్రధాని మోదీ సంతాపం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు)/తిరుమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు సంగీతాభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో ఆదివారం కన్నుమూసిన ఆయనకు ప్రభుత్వ అధికార లాంఛనాలతో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా అధికార యంత్రాంగం అంత్యక్రియల్లో పాల్గొని గరిమెళ్లకు నివాళులర్పించారు. తిరుపతి భవానీనగర్‌లోని నివాసం నుంచి అంతిమ యాత్ర సాగింది. అన్నమాచార్య సంకీర్తనలను ఆలపిస్తూ అభిమానులు, శిష్యులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. హరిశ్చంద్ర శ్మశానవాటికలో గరిమెళ్ల గౌరవార్థం పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి గౌరవ వందనం పలికారు. అంతకుముందు బాలకృష్ణ ప్రసాద్ పార్థివదేహానికి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ పుష్పగుచ్ఛంతో నివాళులర్పించగా, పోలీసులు జాతీయ పతాకాన్ని కప్పారు. కాగా, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 'గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి బాధాకరం. ఆయన ఆలపించిన కీర్తనలు గొప్ప ఆధ్యాత్మిక, సంగీత వారసత్వాన్ని కొనసాగిస్తూ అనేక మంది హృదయాలను స్పృశించాయి. ఆయన ఒక ప్రతిభావంతుడిగా, సంగీత కళాకారుడిగా, స్వరకర్తగా మనందరికీ గుర్తుండిపోతారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను' అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

డెయిరీ ఫాం కోసం లంచం

- ఏసీబీకి చిక్కిన పరిశ్రమల ప్రోత్సాహక అధికారి

అద్దంకి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా డెయిరీ ఫాంల ఏర్పాటుకు దరఖాస్తులను ప్రాసెస్ చేసేందుకు లంచం తీసుకుంటూ అద్దంకి, చీరాల నియోజకవర్గాల పరిశ్రమల ప్రోత్సాహక అధికారి తన్నీరు ఉమాశంకర్ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర మాతే కథనం మేరకు.. సంతమాగులూరుకు చెందిన వీర్ల రమేష్‌బాబు, అద్దంకి అశ్వని పీఎంఈజీపీ ద్వారా రూ.20 లక్షల చొప్పున బ్యాంక్ రుణాలు పొందేందుకు పరిశ్రమల శాఖ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ప్రాసెస్ చేసేందుకు ఉమాశంకర్ రూ.20 వేల చొప్పున లంచం డిమాండ్ చేశారు. దీంతో రమేష్‌బాబు, అశ్వని సోదరుడు స్టీఫెన్ గుంటూరు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం అద్దంకిలో కే అండ్ కే కన్సల్టెన్సీ ఆఫీస్‌లో ఉన్న ఉమాశంకర్ డబ్బు తీసుకురమ్మని దరఖాస్తుదారులకు చెప్పారు. వారు తీసుకెళ్లగా అక్కడ పనిచేసే కిషోర్‌బాబును తీసుకోమని ఉమాశంకర్ చెప్పారు. డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి, ఉమాశంకర్, కిషోర్‌బాబును అదుపులోకి తీసుకున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో జస్టిస్ ఎన్వీ రమణ


జస్టిస్ ఎన్వీ రమణకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

అన్నవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

'తొక్కిసలాట'పై మళ్లీ విచారణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి' తొక్కిసలాట ఘటనపై నియమించిన ఏకసభ్య కమిషన్ మూడో దశ విచారణను శనివారం నుంచి వేగవంతం చేయనుంది. ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ఈ నెల 15న తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్సుతో పాటు తిరుమలలో శ్రీవారి దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్లను రెండు రోజులపాటు పరిశీలించనున్నారు.

అలిపిరిలో మళ్లీ అండర్ గ్రౌండ్ స్కానింగ్

తిరుమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే వాహనాలను నిశితంగా తనిఖీ చేసేందుకు అలిపిరిలో అండర్ గ్రౌండ్ స్కానింగ్ విధానం తిరిగి మొదలైంది. గరుడ విగ్రహం సమీపంలోని ఆర్చి వద్ద గతంలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే స్కానింగ్ యంత్రాలు మరమ్మతులకు గురవడంతో గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం వాటికి మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు.

రూ.2,200 కోట్లకు చేరిన అన్నప్రసాద విరాళాలు

తిరుమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.2,200 కోట్ల విరాళాలు వచ్చాయంటూ టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు 'ఎక్స్'లో వెల్లడించారు. అన్నప్రసాదం ట్రస్టు గొప్పదనం గురించి తన పోస్ట్ ద్వారా వివరించారు.

నిర్మాణం సరే.. నిర్వహణ ఎలా?

- మురుగునీటి శుద్ధి ప్లాంట్ల టెండర్లలో అవకతవకలు
- మున్సిపాల్టీల్లో రూ.350 కోట్లతో 40 ప్లాంట్ల నిర్మాణం
- ఎన్నికల ముందు హడావుడిగా వైసీపీ ప్రభుత్వం టెండర్లు
- పెద్దఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు
- ప్లాంట్ల నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించాలని డిమాండ్లు

(నరసరావుపేట-ఆంధ్రజ్యోతి)


పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మున్సిపాల్టీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు

మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్‌టీపీ) టెండర్లలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీల్లో ఎస్‌టీపీల నిర్మాణానికి ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం హడావుడిగా నిర్వహించిన టెండర్లలో నిబంధనలు పాటించలేదు. ఈ ప్రక్రియలో పెద్దఎత్తున ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.350 కోట్లతో 40 ఎస్‌టీపీల నిర్మాణ పనులకు టెండర్లు నిర్వహించారు. అయితే వీటి నిర్వహణ బాధ్యతల నుంచి కాంట్రాక్టర్లను తప్పించడంతో నిర్మాణం అనంతరం ప్లాంట్లను నిర్వహించే పరిస్థితి ఉండదు. ఇందుకు వెచ్చించిన రూ.వందల కోట్లు నిరుపయోగంగా మారనున్నాయి. మున్సిపాల్టీలలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు కాల్వల ద్వారా వాగుల్లో కలుస్తోంది. ఈ మురుగుతో వాగులు, చెరువుల్లోని నీరు కూడా కలుషితమవుతోంది. పంట పొలాలకు ఈ నీటినే వినియోగించడంతో పంట ఉత్పత్తులపై ప్రభావం చూపుతోంది. నీటి కాలుష్యాన్ని అరికట్టడానికి మురుగునీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశించింది. మురుగునీటిని శుద్ధి చేసిన అనంతరమే బయటకు విడుదల చేయాలని సూచించింది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్‌టీపీల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఎన్నికలకు ముందే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. కొన్ని మున్సిపాల్టీల్లో పనులు మొదలయ్యాయి.

నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు

ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఈ ప్లాంట్ల నిర్మాణంలో నిబంధనలను తుంగలో తొక్కారు. ప్లాంట్ నిర్మాణంలో సివిల్ పనుల వ్యయం 50 శాతం, యంత్రాలు, సెన్సర్లు వంటి సామగ్రి వ్యయం 50 శాతంగా ఉంది. ప్లాంట్ల నిర్మాణం వరకే టెండర్ నిర్వహించారు. నిర్వహణ గురించి అందులో ప్రస్తావించలేదు. గతంలో టీడీపీ హయాంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు నిర్వహించిన టెండర్లలో నిర్మాణంతో పాటు నిర్వహణ అంశాన్ని కూడా పొందుపరిచారు. గుంటూరు జిల్లా తెనాలి, పల్నాడు జిల్లా చిలకలూరిపేటల్లో ఎస్‌టీపీల నిర్మాణంతో పాటు పదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే వైసీపీ హయాంలో మాత్రం ప్లాంట్ల నిర్వహణను పురపాలక సంస్థలకు అప్పగించే దిశగా టెండర్లు జరిగాయి. అయితే దీనికి తగిన నైపుణ్యం ఉన్న ఉద్యోగులు మున్సిపాల్టీల్లో లేరని, వాటిలో తలెత్తే లోపాలను సరిదిద్దే పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు.

నాసిరకంగా పనులు

ఎస్‌టీపీల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌కు లేకపోవడంతో పనులు నాసిరకంగా చేస్తారన్న వాదన వినిపిస్తోంది. సివిల్ పనుల్లో పెద్దగా సమస్య లేకపోయినా మురుగు నీటిని శుద్ధి చేసే పరికరాలు, యంత్రాలు తక్కువ నాణ్యతతో కూడినవి వినియోగించే ప్రమాదం ఉంది. దీంతో ప్లాంట్ ఎక్కువ రోజులు పనిచేసే అవకాశం ఉండదని మున్సిపల్ ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకుంటే వీటికోసం వెచ్చిస్తున్న రూ.350కోట్లు నిరుపయోగం అవుతాయన్న అభిప్రాయాన్ని ఇంజనీర్లు వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల పాటు ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించే విధంగా గతంలో జరిగిన ఒప్పందాలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పునఃపరిశీలించాలని సూచిస్తున్నారు.

'హయగ్రీవ' భూములు స్వాధీనం

- ప్రభుత్వ భూములంటూ బోర్డుల ఏర్పాటు
- లోపలకు ఎవరూ వెళ్లకుండా ముళ్లకంచె
- 22-ఏలో చేర్చాలని రిజిస్ట్రార్‌కు ఆదేశం


హయగ్రీవకు కేటాయించిన భూమి వద్ద లోనికి ఎవరూ వెళ్లకుండా స్తంభాలు పాతి, కంచె వేసిన దృశ్యం

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎండాడలో హయగ్రీవ ఫార్మ్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించిన 12.51 ఎకరాలను రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వృద్ధాశ్రమం నిర్మిస్తామని చెప్పి భూమిని తక్కువ ధరకు తీసుకొని, దానిని ప్లాట్లుగా విభజించి విక్రయించడం, వివరణ కోరితే పొంతన లేని సమాధానం చెప్పడంతో భూమిని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ బాధ్యతను భీమిలి ఆర్డీవో, విశాఖ రూరల్ తహసీల్దార్లకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అప్పగించారు. వారంతా సిబ్బందితో మంగళవారం ఉదయం ఎండాడలో నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి అక్కడున్న పనివారిని బయటకు పంపించేశారు. ఆ భూమిలో 'ఇది ప్రభుత్వ భూమి. ఆక్రమణదారులు శిక్షార్హులు' అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంగణంలోకి వాహనాలు వెళ్లకుండా దారికి అడ్డంగా సిమెంట్ స్తంభాలు పాతించారు. ఆ తరువాత ముళ్ల కంచె ఏర్పాటుచేశారు. అక్కడ కలెక్టర్ ఇచ్చిన నోటీసును గోడకు అతికించారు. ఉద్దేశించిన ప్రయోజనాలకు భూమిని ఉపయోగించకుండా థర్డ్ పార్టీలకు అమ్ముకున్నారని, ఓ వ్యక్తికి 600 గజాల స్థలాన్ని రూ.2.5 కోట్లకు విక్రయించగా, అందులో రూ.1.5 కోట్లు హయగ్రీవ భాగస్వాములకు ముట్టినట్టు తమకు రాతపూర్వక ఫిర్యాదు అందిందని కలెక్టర్ ఆ నోటీసులో పేర్కొన్నారు. అనేక అంశాలపై వివరణ కోరినప్పుడు తప్పుడు సమాచారం ఇచ్చారని, 61 మంది గ్రూపు డెవలప్‌మెంట్ స్కీమ్ కింద సేల్ డీడ్లు రాశారని, అడిగితే అవి అగ్రిమెంట్లు అని అబద్ధాలు చెప్పారని, అవన్నీ రిజిస్ట్రార్ కార్యాలయంలో లభించిన పత్రాల ద్వారా నిర్ధారించుకున్నామన్నారు. హైకోర్టు తీర్పులు, ప్రభుత్వం ఆదేశం మేరకు భూమిని స్వాధీనం చేసుకుంటున్నామని పేర్కొన్నారు.

సీసీఎల్‌ఏ ఆదేశం మేరకు...


ఎండాడలో హయగ్రీవ భూమిని నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకొని నివేదిక సమర్పించాలని సీసీఎల్‌ఏ ఆదేశించడంతో కలెక్టర్ ఆ బాధ్యతను విశాఖ రూరల్ తహసీల్దార్‌కు అప్పగించారు. ఎండాడ సర్వే నంబరు 92/3లో 12.51 ఎకరాల భూమిని పంచనామా ద్వారా వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం అంతా భీమిలి ఆర్డీవో పర్యవేక్షణలో జరగాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌కు ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్ ఈ భూములను ప్రభుత్వ భూముల జాబితా 22-ఏ(1)(ఏ)లో పెట్టాలని లేఖ రాశారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రమే మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మెయిల్ పంపించారు. ఆ భూమికి సంబంధించి ఇకపై ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆ మెయిల్‌లో ఆదేశించారు.

ఘరానా మోసగాడు అరెస్ట్

- టీటీడీ ఈవో పేరిట నకిలీ మెయిల్
- టికెట్లు జారీ చేస్తానంటూ నగదు వసూలు
- భక్తుల ఫిర్యాదుతో అరెస్ట్ చేసిన తిరుమల పోలీసులు

తిరుమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో పేరిట నకిలీ ఈమెయిల్ క్రియేట్ చేసి భక్తులను మోసగిస్తున్న యువకుడిని తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి సెల్‌ఫోన్, నాలుగు బ్యాంకు పాస్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన బోయ పవన్ కల్యాణ్ అలియాస్ పవన్ (24) టీటీడీ ఈవో ఒరిజనల్ ఈమెయిల్ తరహాలో ఉండేలా 'టీటీడీఈవోటీవోటీఅట్‌జీమెయిల్.కామ్' అనే నకిలీ ఈమెయిల్ క్రియేట్ చేశాడు. భక్తులు ఎవరైనా గూగుల్‌లో టీటీడీ ఈవో, టీటీడీ జేఈవో, అడిషనల్ ఈవో అని వెతికితే తన నకిలీ ఈమెయిల్ కనిపించేలా సెట్ చేసుకున్నాడు. భక్తులు దర్శనం కోసం లేఖను పంపితే అందులోని నంబర్లకు పవన్ ఫోన్ చేసేవాడు. తాను జేఈవో కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని, టికెట్ల జారీకి కొంత నగదు ఖర్చు అవుతుందని చెప్పేవాడు. నగదు చెల్లించిన భక్తులు కాల్ చేస్తే ట్రూకాలర్‌లో టీటీడీ జేఈఈవో ఆఫీస్ అని వచ్చేలా ఫీడ్ చేసి పెట్టుకున్నాడు. దీంతో భక్తులు నమ్మి మోసపోయేవారు. నగదు తీసుకున్న తర్వాత భక్తుల నంబర్లను బ్లాక్ చేసేవాడు. ఈ నేపథ్యంలో కొంతమంది భక్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు మంగళవారం పవన్‌ను అరెస్ట్ చేశారు. అతనిపై ఇప్పటికే కొత్తచెరువు, తమిళనాడులోని రామనాథపురం పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నట్టు తెలిసింది.

విజ్ఞాన్ విద్యార్థికి రూ.50 లక్షల వార్షిక వేతనం


హర్షను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు

అగనంపూడి (విశాఖపట్నం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పరిధిలోని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ నాలుగో సంవత్సరం చదువుతున్న బలస హర్ష.. అమెజాన్ కంపెనీలో రూ.50 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హర్షను ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విద్యార్థులకు తొలి ఏడాది నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు కోడింగ్‌పై శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి దినేశ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్టోబరు నాటికి డంపింగ్ యార్డు రహిత ఏపీ

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి
- 15న తణుకులో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'



విశాఖపట్నం, తణుకు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబరు రెండో తేదీ నాటికి డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ అధికారులు, కార్పొరేటర్లతో పట్టాభిరామ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో చెత్త, పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా, యూసీడీ విభాగాల ద్వారా అందుతున్న సేవలు, కార్యక్రమాలను అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం పట్టాభి మీడియాతో మాట్లాడుతూ.. 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'గా ఏపీని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛతా ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. దీనికోసం ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో 'స్వచ్ఛత' కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వ శాఖలకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. కాగా.. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 15న పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో పర్యటించనున్నారు. తొలుత పాలిటెక్నిక్ కాలేజీ ఆడిటోరియంలో 300 మంది పార్టీ ప్రతినిధులతో ముఖాముఖిలో పాల్గొంటారు. జడ్పీ స్కూలులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కోవిడ్: నిన్న, నేడు, రేపు

ఐదేళ్ల క్రితం (11 మార్చి, 2020) ప్రపంచ ఆరోగ్య సంస్థ కోవిడ్–19ని ప్రపంచ మహమ్మారిగా ప్రకటించింది. దీని విలయ తాండవం 2019 డిసెంబర్‌లో చైనాలో ప్రారంభమై రోజులు, వారాల వ్యవధిలో దావానలంలా సమస్త ప్రపంచానికి విస్తరించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు తలకిందులయ్యాయి. కోట్లాది శ్రామికుల జీవనాధారాలు ధ్వంసమయ్యాయి. ఆరోగ్య విపత్తు ఒక మహాసంక్షోభంగా పరిణమించింది. వివేకం, మానవత, విజ్ఞానాల ఆలంబనతో మానవాళి ఆ విషక్రిమిని అణచివేసింది.

కోవిడ్ భయంకరానుభవాల నుంచి మానవాళి పూర్తిగా బయటపడినట్టేనా? లేదనే చెప్పక తప్పదు. డోనాల్డ్ ట్రంప్ గారి దేశంలో 2024 ఆఖరివారంలో సైతం 521 మంది కోవిడ్‌తో మరణించినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధిపరిచిన వ్యాక్సిన్ల కారణంగా మరణాలు, ఆస్పత్రులలో చేరవల్సిన అగత్యాలు తగ్గిపోయినప్పటికీ కరోనా మహమ్మారి తగ్గుస్థాయిలోనే అయినా తన ప్రతాపం చూపుతూనే ఉన్నది. కోవిడ్ సంక్షోభంతో ఆరోగ్య భద్రతా సేవల్లో అసమానతలు ఎల్లెడలా ఎంత తీవ్రంగా ఉన్నాయో తెలిసి వచ్చింది. అన్ని విధాలా సంపన్నదేశమైన అమెరికానే భవిష్యత్తులో విజృంభించే ప్రాణాంతక అంటువ్యాధుల విషయం అటుంచి అసలు కోవిడ్–19 నైనా సంపూర్ణంగా ఎలా నిరోధించగలుగుతుందనేది ఇదమిత్థంగా చెప్పలేని పరిస్థితి. ఆ వైరస్ నుంచే కాకుండా భావి ప్రాణాంతక అంటువ్యాధుల నుంచి, సంపూర్ణ విమోచన ఎప్పటికి, ఎలా సాధ్యమవుతుంది?

ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ప్రతినెలా కనీసం 2000 మందిని బలి గొంటున్న కోవిడ్–19కి, సిఫిలిస్, ఎయిడ్స్, క్షయ ఇత్యాది సాంక్రామిక వ్యాధుల మధ్య కొన్ని సాదృశ్యాలు ఉన్నాయని మిచిగాన్ విశ్వవిద్యాలయ వైద్య శాస్త్ర ఆచార్యుడు పావెల్ హెచ్ కజాంజియన్ అన్నారు. మహమ్మారులు, సాంక్రామిక వ్యాధులను నిర్మూలించాలంటే నవీన చికిత్సా పద్ధతులు, శక్తిమంతమైన ఔషధాలు మాత్రమే సరిపోవని, ప్రజాహితకరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఉండడం తప్పనిసరి అని ఆయన తన 'Persisting Pandemics' అన్న పుస్తకంలో విపులంగా నిర్ధారించారు. 15వ శతాబ్దం నుంచి పీడిస్తున్న సిఫిలిస్, గత శతాబ్ది పూర్వార్థంలో సల్వార్సన్, పెన్సిలిన్ అనే డ్రగ్స్‌తో అదుపులోకి వచ్చినప్పటికీ ప్రజారోగ్య వ్యవస్థలు ఆ వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించడంలో విఫలమయ్యాయి. అధునాతన చికిత్సా పద్ధతులు, ఔషధాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఆ వ్యాధి అంతమొందకపోవడానికి కారణం సామాజిక ఆర్థిక పరిస్థితులేనని కజాంజియన్ స్పష్టం చేశారు. 2020లల్లో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 80 లక్షల కొత్త సిఫిలిస్ కేసులు నమోదవుతున్నాయి. 1980వ దశకంలో వెలుగులోకి వచ్చిన ఎయిడ్స్ వ్యాధి నివారణకు పటిష్ఠమైన చికిత్సా పద్ధతులు, ఔషధాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఏటా దాదాపు ఏడు లక్షల మంది ఆ వ్యాధితో చనిపోతున్నారని, దాదాపు నాలుగుకోట్ల మంది హెచ్ఐవి వైరస్‌తో సహజీవనం చేస్తున్నారని ఆయన తెలిపారు. పారిశ్రామిక విప్లవానంతరం యూరోపియన్ నగరాలలో ప్రబలిన క్షయ వ్యాధి ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఏటా కనీసం 17 లక్షల మందిని బలిగొంటూనే ఉన్నది. పేదరికంలో మగ్గుతున్నవారే ఈ వ్యాధికి బలవుతున్నారు. ఈ సాంక్రామిక వ్యాధులకు కారణమైన సూక్ష్మజీవుల నిర్మూలన లక్ష్యంగా చికిత్సా పద్ధతులు, ఔషధాల అభివృద్ధి ఎంతగా జరిగినా ప్రజారోగ్య కార్యక్రమాలను ఎంత సమర్థంగా అమలుపరిచినా అమానుష సామాజిక, ఆర్థిక పరిస్థితులే ఆ వ్యాధులు కొనసాగేందుకు కారణమవుతున్నాయని కజాంజియన్ నిర్ధారించారు. సాంక్రామిక వ్యాధుల నివారణకు, రోగకారక విషక్రిములను నిర్మూలించేందుకు ఆధునిక వైద్యశాస్త్రం మహాశక్తిమంతమైన చికిత్సాపద్ధతులు, ఔషధాలను అభివృద్ధిపరిచిందని, అయితే ఆ వ్యాధుల విస్తరణకు కారణమవుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను తొలగించినప్పుడు మాత్రమే సంపూర్ణ ప్రజారోగ్యం సాధ్యమవుతుందని కజాంజియన్ స్పష్టం చేశారు. మన ప్రజారోగ్య వ్యవస్థల బాధ్యులు ఈ సత్యాన్ని ఉపేక్షిస్తే మన ఆరోగ్య భవిష్యత్తు నిన్నటి దుఃఖమయ ఇతిహాసమే అవుతుందనడంలో సందేహం లేదు.

వాతావరణ మార్పు సంక్షోభం వలే, భావి మహమ్మారులను కూడా మానవాళి మనుగడకు ఒక మౌలిక సవాలుగా తీసుకోవాలి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కోవిడ్ ఆనవాళ్లను పూర్తిగా చెరిపివేసేందుకు, సంభావ్య మహమ్మారుల నెదుర్కొనే విషయమై చట్టసభల్లో ప్రత్యేక చర్చలు జరగాలి. భావి మహమ్మారులను నిరోధించే విషయమై పంచాయత్ స్థాయి నుంచి ప్రజాప్రతినిధులు అందరికీ అవగాహన కల్పించాలి. సమస్య తీవ్రతపై స్పష్టత ఉంటే ఆర్థిక వనరులు సమకూర్చుకోవడంలో అవరోధాలను అధిగమించడం సులభమవుతుంది. కోవిడ్ విపత్తులో లాక్‌డౌన్ శృంఖలాలలో జనజీవనం అల్లాడిపోయినప్పుడు సామాన్య ప్రజలలో వెల్లువెత్తిన మానవతా స్పందనలను భావి మహమ్మారుల నిరోధానికి స్ఫూర్తిగా నిలుపుకోవాలి. ఆ మానవతా సేవలలో పాల్గొన్నవారి అనుభవాలను, సంబంధిత పాత్రికేయ కథనాలు, వ్యాఖ్యానాలను నిర్దుష్ట రీతుల్లో భద్రపరచుకోవడం మరీ ముఖ్యం.

కాంగ్రెస్‌లో కోవర్టులు కొత్త వాస్తవమా?



■ ఎ. కృష్ణారావు


ఇండియాగేట్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన సరిగా పనిచేయడం లేదని నలుగురైదుగురు కాంగ్రెస్ నేతలు తరుచూ ఢిల్లీ వచ్చి సోనియాగాంధీకి ఫిర్యాదు చేస్తూ ఉండేవారు. అప్పుడు ఢిల్లీలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉండేది కనుక పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆమెను కలుసుకునేందుకు నేతలు క్యూలు కట్టేవారు. ఒక రోజు సోనియాగాంధీ లోక్‌సభలోనే ఒక వర్కింగ్ కమిటీ సభ్యుడితో మాట్లాడుతూ 'ఇదేమిటి? వైఎస్‌పై ఎప్పుడూ ఏవో ఫిర్యాదులు వస్తున్నాయి' అని అడిగారు. 'మేడమ్, మీ పక్కన మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీ, శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్, చిదంబరం, నేనూ కూర్చున్నాం. మన్మోహన్ సింగ్ ఎప్పుడూ ఎన్నికల్లో నెగ్గలేదు. చిదంబరం ఎంపీగా ఉన్న తమిళనాడులో కాంగ్రెస్ ఎప్పుడూ అధికారంలోకి రాలేదు. శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్ మన పార్టీ కాదు. ప్రణబ్ ముఖర్జీ నాలాగే మొదటిసారి ఎన్నికల్లో గెలిచారు. మీరు యూపీ నుంచి గెలిచారు కాని యూపీలో మన పార్టీ లేదు. పార్టీ పెద్దలు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోతే, మరి కాంగ్రెస్ పార్టీని గెలిపించి అధికారంలోకి తీసుకువచ్చిన వైఎస్ మీద ఫిర్యాదులు వస్తే ఆయన అధికారం ఎలా చలాయించాలో మనం చెప్పగలమా..' అని ఆయన జవాబిచ్చారు. అందుకు సోనియా నిజమే.. అని నవ్వుతూ అంగీకరించారు. మరునాడు సెంట్రల్ హాలు గుండా వెళుతుండగా ఒక మాజీ ఎంపీ ఆమె వెంటపడి వైఎస్‌పై ఏవో ఫిర్యాదులు చేయబోతే గట్టిగా మందలించారు. 'మీకు ఇదే పనా?' అని అడిగారు. దీనితో ఆయన ఖంగుతిని వెళ్లిపోయారు. మొదట్లో వైఎస్ మాటిమాటికీ ఢిల్లీ వచ్చి రాష్ట్ర పరిణామాల గురించి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చేది. ఎవరు ఏ లేఖలు రాసినా, ఫిర్యాదులు చేసినా ఆయనను పిలిపించేవారు. కాని ఆయన క్రమంగా తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నవారిపై పై చేయి సాధించారు. వారి ఎత్తులకు పై ఎత్తు వేసేవారు. అధిష్ఠానం వద్ద తన నిర్ణయాల గురించి గట్టిగా వాదించేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును బలంగా వ్యతిరేకించేవారు. ఒక సందర్భంలో తాను రాజీనామా చేసి బెంగళూరు వెళిపోతానని చెప్పినట్లు సమాచారం. తొలి రోజుల్లో తాను అంతరాత్మగా వ్యవహరించే కేవీపీ రామచందర్‌రావుకు రాజ్యసభ టికెట్ ఇప్పించుకోలేకపోయారు. కాని క్రమంగా అధిష్ఠానంపై పట్టు సాధించిన తర్వాత కేవీపీకి టికెట్ ఇవ్వాల్సి వచ్చింది. తన వర్గీయులకే ఎమ్మెల్యే టిక్కెట్లు ఇప్పించుకోగలిగిన శక్తి ఆయన సంపాదించారు.

కాంగ్రెస్ రాజకీయాలు అప్పటికీ ఇప్పటికీ ఏమైనా మారాయా? అధిష్ఠానం విన్నా, వినకపోయినా ఇప్పటికీ ఢిల్లీ వచ్చి నేతల్ని కలుసుకుని ఫిర్యాదులు చేసేవారు మాత్రం మారలేదు. సోనియాగాంధీ పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జిల నివేదికలకు ఎక్కువ విలువ ఇచ్చేవారు. వారు మేనేజ్ అవుతున్నారంటే మార్చేసేవారు. కాంగ్రెస్ దాదాపు అన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు ఢిల్లీలో నిరంతరం అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతల హడావిడి ఎక్కువగా ఉండేది. ప్రతి పార్టీ ప్రధాన కార్యదర్శి చుట్టూ రాష్ట్రాల నేతలు తిరిగేవారు. టికెట్ కోసం ఢిల్లీలో నేతల చుట్టూ ఎలా తిరగాల్సి వచ్చేదో ఇటీవల మాజీ కాంగ్రెస్ నేత గల్లా అరుణకుమారి తన ఆత్మకథలో రాశారు. ఒక నాయకుడు తానిచ్చిన కాగితాలు క్రింద విసిరికొట్టారని చెప్పారు. రాష్ట్ర సీనియర్ నేతల అంతర్గత రాజకీయాలు తన పుస్తకంలో స్పష్టంగా వివరించారు. కాంగ్రెస్ వివిధ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన తర్వాత కూడా కాంగ్రెస్ ఢిల్లీ నాయకత్వం పనిచేసే తీరు మాత్రం మారలేదు.

కాంగ్రెస్ కూడా ఇప్పటి బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకున్నట్లే లాగే వివిధ రాష్ట్రాల్లో తామే అధికారంలో ఉండాలని కోరుకునేది. 'బండి ముందుకు సాగాలంటే రెండు ఎద్దులు ఉండాలి. ఆ విధంగా కాక ఒకటి ఎద్దు, మరొకటి ఒంటె, గాడిద, కంచర గాడిదో అయితే బండి ముందుకు సాగదు..' అని రాజీవ్ గాంధీ స్వయంగా చెప్పారు.

ఇటీవల రాహుల్‌గాంధీ గుజరాత్‌లో కాంగ్రెస్ ముఖ్యనాయకులతో సమావేశమైన తర్వాత తమ పార్టీలో సగం మంది నాయకులకు పైగా బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నారని చెప్పారు. అయితే రాహుల్‌గాంధీ చెప్పిందేమీ కొత్త విషయం కాదు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టు సంస్కృతి ఎప్పటి నుంచో ఉన్నది. అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ నేతలు తమ పనులకోసం అధికారంలో ఉన్న తమ ప్రత్యర్థి పార్టీతో అంటకాగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కొందరు కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నారు. దిగ్విజయ్‌సింగ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలంలో మధ్యప్రదేశ్‌లో చాలా మంది కాంగ్రెస్ నేతలు, ఆయన సోదరుడితో సహా బీజేపీలో చేరారు. 'ఇదేమిటి సార్.' అని అడిగినప్పుడు 'మరి వారంతా ఎలా బతకాలి? అధికారంలో లేనప్పుడు అధికారంలో ఉన్న పార్టీ నేతలతో చేతులు కలపడం అనేది మామూలే. మళ్లీ ఎన్నికలు వస్తున్నాయంటే ఒక విజిల్ వేస్తే వారంతా మళ్లీ మా పార్టీలోకి వస్తారు చూడండి..' అని నవ్వారు. ఆయన చెప్పిన విధంగా అయిదేళ్ల తర్వాత మళ్లీ దిగ్విజయ్‌సింగ్ సోదరుడితో పాటు బీజేపీలో చేరిన అనేకమంది కాంగ్రెస్ నేతలు మళ్లీ స్వంత పార్టీలోకి వచ్చారు. అయితే పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం ఉన్నప్పుడే ఏ విజిల్ అయినా పనిచేస్తుంది. గుజరాత్‌లోనే కాదు, అనేక రాష్ట్రాల్లో నరేంద్రమోదీ ఇతర పార్టీల నేతల్ని ఎలా మచ్చిక చేసుకోవాలో, తన పార్టీని ఎలా విస్తరించాలో అన్న విషయంపై పట్టు సాధించారు. రాజకీయాల్లో అవసరాలు, ప్రయోజనాలు, ప్రలోభాలను అధిగమించి వ్యవహరించేవారు అరుదు. మొగల్స్, పోర్చుగీస్, డచ్, బ్రిటిష్ వారు దండయాత్రలు చేసి రాజ్యాలు కబళించినప్పుడు కూడా వారి అండకోసం స్థానిక రాజులు ప్రయత్నించిన ఉదంతాలు ఎన్నో. ఇప్పుడు పార్టీ నేతల్లో అత్యధికులు కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులే. తమ సొంత ప్రయోజనాలకోసం ఇతర పార్టీ నేతలతో అంటకాగకూడదంటే వింటారా. వారు వింటారన్న గ్యారంటీ లేదుగాక లేదు.



akbar

> ఒకప్పుడు బీజేపీ తాను ఇతర పార్టీలకంటే భిన్నమైన పార్టీ అని చెప్పుకుని వెలుగులోకి వచ్చిందని, ఇప్పుడు బీజేపీకి భిన్నమైనదిగా తన విశిష్టతను కాంగ్రెస్ నిరూపించుకోవాల్సి ఉన్నదని మాజీ కాంగ్రెస్ నేత ఒకరు అన్నారు. కాంగ్రెస్ నేతలు కోవర్టులుగా వ్యవహరించడం ఆ పార్టీ నాయకత్వ వైఫల్యానికి, బలహీనతకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఒకర్నొకరు ఓడించుకున్న, ఒకర్నొకరు పార్టీలో పైకి ఎదగకుండా అడ్డుకున్న సందర్భాలు అసంఖ్యాకం. ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ద్రోణంరాజు సత్యనారాయణ, భాట్టం శ్రీరామమూర్తి మధ్య ఆసక్తికరమైన వైరం ఉండేది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డితో సహా అనేకమంది రాజకీయ నేతలు తమ స్వంత పార్టీ నేతల్నే ఓడించుకుని, తమ ముఖ్యమంత్రులనే గద్దె దించేందుకు ప్రయత్నించిన ఉదంతాలు ఎన్నో. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కూడా ఈ వెన్నుపోట్ల రాజకీయాలకు గురైనవారే. 1998లో పీసీసీ అధ్యక్షుడైన తర్వాత వైఎస్ ఈ విషయం పార్టీ సమావేశంలోనే అంగీకరించారు. 'నాతో సహా అందరం ఒకర్నొకరు ఓడించుకునేందుకు ప్రయత్నించాం. ఇకమీదట మనమెవరూ అలా చేయకూడదు. కాంగ్రెస్‌ను బతికించుకోవాలంటే మనమందరం కలిసి పనిచేయాలి. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించేందుకు అందరం కృషి చేయాలి..' అని ఉపన్యసించారు. కాని ఆ తర్వాత పరిస్థితుల్లో పెద్దగా మార్పులు కనపడలేదు.

విచిత్రమేమంటే కాంగ్రెస్‌పై తిరుగుబాటు చేసి, స్వంత పార్టీలు పెట్టినవారు మళ్లీ అదే పార్టీలోకి వచ్చి కీలకమైన పదవులు పొందిన దాఖలాలు ఉన్నాయి. చెన్నారెడ్డి, ప్రణబ్ ముఖర్జీ, మూపనార్, చిదంబరం, కరుణాకరన్, ఆంటోనీ, బన్సీలాల్, బంగారప్ప, ఎన్డీ తివారీ, అర్జున్ సింగ్, సుఖ్‌రామ్, సురేశ్ కల్మాడీ లాంటివారు వీరిలో ఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. వీరంటే అసంతృప్తికి గురై, తమకు ప్రాధాన్యం లేదని స్వంత పార్టీలు పెట్టుకుని వెళ్లిపోయి మళ్లీ వచ్చినవారైతే సైద్ధాంతికంగా పూర్తిగా భిన్నమైన భారతీయ జనతా పార్టీలో చేరిన నేతలు కూడా కాంగ్రెస్‌కు చెందినవారు కావడం విస్మయం కలుగుతోంది. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు వంటి పదవులు అనుభవించిన ఎస్ఎం కృష్ణ, అమరేందర్ సింగ్, జ్యోతిరాదిత్య సింధియా, ఆర్‌పిఎన్ సింగ్ లాంటి వారు, పలువురు కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు బీజేపీలో చేరారంటే కాంగ్రెస్‌లో ఉండి వారు కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఎంతమేరకు జీర్ణించుకున్నారా అన్న అనుమానాలకు ఆస్కారం లభిస్తుంది.

మహాత్మాగాంధీ కాలంలో జిన్నాతో విభేదించినా, సావర్కర్‌తో విభేదించినా సెక్యులరిజం అనే సిద్ధాంతాన్ని కాంగ్రెస్ బలంగా అనుసరించేదని, క్రమక్రమంగా ఈ సిద్ధాంతం పలచబడిపోయిందని మాజీ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఆర్థిక విధానాల మధ్య వ్యత్యాసం చెరిగిపోవడం కూడా కాంగ్రెస్ బలహీనపడడానికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు బీజేపీ తాను ఇతర పార్టీలకంటే భిన్నమైన పార్టీ అని ప్రచారం చేసి వెలుగులోకి వచ్చిందని, ఇప్పుడు బీజేపీకి భిన్నమైన పార్టీగా తన విశిష్టతను కాంగ్రెస్ నిరూపించుకోవాల్సి ఉన్నదని ఆయన చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ తాను ప్రజల విశ్వాసాన్ని చూరగొని మళ్లీ గెలుస్తుందన్న నమ్మకాన్ని కార్యకర్తలు, నేతల్లో కల్పించనంతవరకూ పరిస్థితుల్లో మార్పు ఉండదని, తమ పార్టీనేతలే కోవర్టులు కావడం నాయకత్వ వైఫల్యానికి, బలహీనతకు నిదర్శనమని ఆయన అభిప్రాయం. 'సిద్ధాంత కాలుష్యమే ప్రస్తుత రాజకీయాలకు పట్టిన పీడ. దాన్నుంచి బయటపడితే కాని మన సమాజం బాగుపడదు'. అని స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఒకప్పుడు అన్న మాటలు ప్రస్తుత పరిస్థితులకూ వర్తిస్తాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఏఐ వద్దని ఎవరన్నారు?

కృత్రిమ మేధపై రంగనాయకమ్మ రాసిన వ్యాసానికి ('కృత్రిమ మేధ: భ్రమలూ, వాస్తవాలు!' – ఫిబ్రవరి 20, 2025) స్పందిస్తూ మామిడి నారాయణ 'సిద్ధాంతం వేరు, సైన్స్ వేరు' (మార్చి 1, 2025) అంటూ వ్యాసం రాశారు. "మిగులు విలువ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం లేదు. రాదు కూడా" అన్న మామిడి నారాయణ ఆ అదనపు విలువ సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం ఎందుకు లేదో సరిగ్గా తెలిస్తే, "సిద్ధాంతానికి ప్రత్యామ్నాయం రావచ్చు రాకపోవచ్చు, సైన్స్‌కు మాత్రం ప్రత్యామ్నాయం ఉండదు, కేవలం అప్‌గ్రెడేషన్ మాత్రమే ఉంటుంది" అనేవారు కాదు.

మార్క్స్ ఆవిష్కరించిన అదనపు విలువ సిద్ధాంతం కూడా సామాజిక శాస్త్రాలలోని వివిధ సిద్ధాంతాల, వాదాల అప్‌గ్రెడేషనే. చారిత్రక గతితర్కంలో భాగంగా వచ్చినదే మార్క్సిజం. అది ఉన్నపళంగా ఆకాశంలోంచి ఊడిపడలేదు. అప్‌గ్రెడేషన్ అనేది కేవలం ప్రకృతి శాస్త్రాలకే కాక సామాజిక శాస్త్రాలకూ వర్తిస్తుంది. కాకపోతే మార్క్సిజం రాకతో సామాజిక శాస్త్రాల్లో అప్‌గ్రెడేషన్ ఆగిపోయింది. అంటే ఆ శాస్త్రం ఆర్థిక రంగంలో పరిపూర్ణమయింది. ఆ సమగ్రతకు, మార్క్స్ కనిపెట్టిన C+V+S = C'లో ప్రకృతి నియమాలు ఇమిడి ఉండడమే కారణం! ఈ 'C' ఆక్సిలరీ పదార్థాలు, ముడి పదార్థాలు, శ్రమ/ ఉత్పత్తి సాధనాలు అనే మూడు విభాగాలుగా ఉంటుంది. ఇందులోని ఉత్పత్తి సాధనాలే టెక్నాలజీ అంటే. ఇందులో– నాటి చేతి పనిముట్టు నుంచి నేటి ఏఐ వరకు ఇమిడి ఉంటాయి. ఇలా ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా ఉన్నందువల్లే మార్క్సిజం సైన్స్ అయ్యింది.

నారాయణ పేర్కొన్న ఆర్థికవేత్తలు జే.బీ. సీ, ఆర్థర్ సిసిల్ పిగూ. వీరి సిద్ధాంతాలలో శాస్త్రీయత ఎలాగూ ఉండదు కాబట్టి వాటిని వదిలేద్దాం. "(కార్మిక వర్గం) ఎక్కడా మార్క్స్ చెప్పినట్టు తిరుగుబాటు చేయలేదు" అంటూ నారాయణ పై ఇద్దరి విఫల సిద్ధాంతాలలోకి మార్క్స్ సిద్ధాంతాన్ని కూడా చేర్చారు! కార్మికులు ఇప్పటికీ తిరుగుబాట్లు చేస్తూనే ఉన్నారు వివిధ రూపాలలో. అయితే వ్యవస్థను మార్చుకునే విధంగా తిరుగుబాట్లు రావడం లేదు. రాజకీయంగా విజయాలు ఎలా సాధించాలో కూడా మార్క్స్ చెప్పాడు. ఎంగెల్స్, లెనిన్, మావోలు కూడా చెప్పారు. ప్రధానంగా చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలను మార్చుకోవాలన్నారు. ఇవన్నీ కమ్యూనిస్టు పార్టీలు చేయాల్సిన కర్తవ్యాలు. పార్టీల వైఫల్యాలే మార్క్స్ సిద్ధాంత వైఫల్యంగా చూడకూడదు.



ఇక నారాయణకు బాగా నచ్చిన ఆర్థికవేత్త జె.ఎమ్. కీన్స్! ఎందుకంటే, వ్యవస్థ తీవ్రమైన ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు 'లోటు బడ్జెట్ విధానాన్ని' సూచించినందుకు! "ఒక సిద్ధాంతం విఫలమైనప్పుడు నష్ట నివారణకు ప్రత్యామ్నాయ సిద్ధాంతం కూడా వస్తుంది అనేది రుజువైంది" అంటున్నారు నారాయణ. ఆ రకంగా మార్క్స్ సిద్ధాంతం విఫలమై కీన్స్ సిద్ధాంతం వచ్చిందట! ఏ కమ్యూనిస్టు అయినా ఈ మాటలను అంగీకరిస్తాడా? అంటే ఇక వ్యవస్థను సమూలంగా మార్చే తిరుగుబాట్లు రావన్నమాట. ఇక ఈ సంస్కరణల సిద్ధాంతాలే మనకు దారీతెన్నూ!

"ఆండ్రాయిడ్ మొబైల్ నిరుద్యోగం సృష్టిస్తున్నదని దాని వాడకం నిలిపివేయలేం కదా" అంటున్నారు నారాయణ. దాన్ని నిలిపివేయాలని ఎవరు అంటారు? టెక్నాలజీని వద్దు అని ఎవరైనా అంటారా? రంగనాయకమ్మ గారి వ్యాసంలో అలా ఎక్కడా లేదే?

"కృత్రిమ మేధవల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ" అంటూనే, "కేవలం అది ఒక దశ మాత్రమే" అని విచిత్రంగా మాట్లాడుతున్నారు నారాయణ. అంటే లాభాలు వచ్చినా కొంతకాలమే వస్తాయి అని. మరి, ఆ తర్వాత? "మళ్లీ అప్పుడు అప్‌గ్రెడేషన్ ఉండనే ఉంటుంది" అట! ఒకవేళ సంక్షోభాలు వస్తే? కీన్స్ ఎలాగూ ఉన్నాడు! ఇలా అంతా పరిష్కారమైపోతున్నప్పుడు అదనపు విలువ సిద్ధాంత ప్రాధాన్యత ఏమిటి? ఏ సిద్ధాంతాన్ని ఆయన 'ప్రత్యామ్నాయంలేని సిద్ధాంతం'గా చెప్తున్నారో దాన్ని ఆచరణలో సాధ్యం చేయడం గురించి ఆయనకు అసలు ఆలోచనే లేదన్నమాట! ఆయన ప్రకారం అదనపు విలువ సిద్ధాంతం కేవలం ఆర్థిక శాస్త్రానికి మాత్రమే పరిమితం. సమాజ పురోగమనం అనేది సైన్స్‌కు సంబంధించింది! దీనికి దానికి ముడిపెట్టకూడదన్నమాట! సమాజం పట్ల ఇలాంటి అవగాహన ఉండబట్టే "సైన్స్ ఏ వర్గ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందనే వాదన అర్థరహితం" అంటున్నారు. ఒక కొత్త సరుకు మార్కెట్‌లోకి వచ్చినప్పుడు వర్గ దృష్టితో అందులోని నిజానిజాల్ని చెప్పుకోకూడదా? దానిపట్ల ప్రచారం అవుతున్న విషయాలలో భ్రమలెంత, వాస్తవాలెంత అనేది చర్చించుకోకూడదా? "కృత్రిమ మేధ పనితీరు పట్ల అనుమానాలూ, భయాలూ అర్థరహితం" అనే నారాయణ దానివల్ల ఉద్యోగాలు పోయే కార్మికులకు, భయం కలగడం అర్థరహితమని భావిస్తున్నట్టా?

● యూ.హెచ్. ప్రీతమ్



ప్రసాదమోహనము

మధుర మధుర మీ మోహనగానము
బుధనుత బాలకృష్ణ ప్రసాద కవితము
వర నారదమౌని వీణాగానము
సరవి అన్నయ్యకు సంపదైన గానము
చెర రామదాసుకు చనవైన గానము
తిరమై త్యాగయ్యకు ధనమైన గానము
భక్తజనుల హరి భజనమె గానము
శక్తులౌ వీరుల శౌర్యమీ గానము
రక్తుల ప్రేమసరాగమె గానము
యుక్తి సరిగపద యోగమె గానము
అల వేదంబుల నమరిన గానము
వెలలేని ప్రేపల్లె వేణుగానము
నవి శ్రీవేంకటేశునామమె గానము
కలనైన నెక్కడ కానము కానము

– డాక్టర్ కందాళ లక్ష్మీనారాయణ
నెల్లూరు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కేంద్ర ప్రభుత్వం.. పెన్షన్ పిల్లిమొగ్గలు

మోదీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించేలా యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) అనే పథకాన్ని 2025 ఏప్రిల్ 1 నుండి అమలయ్యేలా 24 జనవరి 2025న ఒక నోటిఫికేషన్ ఇచ్చింది. 2004 నుండి అమలవుతున్న నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) స్థానంలో దీనిని ఎంచుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లు ఇందులో పేర్కొన్నారు.

2004 వరకు దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి ఒకే పెన్షన్ స్కీం ఉండేది. దీనినే పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) అని పిలుస్తున్నారు. వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఓపీఎస్‌ను రద్దు చేసి, దాని స్థానంలో ఎన్‌పీఎస్‌ను కంపల్సరీ చేస్తూ 2004 జనవరి 1 నుండి అమలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను కూడా ఇందులో చేరేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అవకాశం కల్పించింది. ఈ ఎన్‌పీఎస్ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 2004 సెప్టెంబరు 1 నుండి అమలవుతోంది. దీనినే సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) అని కూడా రాష్ట్రంలో పిలుస్తున్నారు.

ఈ ఎన్‌పీఎస్‌కు ఓపీఎస్‌కు ప్రధాన తేడా ఏమిటంటే ఓపీఎస్‌లో ఉద్యోగి వాటా చెల్లింపు ఏమీ ఉండదు. ఉద్యోగికి ఆఖరి నెల జీతంలో సగం పెన్షన్ కింద లభిస్తుంది. దానితో పాటుగా కమ్యుటేషన్, కరువు భత్యం వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. అంటే ఎంత పెన్షన్ వస్తుందో గ్యారంటీ ఉంది. కానీ ఎన్‌పీఎస్‌లో ఉద్యోగి తన జీతంలో పది శాతం వాటా ఈ ఫండుకు చెల్లించాలి. దీనిని యాజమాన్య 14 శాతం వాటాతో కలిపి షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడతారు. ఉద్యోగి రిటైర్ అయ్యే నాటికి ఆ షేర్ మార్కెట్లో విలువను బట్టి వారికి పెన్షన్ చెల్లిస్తారు. అంటే ఉద్యోగికి పెన్షన్ ఎంత వస్తుందో గ్యారంటీ లేదు. అందుకే దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత అటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలోనూ, వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలోనూ కూడా వ్యక్తమయింది. వివిధ రూపాల్లో పోరాటాలు కూడా జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో నాటి జగన్ ప్రభుత్వం దీనిపై మాట తప్పినందుకు ఉద్యోగుల ఆగ్రహానికి గురై, అధికారం కూడా కోల్పోవలసి వచ్చింది. ఉద్యోగుల ఈ ఆవేదనను అర్థం చేసుకుని కొన్ని బీజేపీ యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాజస్థాన్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలలో ఓపీఎస్‌ను పునరుద్ధరించడానికి నిర్ణయించాయి. కానీ, కేంద్రం వద్ద ఉన్న ఉద్యోగుల ఎన్‌పీఎస్ నిధులను వీరికి తిరిగి ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం నిరాకరిస్తోంది. దీని రద్దుకూ నిరాకరిస్తోంది.

ఉద్యోగుల అసంతృప్తిని చల్లార్చడానికి మోదీ ప్రభుత్వం నేడు యూపీఎస్ పేరున ఒక కొత్త నాటకానికి తెరలేపింది. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్సు కార్యదర్శి టివి సోమనాధన్ నేతృత్వంలో ఎన్‌పీఎస్‌లో మెరుగుదలకు ఒక కమిటీని వేసింది. ఓపీఎస్ పునరుద్ధరణ తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని, అనేక ఉద్యోగ సంఘాలు ఈ కమిటీని బహిష్కరించాయి. వారు ఊహించినట్టుగానే ఎన్‌పీఎస్‌లోని అనేక అంశాలను అలాగే ఉంచుతూ, ఓపీఎస్‌లోని కొన్ని అంశాలను కుదిస్తూ ఈ కమిటీ సిఫార్సు చేసింది. దీనికనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ యూపీఎస్ పథకాన్ని తీసుకువచ్చింది. ఆంధ్ర రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీడ్ పెన్షన్ స్కీం (జీపీఎస్) లాంటిదే స్థూలంగా ఇది కూడా.

ఎన్‌పీఎస్ పథకంలోని నిధులన్నీ షేర్ మార్కెట్లో పెట్టడం ద్వారా అది పుంజుకోవడానికి, కార్పొరేట్ శక్తులు లాభపడడానికే ఉద్దేశించబడింది తప్ప అందులో ఉద్యోగుల ప్రయోజనాలు ఇసుమంత కూడా లేవు. ఇంకో రకంగా చెప్పాలంటే నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలలో భాగంగా ఉద్యోగుల కష్టార్జితాన్ని కార్పొరేట్ల పరం చేయడానికే ఎన్‌పీఎస్ రూపొందించబడింది.

నేటి ఈ యూపీఎస్‌ది కూడా అదే లక్ష్యం. ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. దీన్ని పెన్షన్ అని కాకుండా ఎస్యూర్డ్ పేఅవుట్ అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వం మరో 4.5 శాతం నిధులను అదనంగా జమ చేస్తుంది. ఉద్యోగి వాటా 10 శాతం, కేంద్ర ప్రభుత్వ 18.5 శాతం వాటాతో ఈ యూపీఎస్ పథకం నడుస్తుంది. దీని ద్వారా షేర్ మార్కెట్లో పెట్టే పెన్షన్ నిధులు మరింత పెరిగి, కార్పొరేట్లకు మరిన్ని లాభాలు సమకూరుతాయి. 2024 జూలై చివరి నాటికి ఎన్‌పీఎస్ ద్వారా 99,77,165 మంది ఉద్యోగుల పెన్షన్ నిధులు షేర్ మార్కెట్లో 10,53,850 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ అదనపు వాటాతో ఇది మరింత పెరుగుతుంది. పోనీ ఇదేమైనా మెరుగ్గా ఉందా అంటే, అనేక అంశాలలో ఎన్‌పీఎస్ కంటే అధ్వానంగా ఉంది.

ఓపీఎస్ పథకంలో సర్వీసులో ఉన్న ఉద్యోగులతో సమానంగా పెన్షనర్లకు కూడా కరువు భత్యం చెల్లిస్తారు. పే కమిషన్ ద్వారా వేతన సవరణ జరిగినప్పుడల్లా పెన్షన్ కూడా సవరించబడుతుంది. కానీ యూపీఎస్‌లో ఆ అంశాలు ఎక్కడా పేర్కొనలేదు. అలాగే కనీస ఫేమిలీ పెన్షన్ ఓపీఎస్‌లో 14,130 రూపాయలు కాగా, యూపీఎస్‌లో కేవలం 6000 రూపాయలు మాత్రమే. ఓపీఎస్‌లో ఫేమిలీ పెన్షనర్‌కు 80 సంవత్సరాల వయసు నిండితే అదనంగా 20 శాతం, దానిపైన కూడా కరువు భత్యం, 90 సంవత్సరాలు నిండితే 40 శాతం, 95 సంవత్సరాలు నిండితే 50 శాతం, 100 సంవత్సరాలు నిండితే వంద శాతం చెల్లిస్తారు. యూపీఎస్‌లో ఆ సదుపాయం ఏమీ లేదు.

> యూపీఎస్‌లో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఉద్యోగులకు ఒకసారి మాత్రమే ఇస్తారు. ఒకసారి చేరిన తరువాత ఇక బయటకు వెళ్లడానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు సంబంధించిన ప్రస్తావనే ఇందులో లేదు. ఇటువంటి షరతులతో కూడిన ఈ గందరగోళ యూపీఎస్ చాలా లోపభూయిష్టమయినది. అమలు ప్రారంభమయితే మరిన్ని లోపాలు బయటపడతాయి. ఏ రకంగా చూసినా ఇది ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాజాలదు.



దీనిలో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఉద్యోగులకు ఒకసారి మాత్రమే ఇస్తారు. ఒకసారి చేరిన తరువాత ఇక బయటకు వెళ్లడానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు సంబంధించిన ప్రస్తావనే ఇందులో లేదు. ఇటువంటి అనేక లోపాలు, షరతులతో కూడిన ఈ గందరగోళ యూపీఎస్ చాలా లోపభూయిష్టమయినది. అమలు ప్రారంభమయితే మరిన్ని లోపాలు బయటపడతాయి. ఏ రకంగా చూసినా ఇది ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయం కాజాలదు. ఏదో చేసేస్తున్నామని భ్రమలు కలిగించి, కార్పొరేట్లకు మరింత సేవ చేయడానికి ఉద్దేశించబడినదే ఈ మోసపూరిత యూపీఎస్. ఈ విషయం నోటిఫికేషన్ 4వ పాయింటు ద్వారా స్పష్టమవుతుంది. అందులో యూపీఎస్‌లో చేరిన సభ్యుల ఎన్‌పీఎస్ నిధిని దీనికి బదిలీ చేస్తారని పేర్కొన్నారు కానీ ప్రభుత్వం ఎన్‌పీఎస్ నిధులను ఓపీఎస్ అమలు చేసే రాష్ట్రాలకు బదిలీ చేయడానికి మాత్రం నిరాకరిస్తోంది. దీన్ని బట్టే తెలుస్తోంది ప్రభుత్వ ఉద్దేశం ఉద్యోగుల ప్రయోజనం కాదని. మోదీ ప్రభుత్వ ఈ జిమ్మిక్కులు అర్థం చేసుకునే ఉద్యోగులు దీన్ని ఏకోన్ముఖంగా తిరస్కరిస్తున్నారు. 'పెన్షన్ ఉద్యోగి ప్రాథమిక హక్కు, బిక్ష కాదు' అనే సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించాలి. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇలాంటి పెన్షన్ పిల్లిమొగ్గలు ఇకనైనా ఆపాలి. కార్పొరేట్ సేవ విడనాడి, ఉద్యోగుల కష్టార్జిత పొదుపు సొమ్ము వారికే చెందేలా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి.

■ ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఆ ఎనిమిది మంది!

అది ఊటనీరు కాదు
కన్నీరు
వరద కాదు
రాజకీయ బురద.

ఒక్కక్షణంలో పోయిన
ప్రాణాలు కావవి,
ఎంత సమయం
విలవిలలాడాయో!

ఏ తల్లి కన్న బిడ్డలో
ఏ ఊరి మట్టిగడ్డలో
ఇక్కడ
అనాథల్లా
అంతమైపోయారు.

ప్రాజెక్టుల నిర్మాణానికి
రెక్కలు విరిగిన కూలీలెవ్వరు!
పేదవారి చరిత్ర సమస్తం
అస్తవ్యస్తం.

లక్షల రూపాయల పరిహారం
కుటుంబసభ్యుల
దుఃఖానికి ఖరీదు.

మిత్రులారా!
ఇవాళ అన్నం తింటుంటే
మీరే గుర్తుకొస్తున్నారు
రేపటినుంచి
అంతా సజావుగానే వుంటుంది.

– డా. ఎన్.గోపి

(ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో మరణించిన కార్మికుల కోసం)

గ్రామాల్లో పేదరికాన్ని రూపుమాపటం, కుటుంబాల ఆదాయం గణనీయంగా పెంచేందుకు కూటమి ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటి దగ్గరే పని కల్పించటం కోసం ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వే చేపట్టింది. ప్రతి కుటుంబంలోని సభ్యుల విద్యార్హతలు, వాటి ఆధారంగా వారు చేయగలిగే పనుల గురించి వివరాలు సేకరిస్తోంది. ఇంటి దగ్గరే ఐటీ, ఐటీ యేతర పనులు చేసుకుంటూ ఆదాయాన్ని ఆర్జించేందుకు వీలుగా ఈ సర్వేను జరిపిస్తోంది.

వేగంగా..

చురుగ్గా వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే

ఎన్టీఆర్ జిల్లాలో 11,88,000 మంది, కృష్ణాజిల్లాలో 9,03,730 మందికి ఉపాధే లక్ష్యం

- ఐటీ, ఐటీ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాల కల్పన
- ఎన్టీఆర్‌లో 31 శాతం, కృష్ణాలో 28 శాతం సర్వే పూర్తి
- పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వే చురుగ్గా సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మ్యాపింగ్ జరిగిన ప్రతి కుటుంబానికి ఫోన్లు చేసి వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే చేస్తున్నారు. వివరాలను అప్పటికప్పుడే ప్రభుత్వం ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లో రిజిస్టర్ చేస్తున్నారు. ఆధార్ ఆధారిత ఫోన్ నంబర్లకు వచ్చిన ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. విద్యావంతులు, నిరక్షరాస్యులు అనే రెండు కేటగిరీలుగా ఈ సర్వేను చేస్తున్నారు. విద్యావంతుల సర్వేలో ప్రస్తుతం మీరు పనిచేస్తున్నారా? ఐటీ, ఐటీయేతర సాఫ్ట్‌వేర్ ఆధారిత పనులు చేయటానికి మీకు ఆసక్తి ఉందా? దీనికి సంబంధించి శిక్షణ తీసుకోవటం మీకు ఇష్టమేనా ? మీకు వర్క్ ఫ్రం హోమ్ చేసుకోవటానికి ఆసక్తి ఉందా ? మీ ఇంట్లో బ్రాడ్ బ్యాండ్ సదుపాయం ఉందా? ఉంటే దాని స్పీడ్ ఎంత ఉంది ? ఇంటి వద్దనే పని చేయటం కోసం తగిన స్పేస్ ఉందా? రూమ్ (గది) ఏరియా ఎంత? ఆ గదిని ఎంత మంది వినియోగించుకోవటానికి అవకాశం ఉంటుంది ? వంటి వివరాలను సేకరిస్తున్నారు.

లక్ష్యానికి అనుగుణంగా..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 5,30,000 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాల్లో కనీసం 11,88,000 మందికి వర్క్‌ఫ్రమ్ హోమ్ కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగా ఇప్పటి వరకు 3,68,800 మందికి సంబంధించి వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే నిర్వహించారు. నిర్దేశించుకున్న లక్ష్యంలో జిల్లాలో 31శాతం పూర్తయింది. కృష్ణాజిల్లాలో 4,14,000 కుటుంబాలు ఉండగా.. మొత్తం 9,03,730 మందికి వర్క్ ఫ్రం హోమ్ కల్పించాలన్నది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 2,51,836 మందికి సంబంధించి వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను పూర్తి చేశారు. కృష్ణాజిల్లాలో 28 శాతం మేర వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే పూర్తయ్యింది.

పనిచేసుకునే పద్ధతులపై ఆరా

వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఐటీ, ఐటీ అనుబంధ రంగాలకు సంబంధించిన జాబ్ వర్క్‌నే ఇస్తారు. దీని కోసం ముందస్తుగా శిక్షణ ఉంటుంది. శిక్షణ వద్దు అనుకున్న వారికి కూడా జాబ్ వర్క్ ఇవ్వటం జరుగుతుంది. ఈ జాబ్ వర్క్‌లో కూడా మూడు పద్ధతులు ఉన్నాయి. పూర్తిగా ఇంటి దగ్గరే పనిచేసుకోవచ్చు, ఒక రోజు ఆఫీసులో, మరో రోజు ఇంటి దగ్గర పనిచేసుకోవచ్చు. పూర్తిగా ఆఫీసులో కూడా పనిచేసుకోవచ్చు. వీటికి కూడా వర్క్ ఫ్రం హోమ్ డేటా ఎంట్రీలోనే వివరాలు అడుగుతున్నారు.

నెలాఖరుకు సర్వే పూర్తి!

ఈ నెలాఖరు నాటికి వర్క్ ఫ్రం హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) సర్వేను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఈ నెల 20వ తేదీ నాటికి సర్వేను పూర్తి చేసేందుకు లక్ష్యం నిర్దేశించుకున్నారు. కృష్ణాజిల్లా కంటే ఎన్టీఆర్ జిల్లాలో సర్వే ఇంకా పురోగతిలో ఉంది. జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అభివృద్ధి అధికారిణి జ్యోతి సర్వేను పరుగులు పెట్టిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ముందుగా సర్వే జరగలేదు. రెండో దశలో ప్రారంభించాల్సి వచ్చింది. అయినప్పటికీ చాలా వేగంగానే సర్వే జరుగుతోంది.

అధిష్ఠానం బుజ్జగించినా

స సేమిరా!

తిరువూరు మునిసిపాలిటీ

వైసీపీ పాలకవర్గంలో కొనసాగుతున్న విభేదాలు

- కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరైన అసమ్మతి కౌన్సిలర్లు
- మొక్కుబడిగా సమావేశం.. 14 అంశాలకు ఆమోదం



సభ్యులు గైర్హాజరుతో ఖాళీగా ఉన్న సీట్లు

తిరువూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరువూరు మునిసిపాలిటీలోని వైసీపీ పాలకవర్గంలో మొదలైన ముసలం ఇంకా కొనసాగుతోంది. స్వపక్షంలో చెలరేగిన అసంతృప్తిని చల్లార్చేందుకు ఇటీవల అధిష్ఠానం ప్రయత్నం చేసినా.. అసమ్మతి రగులుతూనే ఉంది. మంగళవారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు చాలా మంది గైర్హాజరయ్యారు. దీంతో మునిసిపల్ కౌన్సిల్ సమావేశం కొద్దిమందితో మొక్కుబడిగా సాగింది. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగి సమావేశంలో 17 మంది వైసీపీ కౌన్సిలర్లకు గాను కేవలం ఏడుగురు మాత్రమే సమావేశానికి హాజరు కాగా, ఒకరు అనారోగ్యకారణంగా సమావేశానికి హాజరై ఆ వెంటనే వెళ్లిపోయారు. కోరం పూర్తి అవుతుందో లేదో అనే మీమాంస నెలకొంది. ఎట్టకేలకు కోరం పూర్తి అవ్వడంతో సమావేశం నిర్వహించారు. అజెండాలోని 14 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

తారాస్థాయిలో పోరు

స్థానిక నగర పంచాయతీలో వైసీపీ పాలకవర్గం మిగతా 6లో..

కేబుల్ వ్యర్థం

గుణదల-నున్న 220 కేవీ విద్యుత్ లైన్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం

- ఖరీదైన కేబుల్‌ను అడ్డగోలుగా కట్ చేస్తున్న కాంట్రాక్టు సంస్థ
- ముక్కలై పనికిరాకుండా పోతున్న కేబుల్ వైర్లు
- ట్రాన్స్‌కో అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వానికి తీరని నష్టం



ట్రాక్టర్లపై తరలిస్తున్న కేబుల్ ముక్కలు

గుణదల నుంచి నున్న వెళ్లే మార్గంలో జరుగుతున్న 220 కేవీ విద్యుత్ లైన్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. మీటరు రూ.18 వేలు ఖరీదు చేసే కేబుల్‌ను కాంట్రాక్టు సంస్థ కొలతలు లేకుండా ఇష్టారాజ్యంగా కట్ చేయడంతో ఆ కేబుల్ ముక్కలు ముక్కలై ఎందుకుపనికిరాకుండా పోతోంది. ట్రాన్స్‌కో అధికారుల పర్యవేక్షణలోపంతో ప్రభుత్వానికి భారీగా నష్టం ఏర్పడుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలో గుణదల నుంచి నున్న మార్గంలో 220 కేవీ విద్యుత్ లైన్‌ను వేస్తున్నారు. ఇది అత్యంత శక్తివంతమైన లైన్ కావడంతో ఎక్స్‌ఎల్‌పీఈ కేబుల్‌ను ఉపయోగిస్తారు. ఈ కేబుల్ లోపల రాగి ఉంటుంది. ఈ కేబుల్ ధర మీటరు రూ.18 వేలు. కిలోమీటరుకు రూ.1.80 కోట్లు చొప్పున ఖర్చుపెట్టి ట్రాన్స్‌కో అధికారులు ఈ కేబుల్‌ను కొనుగోలు చేస్తున్నారు. ట్రాన్స్‌కో కొనుగోలు చేసిన ఖరీదైన కేబుల్‌ను వేసే పనుల నిమిత్తం ఓ కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. సదరు సంస్థ ఈ కేబుల్‌ను ఇష్టానుసారంగా ఉపయోగిస్తోంది. ఖరీదైన కేబుల్‌ను కట్ చేసే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఎక్కడ అవసరమో అక్కడే కట్ చేయాలి. కానీ సదరు సంస్థ ఎడాపెడా కట్ చేయటం వల్ల ఖరీదైన కేబుల్ కాస్తా ముక్కలు ముక్కలుగా పనికిరాకుండా పోతోంది. ఈ కేబుల్స్‌ను కాంట్రాక్టు సంస్థ ట్రాక్టర్లలో వేసుకుని తరలిస్తున్న దృశ్యాలు ఇటీవల 'ఆంధ్రజ్యోతి'కి లభించాయి. దాదాపుగా రెండు డజన్లకు పైగా ట్రాక్టర్లలో తరలించారు. ఒక్కో కేబుల్ ముక్క ఐదు మీటర్ల వరకు ఉంది. ఒక్కో ముక్క ఖరీదు రూ.90 వేలు. ఈ ముక్కల విలువ రూ.25 లక్షల వరకు ఉంటుంది. ఇలాంటి ముక్కలను ఎన్ని ట్రిప్పుల్లో తరలించారో ఊహిస్తే భారీగానే ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంత చిన్న కేబుల్స్‌ను మళ్లీ ఉపయోగించటానికి పనికి రావు. ఈ ముక్కలు స్క్రాప్ కింద పోతాయి. అక్కడ కేబుల్ ముక్క రూ.2 వేల ధర మాత్రమే పలుకుతుంది. ఎంతో విలువైన మిగతా 6లో..

నిలువు దోపిడీ!

ఇంద్రకీలాద్రిపై నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు

దుర్గమ్మను దర్శించుకునేందుకు దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులను అక్కడి దుకాణాల వ్యాపారులు నిలువుదోపిడీ చేస్తున్నారు. కొండపైన, దిగువున అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా షాపులు ఏర్పాటు చేసుకుని రంగునీళ్ల సోడా రూ.35, వాటర్ బాటిల్ రూ.30 అంటూ భక్తుల జేబులను ఖాళీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- కొండపైన, దిగువున అధిక ధరలకు విక్రయాలు
- ఇష్టారాజ్యంగా షాపుల ఏర్పాటు
- రంగునీళ్ల సోడా రూ.35.. వాటర్ బాటిల్ రూ.30
- పూజా సామగ్రి సెట్టు అంటూ భక్తుల జేబులు ఖాళీ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఇంద్రకీలాద్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి కొండపైన, దిగువున వ్యాపారులు కొన్ని రకాల వస్తువులు విక్రయించేందుకు దేవస్థానం నుంచి అనుమతి తీసుకున్నారు. వారు తమ దుకాణాలను ఎనిమిది అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పు విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కానీ కొండ దిగువున కొందరు వ్యాపారులు 13 అడుగుల వెడల్పు, 16 అడుగుల పొడవుతో ఇష్టారాజ్యంగా షాపులను ఏర్పాటు చేశారు. ఒకవైపు మాత్రమే వ్యాపారం చేసుకోవాల్సి ఉంటే రెండు వైపులా విక్రయాలు చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. షాపుల కేటాయింపులో కూడా నిబంధనలు పాటించటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

అధిక ధరలు వసూలు

కొండపైన, దిగువున కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్ల దుకాణాల నిర్వాహకులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్‌కే అధికారుల నుంచి అనుమతి తీసుకుని పూజా సామగ్రి, టెంకాయ, చేతి తాడు, ఇతర పానీయాలను అనధికారికంగా విక్రయిస్తున్నారు. కొండపైన కూల్ డ్రింక్స్, వాటర్ బాటిళ్ల షాపులో టెంకాయ, పసుపు, కుంకుమ, గాజులు, నిమ్మకాయలను సెట్టుగా పెట్టి రూ.100లకుపైగా వసూలు చేస్తున్నారు. ముక్క చీర రూ.100, పసుపు, కుంకుమ, ముక్క చీర, టెంకాయ కలిపి సెట్టుగా రూ.200, టెంకాయ రూ.40లకు విక్రయిస్తున్నారు. గుర్తింపు లేని వాటర్ బాటిల్ ఒక్కొక్కటి రూ.30 విక్రయించి భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. కూల్‌డ్రింక్‌పై ఎంఆర్‌పీ కంటే రూ.5 నుంచి 10 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. చేతికి కట్టుకునే తాడు మిగతా 6లో..



కొండపై అనధికారికంగా కొబ్బరికాయల విక్రయం





హలీంకు.. సలాం!

- పంజాసెంటర్‌లో రంజాన్ ఘుమఘుమలు 6లో
- భారీగా తయారీ సెంటర్లు.. ఇరానీ హలీంకు డిమాండ్
- క్యూ కడుతున్న జనం

కళాశాల స్థలాన్ని రక్షించుకుంటాం

- ఎస్ఆర్ఆర్ పూర్వ విద్యార్థులు

8లో



కళాశాల భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

వాహ్..గుల్లలమోద 8లో

పర్యాటకాభివృద్ధికి అవకాశం

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం): 06-16 (బుధ)
సహర్ (ఉదయం) : 05-05 (గురు)

వైద్య విద్యార్థుల క్రీడా నైపుణ్యం అభినందనీయం

- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహం

8లో

రంజాన్ మాసం అంటే భోజన ప్రియులకు ముందుగా గుర్తుకు వచ్చేది హలీం.. హలీం కోసం చాలామంది సంవత్సరం పాటు ఎదురుచూస్తారంటే అతిశయోక్తి కాదు. హలీం రుచులను ముస్లిం సోదరులే కాకుండా ఇప్పుడు అందరూ ఆస్వాదిస్తున్నారు. దీంతో హలీంకు మంచి డిమాండ్ వచ్చింది. పంజా సెంటర్ హలీంకు పెట్టింది పేరు. రంజాన్ మాసంలో ఇక్కడ రకరకాల హలీంలను పెద్ద ఎత్తున తయారుచేస్తున్నారు. ఇరానీ హలీంకు విపరీతమైన డిమాండ్ ఉందని షాపుల యజమానులు పేర్కొంటున్నారు. ఫ్యామిలీ ప్యాక్‌కు మంచి క్రేజు ఉంది. ముస్లిం సోదరులే కాకుండా ముస్లిమేతరులూ రంజాన్ స్పెషల్ ఇరానీ హలీం కోసం క్యూ కడుతున్నారు. పంజా సెంటర్‌లో హలీం తయారీపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..





హలీంకు.. సలాం!

పంజాసెంటర్‌లో రంజాన్ ఘుమఘుమలు
భారీగా తయారీ సెంటర్లు.. ఇరానీ హలీంకు డిమాండ్
క్యూ కడుతున్న జనం

(ఆంధ్రజ్యోతి-వన్‌టౌన్)

రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం ఆహారం స్వీకరిస్తారు. రంజాన్ మాసంలో ఉపవాసానికి ఓ ప్రత్యేకత ఉంది. వేకువజామునే ఆహారం తీసుకుంటారు. తిరిగి సాయంత్రం ఆహారం తీసుకుంటారు. మధ్యలో ఎలాంటి పానీయాలు, ఘనపదార్థాలు తీసుకోరు. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షను కఠినంగా ఆచరిస్తారు. రంజాన్ మాసంలో అత్యంత ప్రీతికరమైన వంటకం హలీం. ముస్లిం సోదరులు ఎక్కువగా నివశించే విజయవాడ పంజా సెంటర్‌లో కొన్నేళ్లుగా హలీం స్టాళ్లకు ఓ ప్రత్యేకత సంతరించుకుంది. హలీం తయారీలో నిపుణులచే వారిని తెప్పించి ఇక్కడ వండిస్తారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు హలీం తినకుండా ఉండరంటే అతిశయోక్తి కాదు. పంజాసెంటర్, పరిసర ప్రాంతాల్లో హలీంతో పాటు మాంసాహార వంటకాల ఘుమఘుమలతో స్టాళ్లు కిక్కిరిసిపోతాయి.

హలీం తయారీలో ముఖ్యంగా మసాలా దినుసులను సమపాళ్లలో దట్టించటం ప్రత్యేకతగా చెబుతారు. హలీంను విభిన్న రుచుల్లో తయారుచేస్తారు. ఇరానీ హలీం తయారీలో చికెన్ 65, బాయిల్డ్ ఎగ్, జీడిపప్పు, విభిన్న రుచులు గల క్రీములు వాడతారు. స్వచ్ఛమైన నెయ్యిని దానికి అదనంగా చేర్చడంతో అత్యంత రుచికరంగా ఉంటుంది. రంజాన్ నెలరోజుల పాటు ఇక్కడ స్టాళ్లను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరిస్తారు. అల్లా ప్రార్థనలతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం సంతరించుకుంటుంది. ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆప్యాయతలను పంచుకుంటూ స్నేహితులు, బంధువులతో కలిసి హలీంను తినటానికి ఇష్టపడతారు. రంజాన్ మాసం ఇఫ్తార్ సమయాన్ని సాయంత్రం పాటిస్తారు. మటన్ రేట్లు ఎక్కువగా ఉండటంతో గత ఏడాది కంటే ఇప్పుడు హలీం ధరలు అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. మటన్ హలీం ప్లేటు రూ.180 నుంచి రూ.350 వరకు, ఫ్యామిలీ ప్యాక్ రూ.600ల నుంచి రూ.899 వరకు, చికెన్ హలీం ప్లేటు రూ.120 నుంచి రూ.200 వరకు, ఫ్యామిలీ ప్యాక్ రూ.350 నుంచి రూ.699 వరకు ధరలు ఉన్నాయి. విజయవాడలో మామూలు రోజుల్లో కూడా హలీం లభించినా.. రంజాన్ మాసంలో ప్రత్యేకంగా ఆయా సెంటర్లలో విక్రయిస్తుంటారు.

20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాం
- తాజుద్దీన్, సలీం హలీం స్టాల్ ఓనర్



ఏటా రంజాన్ మాసంలో పంజాసెంటర్ వద్ద హలీం స్టాల్ ఏర్పాటు చేస్తాం. ఇక్కడ వ్యాపారం బాగానే ఉంది. నాణ్యమైన పదార్థాలు వినియోగించటం, రుచికరంగా ఉండటంతో కస్టమర్లు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాము.

నాణ్యతలో రాజీ ఉండదు
- జహెద్ షావోస్ హలీం స్టాల్ ఓనర్



పవిత్ర రంజాన్ మాసంలో తయారు చేసే హలీంలో ఎక్కడా రాజీపడకుండా నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగిస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలకు ధరలు అందుబాటులో ఉన్నాయి. హలీం తినేందుకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్నారు.

రంజాన్ నెలరోజులూ హలీం తింటా..
- రబ్బానీ



రంజాన్ మాసంలో ప్రతిరోజూ స్నేహితులతో కలిసి హలీం తినేందుకు ఇక్కడకు వస్తాం. స్టాల్స్ యజమానులు కూడా నాణ్యమైన పదార్థాలను వినియోగించటంతో పాటు మంచి రుచికరంగా హలీం తయారు చేస్తున్నారు. హలీం తినడం వల్ల మంచి ఆరోగ్యం.. శక్తి నిస్తుంది.



వ్యాపారాలు బాగున్నాయి



ఈ ఏడాది పంజా సెంటర్‌లో హలీం వ్యాపారాలు బాగున్నాయి. హలీం ప్రియులు పెద్ద ఎత్తున తినేందుకు వస్తున్నారు. ఇక్కడ తినేందుకు హలీం ప్రియులు ఆసక్తి చూపిస్తుండటంతో పంజా సెంటర్ జనంతో కిటకిటలాడుతోంది.



వ్యక్తి ప్రయోజనాలు కంటే పార్టీ, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

» నాడు-నేడు ఇదే నా సిద్ధాంతం
» ఎమ్మెల్సీ పదవి దక్కకపోవటంపై నెట్టెం వ్యాఖ్యలు



జగ్గయ్యపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలు, రాష్ట్రప్రయోజనాలే తనకు ముఖ్యమని 40 ఏళ్ల రాజకీయ జీవితంలో నాడు-నేడు తాను నమ్మిన, ఆచరించిన సిద్ధాంతమని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత నెట్టెం రఘురాం మంగళవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ పదవి రానందుకు అసంతృప్తిగా ఉన్నారా అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ అనంతరం అధినేత చంద్రబాబును కలిసి ఖాళీ అయిన స్థానాల్లో అవకాశం కల్పించాలని కోరానని, అప్పుడే ఆయన కూటమి సమీకరణాల్లో పార్టీకి రెండే వస్తాయని, భవిష్యత్‌లో చూస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. పార్టీ, రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ జీవితం తెలుగుదేశంతోనే ప్రారంభమైందని, ఎన్నో సందర్భాల్లో పదవుల విషయంపై ఇదే సిద్ధాంతాన్ని తాను నమ్మినట్టు చెప్పారు.

జగన్ ఇంటి ముందే ఫీజు పోరు చేపట్టాలి

» వైసీపీ శ్రేణులకు నెట్టెం సలహా

గత ఐదేళ్ల పాలనలో జగన్ విద్యావ్యవస్థను నాశనం చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విద్యార్థులకు ఇవ్వాల్సిన అన్ని నిధులను నిలిపివేసి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో జగన్ పాపాలను, చేసిన విధ్వంసాలను సరిచేయటానికే సరిపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4200 కోట్లలో ఇప్పటికే రూ.800 కోట్లు తమ ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. మొగుడ్ని కొట్టి మొగశాలకు ఎక్కినట్టు జగన్ తీరు ఉందని, విద్యార్థులతో గతనెలలో ఫీజు పోరుకు పిలుపు ఇస్తే పట్టించుకోలేదని, ఇప్పుడు పేరు మార్చి యువత పోరుగా నాటకం ఆడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు చిత్తశుద్ధి ఉంటే యువపోరును జగన్ ఇంటి ముందు నిర్వహించాలని, తమ నేతను నిలదీయాలని కోరారు.

పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

» సీపీ రాజశేఖరబాబు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నందిగామ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రిక్రియేషన్ ముసుగులో పేకాట నిర్వహిస్తున్న క్లబ్‌లపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు తీవ్రంగా స్పందించారు. కమిషనరేట్ పరిధిలో పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పేకాట క్లబ్‌లనిర్వహణపై నందిగామ డివిజన్ పోలీసులను ప్రశ్నించినట్టు తెలిసింది. నందిగామ, కంచికచర్ల పట్టణాలలో ఉన్న రిక్రియేషన్ క్లబ్‌లలో సుదీర్ఘ కాలంగా పేకాట నిర్వహిస్తున్నారు. ఒక దశలో పేకాటను వ్యాపారంగా చేసుకొని నిర్వాహకులు ఇతర ప్రాంతాలకు చెందిన జూదరులను ఆహ్వానించి కోట్ల రూపాయల బెట్టింగ్‌లకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరల జూదక్రీడకు తెరలేపి కంచికచర్ల క్లబ్‌లో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారుతున్నట్టు ప్రచారం సాగుతోంది. నందిగామ క్లబ్‌లోనూ రాజకీయ ప్రాబల్యం ఉన్న పలువురు పేకాట ఆడుతున్నట్టు సమాచారం. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనం స్థానికంగా సంచలనం రేకెత్తించింది. కథనానికి స్పందించిన సీపీ రాజశేఖరబాబు డివిజన్ పోలీసు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పేకాట నిర్వహిస్తున్నట్టు నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. తక్షణమే క్లబ్‌లపై నిఘా పెట్టాలని, నిర్వాహకుల సమాచారం ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. ఈమేరకు కంచికచర్ల పోలీసులు ఎట్టకేలకు క్లబ్‌లలో టేబుళ్లను ఎత్తివేయించారు. నందిగామ క్లబ్ నిర్వాహకులను పిలిపించిన సీఐ ఎన్‌వీవీఎల్ నాయుడు క్లబ్ రికార్డులను పరిశీలించారు. ఇకపై పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇదిలా ఉండగా, జిల్లాకు చెందిన ముఖ్య నేత కూడా పోలీసులతో మాట్లాడి రాజధానికి సమీపంలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడం సరికాదని సూచించినట్టు తెలిసింది.

బుడమేరు బాధితులకు అందని సాయం..

» మొండితోక అరుణ్‌కుమార్



విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరద బాధితులకు ఇప్పటి వరకూ సాయం అందలేదని శాసన మండలిలో వైసీపీ సభ్యుడు మొండితోక అరుణ్‌కుమార్ మంత్రులను ప్రశ్నించారు. మంగళవారం మండలిలో జరిగిన చర్చలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, వరద బాధితుల సహాయార్థం ప్రజల నుంచి ఎంత సొమ్ము వసూలైందో, ఎంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సాయం అందలేదని బాధితులు కంచరపాలెంలో ధర్నా చేస్తే లాఠీచార్జి చేయించాల్సిన పనేమిటని ప్రశ్నించారు. బాధితులకు ఇంకెప్పుడు పరిహారం అందిస్తారన్నారు. భవిష్యత్‌లో వరదలు రాకుండా నగరంలో నెదర్లాండ్స్ తరహా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆపరేషన్ బుడమేరు నిర్వహిస్తామని మంత్రులు ప్రకటించారని, ఆమేర పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఆయన ప్రశ్నించారు.

జీవో 5, 6 రద్దుతో ఆటోనగర్‌కు స్వాంతన

» సీఎంకు ఎంఎస్‌ఎంఈ అసోసియేషన్ కృతజ్ఞతలు

ఆటోనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ వాసులను నిద్ర లేకుండా చేసిన జీవోలు 5, 6 నిలుపుదల చేయడం హర్షణీయమని ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ విజయవాడ సభ్యులు అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని అసోసియేషన్ క్లస్టర్ ట్రేడ్ సెంటర్‌లోని మలినేని నారాయణ ప్రసాద్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం వారు మాట్లాడుతూ జీవో నంబర్ 41 తెచ్చిన సీఎం చంద్రబాబుకు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కోఆర్డినేట్ గ్రూప్ పాలసీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 5, 6 తీసుకొచ్చి ఆటోనగర్ చుట్టూ నగరం అభివృద్ధి వల్ల ప్లాట్లను మార్కెట్ విలువలో 50 శాతం ఇంపాక్ట్ ఫీజు, ఇతర ఛార్జీలు చెల్లించి కమర్షియల్‌గా మార్చుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ జీవోలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్‌ఎంఈ గౌరవ అధ్యక్షులు బాయన వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ రామచంద్రరావు, టీవీ నాగేశ్వరరావు, మాజీ ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, జెఆర్డీ టాటా ఐలా మాజీ కార్యదర్శి వినోద్‌బాబు, రమేష్ బాబు, సాంబశివరావు, వై.మూర్తి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం 21, 31లను రద్దు చేయాలి

» ముఖ్యమంత్రికి బొండా వినతి

అజిత్‌సింగ్‌నగర్ : ఆటో కార్మికులకు గుదిబండలా మారిన జీవో నెంబర్లు 21, 31లను తక్షణమే రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ పాలనలో జీవో నెం 21, 31 తీసుకువచ్చారని, దీని కారణంగా ఈ చలానాలు విపరీతంగా పెరిగి కార్మికులు నష్టపోతున్నారని వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు జీవో నెంబర్లు 21, 31 రద్దు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పడం జరిగిందని, అలాగే యువగళం పాదయాత్రలో నారా లోకేష్ కూడా ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. తక్షణమే జీవో నెం 21, 31లను రద్దు చేయాలని బొండా ఉమా కోరారు.

వైసీపీ గత ఐదేళ్ల పాలనలో మాచర్లలో ప్రజాస్వామ్యం ఖూనీ

» ఎక్స్‌లో బుద్దా పోస్ట్


వన్‌టౌన్ : 2020 మార్చి 11న మాచర్లలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఎక్స్‌లో పోస్టు చేశారు. సరిగ్గా అయిదు సంవత్సరాల క్రితం అక్కడ జరుగుతున్న రాక్షస పాలనను ప్రశ్నించేందుకు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తాను, ప్రస్తుత సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమాతో కలిసి మాచర్ల వెళ్లినప్పుడు జగన్ రెడ్డి అండ్‌కో చేసిన పైశాచిక దాడిని రాష్ట్ర ప్రజలు కళ్లకు కట్టినట్టు చూశారని, ఆనాడు కారులో వెళుతుండగా, తమపై జరిగిన దాడి దృశ్యాలను ఆయన పోస్టు చేశారు.



ఇంట్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

96 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

నాగాయలంక, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎదురుమొండి గ్రామంలోని నాయుడు అంకాలమ్మ ఇంట్లో 96 రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా నిల్వ ఉంచినట్టు సమాచారం రావటంతో మంగళవారం మండల పీడీఎస్ డీటీ ఖాసింబాబు, రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినందుకు నాయుడు అంకాలమ్మపై 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గ్రామంలోని రేషన్ డీలర్‌కు అప్పగించినట్టు డీటీ తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో చకచకా వినోద ఏర్పాట్లు

తిరుపతమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించనున్న తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాలకు దేవస్థాన సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునేటిలో భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలకు ఏర్పాట్లు, ఆలయానికి ఉత్తరం వైపున పలు శాఖలకు సంబంధించిన ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక, వినోద కార్యక్రమాల నిర్వహణకు వేదికలు సిద్ధం చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్.రమా ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 24న చలో ఢిల్లీ

బస్‌స్టేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే యత్నాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 24న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు నిచ్చిందని ఏపీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు ఎస్.కె.జిలానీ బాషా, అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ బస్సుల పాలసీని 2018లో ప్రవేశపెట్టిన టీడీపీ ప్రభుత్వం మరలా దానిని పునరుద్ధరిస్తూ గత ఏడాది డిసెంబరు 11న ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఇది ఏపీఎస్‌ఆర్టీసీకి ఆశనిపాతం వంటిదని పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యం కూడా విద్యుత్ బస్సులను ప్రవేశపెడతామని పదే పదే పత్రికల్లో ప్రకటనలు చేస్తున్నారని, విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రవేట్ కార్పొరేట్ యాజమాన్యాలకు అప్పగించవద్దని కోరుతున్నామని తెలిపారు.ఈనెల 24న ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రైవేటీకరణ కోసం ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న ప్రయత్నాలను వివరించారు. ఇప్పటికైనా సంఘాలు విద్యుత్ బస్సుల సమస్యపై స్పందించి కలిసి రావాలని కోరారు.

అధిష్ఠానం బుజ్జగించినా ససేమిరా!

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు నుంచి ఆ పార్టీ కౌన్సిలర్లలో ఆధిపత్య పోరు తారాస్థాయిలో ఉంది. నాటి ఒప్పందం ప్రకారం ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని వైసీపీ కౌన్సిలర్లలో సుమారు తొమ్మిది మంది సభ్యులు అవిశ్వాసం పెట్టే ప్రయత్నాలు సాగిస్తున్నారు. తాము పెట్టే అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన మద్దతు సమీకరించుకునే ప్రయత్నాల్లో అసమ్మతివాదులు ఉన్నారు. గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశాలకు అసమ్మతి వాదులు గైర్హాజరవ్వటంతో కోరంలేక సమావేశాలు వాయిదాపడిన ఉదంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం నాటి కౌన్సిల్ సమావేశం కూడా తొలుత కోరం లేక వాయిదా పడుతుందనుకునే సమయానికి, ఎట్టకేలకు ఏడుగురు సభ్యులు హాజరుతో సమావేశం అయ్యిందనిపించారు. స్థానిక వైసీపీ నాయకత్వం అసమ్మతివాదులతో సోమవారం మంతనాలు జరిపి కౌన్సిల్‌కు హాజరవ్వాలని, అవిశ్వాసం విషయాన్ని మనమందరం పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి వద్దకు వెళ్లి చర్చించుకుందామని, అసమ్మతి వాదుల్ని బుజ్జగించారు. అప్పటికి కౌన్సిల్‌కు వెళతామని చెప్పిన అసమ్మతి వాదులు కౌన్సిల్ సమావేశానికి రాకపోగా, వీరిలో ఒక కౌన్సిలర్ ఒకరిద్దరు కౌన్సిలర్లకు ఫోన్ ద్వారా మాకు సహకరించండి, సమావేశానికి గైర్హాజరు కావాల్సిందిగా కోరినట్లు సమాచారం. ఏదిఏమైన అవిశ్వాసం పెట్టి తీరుతామని అసమ్మతి కౌన్సిలర్లు చెబుతున్నారు. కౌన్సిల్ సమావేశం పూర్తయిన తర్వాత కొందరు అసమ్మతివాదులు సమావేశానికి ఎవ్వరు హాజరు అయ్యింది అనే సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, తమ వార్డుల్లో చేసిన పనులకు సంబంధించి అజెండాలో పెట్టలేదని, తాము సమావేశం హాలు సమీపంలో ఉన్నప్పటికీ కొద్దిమంది సభ్యులతో సమావేశాన్ని ప్రారంభించారని టీడీపీ ఫ్లోర్ లీడర్ షేక్ అబ్దుల్ హుస్సేన్, కౌన్సిలర్ నాళ్ల సురేంద్ర తదితరులు తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం చర్యను ఖండిస్తూ సమావేశానికి వెళ్లకుండా వెనుతిరిగినట్లు చెప్పారు.

నిలువు దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

రూ.50లు, కుంకుమభరణి రూ.25లు, ఇతర పూజా సామగ్రికి అధికంగా రుసుం వసూలు చేస్తున్నారు. కొండపై ఒకే ఒక షాపు ఉండటం వల్ల దుకాణంలో ఉన్న సిబ్బంది అడిగినంత డబ్బులు భక్తులు ఇవ్వాల్సి వస్తోంది. ఈ షాపు కూడా నిబంధనలకు విరుద్ధంగా దుర్గగుడిలో అవుట్ సోర్సింగ్‌లో చేసే ఓ ఉద్యోగి నిర్వహిస్తున్నట్లు సమాచారం.

యథేచ్ఛగా రంగునీళ్ల గోలీ సోడాలు

కొండ దిగువన, మహామండపం ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్స్ దుకాణంలో కేవలం వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ మాత్రమే విక్రయించాలి. అయితే అనధికారికంగా రంగునీళ్ల గోలీ సోడాలు అమ్ముతున్నారు. సోడా ధర రూ.35 నుంచి 40 వరకు, ఓ కంపెనీ బాదం పాలు ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. అధిక ధరల వసూళ్లపై పలువురు భక్తులు సంబంధిత విభాగం అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. వ్యాపారస్తుల వ్యవహారంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా ఆలయ ఉద్యోగుల సమాధానం

దేవస్థానంలో వ్యాపారస్తులు నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారం చేస్తున్నారని, భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని సంబంధిత లీజు విభాగం ఏఈవో దుర్గారావు, సూపరింటెండెంట్ డి.వి.వి.సత్యనారాయణను వివరణ కోరగా, మాకేమి తెలియదు, ఈవో దృష్టికి తీసుకువెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. నిత్యం పర్యవేక్షించాల్సిన ఉద్యోగులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం గమనార్హం.

అమరావతి రైతులకు
సత్వర న్యాయం జరగాలి

» ఎమ్మెల్యే సుజనా చౌదరి



వన్‌టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలని, ఆ బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి నిర్మాణ పనులు పరుగులు తీశాయని, అనంతరం వైసీపీ అరాచక పాలనతో విధ్వంసం జరిగిందన్నారు. మూడు రాజధానులను తెరపైకి తెచ్చి అమరావతిని విచ్ఛినం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. మూడు పంటలు పండే 33వేల ఎకరాల భూములను చంద్రబాబు మాటలు నమ్మి రైతులు ఇచ్చారన్నారు. వారిని జగన్ ప్రభుత్వం తీవ్ర వేధింపులకు గురిచేసిందని పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ప్రకటన చేసినా కూడా వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందన్నారు. అమరావతిని భవిష్యత్తులో ఎవరూ కదిలించలేని విధంగా చట్టం తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు రైతులకు జరిగిన నష్టాన్ని ఏవిధంగా భర్తీ చేస్తారో కూడా చెప్పాలని సుజనా కోరారు. దీనిపై మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ బదులిస్తూ రాబోయే మూడేళ్లలో రాజధాని నిర్మాణ పనులను ప్రపంచ బ్యాంక్, ఏడీబీతో పాటు హడ్కో, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహాయంతో దాదాపు 64వేల కోట్ల రూపాయల అంచనాలతో పూర్తి చేస్తామన్నారు. రోడ్లు, అధికారులు, ప్రజా ప్రతినిధుల భవన సముదాయలు, ఇతర మౌలిక సదుపాయాలను దశల వారీగా పూర్తి చేస్తామని వివరించారు. రాజధాని అంశంలో దాష్టీకాలు, దారుణాలకు పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అమరావతి రాజధాని అంశంపై సుదీర్ఘ చర్చ అవసరమన్నారు. ఈ అంశం పై సమయం చూసి ఈ సమావేశాల్లోనే చర్చ పెడతామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.



అకాడమి ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థి భాస్కరమూర్తి

సిద్ధార్థ ల్యాబ్‌కు రూ.20 లక్షల విరాళం

» అందజేసిన పొట్లూరి భాస్కరమూర్తి

బెంజిసర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(సాహి)లోని ల్యాబొరేటరీలో పరిశోధన సౌకర్యాల కల్పనకు పూర్వ విద్యార్థి, సోనోవిజన్ అధినేత పొట్లూరి భాస్కరమూర్తి రూ.20 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సిద్ధార్థ అకాడమిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భాస్కరమూర్తి చెక్కును అందజేశారు. ఆయన 1983 బ్యాచ్‌లో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పూర్వ విద్యార్థి. అకాడమిలోని ప్రయోగశాలకు పొట్లూరి తండ్రి పీజే మూర్తి పేరు పెట్టనున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమి ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ, ల్యాబొరేటరీకి విరాళం ఇచ్చిన భాస్కరమూర్తిని అభినందించారు. కార్యక్రమంలో హయ్యర్ ఎడ్యుకేషన్ చాన్సలర్ కేవీ చౌదరి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, వీసీ ప్రొఫెసర్ ఏవీ రత్నప్రసాద్, డైరెక్టర్ ప్రొఫెసర్ పీబీ పాండురంగారావు, వీఆర్‌ఎస్ఎస్ఈ డీన్ ప్రొఫెసర్ డి.వెంకటరావుతోపాటు రిజిస్ట్రార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన భాస్కరమూర్తిని అభినందించారు.

పలు రైళ్లు మళ్లింపు

రైల్వేస్టేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 17405 - 17406 కృష్ణా ఎక్స్‌ప్రెస్, 07446 - 07445 లింగంపల్లి - కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్, 12806 - 12805 లింగంపల్లి - విశాఖపట్నం, 17014 - 17013 హడప్సర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ రైళ్లు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగకుండా చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. సికింద్రాబాద్ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్న కారణంగా ఈ చర్యలు తీసుకున్నారు. బేగంపేట - సికింద్రాబాద్, మల్కాజిగిరి - మౌలాలి స్టేషన్లలో కూడా ఈ రైళ్లు ఆగవు. రైలు వేళల్లో మార్పులు ఏమీ ఉండవని దక్షిణ మధ్య రైల్వే పీఆర్ఓ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, ప్రాముఖ్యం కలిగిన కాచిగూడ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ఉండటంతో సికింద్రాబాద్ నుంచి కాచిగూడకు టెర్మినల్స్ మార్చినట్లు తెలిపారు. 17023, 17024 సికింద్రాబాద్ - కర్నూలు సిటీ - సికింద్రాబాద్ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ నుంచి కాచిగూడ టెర్మినల్‌కు మళ్లిస్తారు. కాచిగూడ - కర్నూలు సిటీ ఉదయం 7.55 గంటలకు బయలుదేరి 12.30కు కర్నూలు చేరుకుంటుంది. కర్నూలు సిటీ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రాత్రి 7.55 గంటలకు కర్నూలులో బయలుదేరి వేకువజామున 3 గంటలకు చేరుకుంటుంది.

కేబుల్ వ్యర్థం

(5వ పేజీ తరువాయి)

కేబుల్‌ను సరైన కొలత ప్రకారం కట్ చేసి ఉంటే ఇంత భారీ నష్టం జరగటానికి అవకాశం ఉండదు. కేబుల్ మనం కొన్నది కాదు కదా అని ఇష్టానుసారంగా కట్ చేయటం వల్ల తలెత్తిన నష్టం ఇది. ట్రాన్స్‌కో అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వల్ల జరుగుతున్న ఆగం ఇది. రేపు అమరావతిలో చేపట్టే పనులలో కూడా ఇలాగే నిర్లక్ష్యంగా ఉంటే ప్రభుత్వంపై కోట్లాది రూపాయల భారం పడే అవకాశాలు ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95,102, 112
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

నందీశ్వరునికి అభిషేకం

విజయవాడ కల్చరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో త్రయోదశి సందర్భంగా మంగళవారం ప్రదోష కాలంలో శ్రీ మహానందేశ్వర స్వామికి అభిషేకం, అర్చన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌పీ సాగర్, అర్చకులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగానర్సింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు అందజేశారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ ఏదీ?



కరెన్సీనగర్ మెయిన్ రోడ్లో నివాసాలకు దగ్గరలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



నీలిశెట్టి రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మూడో డివిజన్‌లోని కరెన్సీనగర్ కాలనీ మెయిన్‌రోడ్డు, నీలిశెట్టి రోడ్డులో నివాసాలకు దగ్గరగా, రోడ్డుకు అతి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దానికి రక్షణగా ఇనుప తీగలను ఏర్పాటు చేశారు. ఇవి ఏర్పాటు చేసి ఏళ్ల గడిచిపోవడంతో ప్రస్తుతం ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రోడ్డు కావడంతో ప్రజలు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-భారతీనగర్, ఆంధ్రజ్యోతి

బధిరుల ఉన్నతికి ఈ సైన్ లెర్నింగ్ యాప్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

లబ్బీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డెఫ్ అండ్ డంబ్ విద్యార్థుల ఉన్నతికి ఈ సైన్ లెర్నింగ్ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉందని, యాప్‌ను రూపొందించిన నెక్స్‌టెల్ మాటా సంస్థకు అభినందనలు అని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. హోటల్ మిడ్ సిటీలో బధిరులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కొండపల్లి మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బధిరుల కోసం ఈ సైన్ మెటా యాప్‌ను రూపొందించడమే కాకుండా వారి అభివృద్ధికి దోహదపడేలా ప్రత్యేకంగా లెర్నింగ్ క్లాసులను నిర్వహించటం, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించటం ప్రశంసనీయమని అన్నారు. అనంతరం



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కోవే స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రోవెల్ (సంగరాయపాలెం) వారి వితరణతో మడీనా డెఫ్ అండ్ డంబ్ పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ట్యాబ్‌ల వితరణలో ఎన్ఆర్ఐలు బొడ్డపాటి లాస్య, సునీతయాలం, డాక్టర్ అనీల్, ఎలమంచలి వైదేహీ తమ వంతు సహాయ సహకా రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రేరా మాజీ చైర్మన్ వెలమాటి రామ్‌నాథ్, నెక్స్‌టెల్ సంస్థ సీఈవో మిక్కిలినేని శ్రీకాంత్, మాధురి అట్లూరి పాల్గొన్నారు.

ముగ్గురికి టిఫిన్, ఇస్త్రీ బండ్లు పంపిణీ

రామలింగేశ్వరనగర్: 16వ డివిజన్ బాలాజీనగర్‌లోని గరికపాటి వెంకటేశ్వరరావు వీధిలో మంగళవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌కి చెందిన ముగ్గురు నిరుపేదలకు రూ.65 వేల విలువ చేసే తోపుడు బండి, ఇస్త్రీ బండి, టిఫిన్ బండ్లను అందజేశారు.

ఇన్ఫోసిస్‌లో పీబీ సిద్ధార్థ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, కావూరి శ్రీధర్

మొగల్రాజపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగావకాశాలు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత నెల గుంటూరు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షల్లో, ఇంటర్వ్యూలలో ఉత్తీర్ణులై అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 15 మంది విద్యార్థులు సిస్టం అసోసియేట్స్‌గా ఎంపికయ్యారని చెప్పారు. ఉపాధి అవకాశాలు పొందిన వారిని డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, ఉపాధి శిక్షణా అధికారి కావూరి శ్రీధర్, సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

● **సర్టిఫికెట్‌ల బహుకరణ**

పీబీ సిద్ధార్థ కళాశాల మహిళా సాధికారత ఆధ్వర్యంలో ఎంపవర్ హర్ అనే కార్యక్రమం ద్వారా కుట్టుపని, బ్యూటీషియన్ సర్టిఫికేట్ కోర్సులు పూర్తి చేసిన వారికి మంగళవారం సర్టిఫికెట్‌లు బహుకరించారు. జాతీయ స్థాయిలో ఈత పోటీలలో విజేతగా నిలిచిన జి.విజయశ్రీ గుప్తా, మీనాక్షి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు మీనాక్షి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని సర్టిఫికెట్‌లు అందించారు.

మహిళా సాధికారిత కమిటీ అధ్యక్షురాలు ఏ. కవిత, సువర్ణాంజలి, వెంకటరమణ, శ్రీరేఖ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్వేయర్ల సంఘ నాయకులు

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించండి

మంత్రి అనగానికి సంఘ నాయకుల వినతి

లబ్బీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేసినట్లు సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధుబాబు తెలిపారు. మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసిన అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సర్వేయర్లు దీర్ఘకాలికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పలు జిల్లాల సంఘ నాయకులు పాల్గొన్నారు.

కోట జయరాజుకు న్యాయవాదుల నివాళి

విజయవాడ లీగల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీనియర్ న్యాయవాది కోట జయరాజు భౌతికకాయం వద్ద బెజవాడ బార్ న్యాయవాదులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా), బార్ మాజీ అధ్యక్షుడు చేకూరి శ్రీపతి, న్యాయవాదులు ఏకే బాషా, కందుల శ్రీనివాసరావు, బొడ్డు నాగార్జున, యోబు తదితరులు జయరాజు కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం జయరాజు పార్థీవదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. మార్గమధ్యంలో న్యాయవాదుల సందర్శనార్థం సిటీ సివిల్ కోర్టుల వద్దకు వాహనాన్ని తీసుకెళ్లారు.



కోట జయరాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బెజవాడ బార్ న్యాయవాదులు

14 నుంచి కల్యాణ మహోత్సవాలు

కేదారేశ్వరపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణస్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు ఈ నెల 14నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి జె.ఎస్.ఆర్.కృష్ణప్రసాద్ తెలిపారు. పెజ్జోనిపేటలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆలయంలో స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ జరిగి నేటికి 50 ఏళ్ల పూర్తయిందని తెలిపారు. అందులో భాగంగా ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ఎంఎస్‌ఎంఈ రుణాలకు సబ్సిడీ

జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ సంకె విశ్వనాథం, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున

వన్‌టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహాలను అందిపుచ్చుకోవాలని ఎంఎస్ఎంఈ జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ సంకె విశ్వనాథం, మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జునయాదవ్ అన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదేశాల మేరకు ఆయన కార్యాలయంలో ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) రుణాలు, బీసీ కార్పొరేషన్ అందించే రుణాలపై అవగాహన సదస్సు మంగళవారం నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు నవిరి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ సీనియర్ నాయకుడు నరసింహ చౌదరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంకె, యాదవ్ మాట్లాడుతూ పీఎంజీఈపీ పథకం ద్వారా పొందే ఈ ఎంఎస్ఎంఈ రుణాలకు ప్రత్యేకంగా మహిళలకు 45 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ. లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణాన్ని 50 శాతం సబ్సిడీతో పొందవచ్చునని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో ఉచితంగా దరఖాస్తు చేయడం, రుణాలు ఇప్పించడం వరకు అన్ని సహాయ సహకారాల పొందలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్, టీడీపీ నాయకులు కె.జగన్మోహన్‌రావు, లింగంపల్లి మోహనరావు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు, టీడీపీ నాయకులు

● రామాలయంలో వీధిలో ఇంటి నిర్మాణం కోసం భవన యజమాని రోడ్డుకు అడ్డుగా ఇసుక, కంకర, ఐరన్ రాడ్లు ఉంచడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం తొలగించాలి.

- లంక దుర్గారావు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి

● రోడ్డుకు అడ్డుగా ఉన్న ఇసుక, కంకర, ఐరన్ రాడ్లు తక్షణమే తొలగిస్తాం

-ప్రభుకుమార్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్
(పటమట, ఆంధ్రజ్యోతి)



ప్రతి ఒక్కరూ మూగజీవాలను సంరక్షించాలి

- మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు

విద్యాధరపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మూగజీవాలను ప్రేమించి, వాటిని సంరక్షించి, కాపాడాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తెలిపారు. మంగళవారం భవానీపురం ఐరన్ యార్డులోని జీవకారుణ్య ఆశ్రమం వద్ద వేసవి కాలంలో మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు నగరంలోని పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసేందుకు మంచినీటి తొట్టిలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గోకరాజు గంగరాజు మాట్లాడుతూ మూగజీవులకు జీవకారుణ్య ఆశ్రమం నిర్వాహకులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

మూగ జీవులకు సహాయ సహకారాలు అందించ టానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మూగజీవుల దాహార్తిని తీర్చటానికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంచినీటిని సరఫరా చేయ నున్నట్లు తెలిపారు. జీవకారుణ్య ఆశ్రమం నిర్వాహకులు ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

జనసేన ఆవిర్భావ దినోత్సవం సభకు తరలిరండి

- ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను

వన్‌టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 14న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరిగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పిలుపు నిచ్చారు. విద్యాధరం, భవానీపురంలో జరిగిన పలు కార్యక్రమాల్లో మంగళవారం పాల్గొని బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో రోజు రోజుకు బలోపేతం అవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టి యువత పోరు కార్యక్రమంపై విమర్శలు చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, పార్టీ నాయకులు తిరుపతి అనూష, మల్లెపు విజయలక్ష్మి, స్టాలిన్, అత్తలూరి పెద్దబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్

ఎవరెస్ట్ సీసీ, వెల్‌కం జట్లు గెలుపు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో మంగళవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఎవరెస్ట్ సీసీ, షైనింగ్ స్టార్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎవరెస్ట్ జట్టు 50 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 302 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులో విజయసారథి 101 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన షైనింగ్ స్టార్ జట్టు 35.1 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 170 పరుగులతో ఓటమి పాలైంది. రెండో మ్యాచ్ వెల్‌కం సీసీ, పటేల్ సీసీ జట్ల మధ్య జరగగా మొదట బ్యాటింగ్ చేసిన వెల్‌కం జట్టు 50 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పటేల్ జట్టు 31.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 118 పరుగులతో ఓటమి చెందింది.

నష్టపోయిన ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

గవర్నర్‌పేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హేతుబద్ధీకరణ వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను విద్యాశాఖ అధికారులను కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారులను మంగళవారం కలిసిన ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో పలు కారణాల వల్ల అడ్మిషన్ల సంఖ్య తగ్గడం వల్ల హేతుబద్ధీకరణ జరిగి తరచూ ఉపాధ్యాయులను స్థానచలనం చేయాల్సి వస్తోందన్నారు. అటువంటి వారికి నష్టం జరక్కుండా సంబంధిత పాయింట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదవీ విరమణ మూడేళ్ల మాత్రమే ఉన్న వారికి, అంధ ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సీనియారిటీ లిస్టులోని తప్పులను సరిచేసి నిబంధనల ప్రకారం సక్రమైన లిస్టులు వెల్లడి చేయాలని శ్రీను కోరారు.


పచ్చటి తివాచీలా కనువిందు చేస్తున్న మడ అడవులు



కృష్ణానదీ పాయల్లో మడ అడవులను తిలకిస్తూ బోటులో గులలమోద లైట్‌హౌస్‌కు వెళ్తున్న పర్యాటకులు



పడవ దిగి లైట్‌హౌస్‌కు వెళ్లే రోడ్డు, సోలార్ లైట్‌హౌస్

వాహ్..గుల్లలమోద

- 20 కిలో మీటర్లు పడవ ప్రయాణం
- పచ్చని తివాచీలా మడ అడవుల కనువిందు
- బ్రిటీష్‌కాలం నాటి లైట్‌హౌస్
- పర్యాటకాభివృద్ధికి అవకాశం

చుట్టూ పచ్చని తివాచీ పరచినట్లుగా మడ అడవుల సౌందర్యం.. పక్షుల కిలకిలారావాలు... కృష్ణానది బ్యాక్ వాటర్ .. సముద్రపు అలల సవ్వడి.. సముద్రుడి కెరటాలను ఆలింగనం చేసుకోవాలన్న ఆనందంలో పరుగులెత్తే కృష్ణవేణమ్మ పరవళ్లు.. గుల్లలమోద దీవి సొంతం. ప్రకృతి సౌందర్యాన్ని వీక్షిస్తూ పడవ ప్రయాణం చేస్తూ గుల్లలమోద లైట్ హౌస్‌ను వీక్షించడం మధురానుభూతిని స్తుంది. గుల్లలమోద దీవి అందాలకు నెలవు అంటే అతిశయోక్తి కాదు.

(ఆంధ్రజ్యోతి, నాగాయలంక)

కృష్ణాజిల్లా దివిసీమలో నాగాయలంక మండలం కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో గుల్లలమోద ఉంది. కృష్ణానది పాయల మధ్య పడవ ప్రయాణంలో పచ్చని తీవాచీలా మడ అడవులు కనువిందు చేస్తాయి.

ప్రధానంగా నాగాయలంక పడవల రేవు నుంచి ప్రత్యేక పడవుల్లో గులల్లమోదకు చేరుకోవచ్చు. అంతే కాకుండా సొర్లగొంది, గుల్లలమోద, సం గమేశ్వరం, ఎదురుమొండి గ్రామాల నుంచి కృష్ణానదీ పాయల్లో ప్రయాణించి గుల్లలమోద లైట్‌హౌస్ చేరుకోవచ్చు. కృష్ణానది గుల్లలమోదలో బంగాళాఖాతంలో కలుస్తుంది. కృష్ణవేణి జడపాయలు మధ్య మడ అడవులతో నిండి ఉన్న గుల్లలమోద లైట్‌హౌస్ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ అందాలను తనివితీరా చూడాలంటే రానుపోను ఆరు గంటలపాటు 20 కిలోమీటర్ల పైగా లాంచీలో వెళ్లాలి. దీని కోసం ప్రకృతి ప్రేమికులు ఒక పగటిపూటను కేటాయించాలి.

బ్రిటీష్ కాలం నాటి లైట్‌హౌస్

గుల్లలమోద లైట్‌హౌస్‌ని బ్రిటీష్ కాలంలో నిర్మించా రు. దీనిని 1972 సంవత్సరంలో ఆధునీకరించారు. మొ త్తం తొమ్మిది అంతస్తులతో ఉన్న ఈ లైట్ హౌస్ ఎత్తు 135 అడుగులు. 1977లో వచ్చిన పెను ఉప్పెనకు ఐదో అంతస్తు వరకు వరద నీరు చేరినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ లైట్‌హౌస్‌ని ఆధునీకరించక ముందు సాయంకాలం దీప స్తంభాల అద్దాలను తుడిచి కిరోసిన్ దీపం వెలిగించే వారు. సుమారు 25 కిలో మీటర్ల దూరం వరకు దాని కాంతి కిరణాలు పడేవి. తదనంతరం లైట్‌హౌస్‌ని సోలార్ దీపంగా ఆధునీకరించారు. రాత్రి పూట దీప స్తంభంలోని దీపం ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తుంది.

పర్యాటక శాఖ బోట్లను నడపాలి

నాగాయలంక నుంచి గుల్లలమోద లైట్‌హౌస్‌కి ఏపీ పర్యాటక శాఖ బోట్లను నడపాలి. సందర్శకులకు బోట్లలో మంచినీరు, తిను బండారాలు, తేనీరు సౌకర్యాన్ని కల్పించాలి. చార్జీలు సందర్శకులకు, ప్రకృతి ప్రేమికులకు అందుబాటులో ఉండాలి.

-ఎం.హరనాథ్, తహసీల్దార్

పాపికొండలు తరహాలో అభివృద్ధి చేయాలి

గుల్లలమోద లైట్‌హౌస్ ప్రాంతాన్ని పాపికొండల తరహాలో అభివృద్ధి చేయాలి. టూరిజం శాఖ బోట్లను వారానికి రెండు సార్లు నడపాలి. లైట్‌హౌస్ దగ్గర పిల్లలకు పార్క్, దివిసీమ చరిత్ర తెలిపే మ్యూజియం ఏర్పాటు చేయాలి. సందర్శకులకు తక్కువ ఛార్జీలు నిర్ణయించాలి.

-చన్నగిరి లతామోహన్, ప్రకృతి ప్రేమికుడు

అంతా పడవ ప్రయాణమే..

ప్రత్యేక పడవలల్లో గుల్లలమోదకు 20 కిలోమీటర్లు వెళ్లాలంటే మత్స్యకారులు ఎక్కువ మొత్తాలను వసూలు చేస్తున్నారు. గుల్లలమోద దీప స్తంభాన్ని చూడాలని ఆసక్తి ఉన్నా..పడవ ప్రయాణంలోని భారీ చార్జీలను చెల్లించలేక వెనుకడుగు ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ప్రత్యేక పడవలను ఏర్పాట్లు చేసి, భోజనాలు, మంచినీటి వసతి, ప్రత్యేక సౌకర్యాలు గల పడవలు ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

కూటమి ప్రభుత్వం రాకతో చిగురించిన ఆశలు

గుల్లలమోదదలోని లైట్‌హౌస్ ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని దశాబ్దాల కాలం నుంచి ప్రకృతి ప్రేమికుల నుంచి ఒత్తిడి ఉంది. గుల్లలమోద లైట్‌హౌస్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మండలి బుద్దప్రసాద్ కొంత ప్రయత్నం చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి అటకెక్కింది. చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ చొరవ చూపి గుల్లలమోద లైట్‌హౌస్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తారనే అభిప్రాయం నెలకొంది.



గుల్లలమోద లైట్‌హౌస్ వద్ద పర్యాటకుల గ్రూప్ ఫొటో (ఫైల్)

కళాశాల స్థలాన్ని రక్షించుకుంటాం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


- ఎస్ఆర్ఆర్ పూర్వ విద్యార్థుల ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు

గుణదల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అన్యాక్రాంతమౌతున్న ఎస్ఆర్ఆర్ కాలేజీ భూములపై పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పోరుబాట పట్టారు. ఎస్ఆర్ఆర్ కాలేజీ భూముల మాయ శీర్షికన మంగళవారం ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో పూర్వ విద్యార్థులు స్పందించారు. భూముల అన్యాక్రాంతాన్ని నిరసిస్తూ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. కళాశాల స్థలాన్ని కాపాడుకోవటానికి ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపకులు కూడా ధర్నాలో పాలు పంచుకున్నారు. విజయవాడలో నాణ్యమైన విద్య అందించాలన్న ఆకాంక్షతో నూజివీడు జమిందారులు ఇచ్చిన స్థలాన్ని ఎలాగైనా దక్కించుకుని తీరుతామని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులోగల ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన వివాద స్థలంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆద్వర్యంలో నిరసన కార్యక్రమం మంగళవారం జరిగింది. పూర్వ విద్యార్థులు, ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కలిసి ఎస్ఆర్ఆర్ స్థలాన్ని ఎలాగైనా కాపాడుకుంటాం, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి, స్థలంలో ఉన్న నిర్మాణాలు కాళీ చేయించి కళాశాలకు అప్పగించేంత వరకు పోరాటం ఆగదు అంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ కళాశాల విజయవాడ నగరంలోని కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాల విషయంలో పోటీపడుతోందన్నారు. అటువంటి కళాశాల స్థలాన్ని కబ్జాకోరుల బారి నుంచి కాపాడుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. పూర్వవిద్యార్థులు, ఎస్ఆర్ఆర్ కళాశాల సిబ్బంది కలిసి ఆక్రమిత స్థలంలో మరో రెండు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి చిగురుపాటి యుగంధర్, ఉపాధ్యాక్షుడు ఆళ్ళ వేణుగోపాలరావు, కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, మాజీ డిప్యూటి మేయర్ చెరుకూరి కృష్ణ కుమార్(నాని), కె.పి.రావు తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి 7.28 ఎకరాల విస్తీర్ణం స్థలాన్ని కాబ్జాకోరుల బారి నుంచి స్వాధీనం చేసుకుని కళాశాలకు అప్పగించాలని సీపీఐ నేత దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపుగా నేరుగా ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో విద్యార్థి సంఘాలు, నగర ప్రజలను కలుపుకుని ప్రజా ఉద్యమం చేపడతామన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు లంకా జానయ్య మాట్లాడుతూ కళాశాల స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం తరుపున లీగల్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కబ్జాదారుడు తెచ్చుకున్న స్టేటస్కోను రద్దు చేయించే విషయంలో ప్రభుత్వం కలుగజేసుకోవాలని డిమాండ్ చేశారు.

హోదా ఒకరిది..సంతకం వేరొకరిది

ఓపెన్ టెన్త్ హాల్ టికెట్ల జారీలో గందరగోళం


1320503-GVJ Z P HIGH SCHOOL(B),JAGGAIAHPETA(T),JAGGAIAHPETA(M),NTR

M. Radha K

CO ORDINATOR

APOSS AI CODE - 1320503

GVJZP HIGH SCHOOL

JAGGAYYAPET - 175, NTR Dist.

జగ్గయ్యపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట బాలుర ఉన్నత పాఠశాల ఓపెన్ టెన్త్ కేంద్రం నుంచి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్ల జారీ ప్రహసనంగా మారింది. ఈనెల 17 నుంచి రాష్ట్రంలో ఓపెన్ టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాలుర హైస్కూల్ సెంటర్ నుంచి పరీక్షలకు హాజర య్యే అభ్యర్థులకు హాల్ టికెట్ల జారీ గత రెండు రోజులుగా జరుగుతోంది. బాలుర హైస్కూల్ హెచ్ఎం అక్రిడేటెడ్ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. హాల్ టికెట్లపై ఒక వైపు పరీక్షల డైరెక్టర్ డిజిటల్ సంతకం మరో వైపు ఏఐ కోఆర్డినేటర్ సంతకం ఉండాలి. జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ హెచ్ఎం మాధవీలత సంతకంతో జారీ చేయాల్సిన హాల్ టికెట్లపై ఎం.రాధాకృష్ణ అనే ఉపాధ్యాయుడి సంతకంతో ఇస్తున్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో ఏఐ కోఆర్డినేటర్‌గా ఉన్న ఆమెను నిబంధనలకు విరుద్ధంగా స్థానికంగా రెండు ప్రైవేట్ స్కూల్స్ పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించారు. దీనిపై ఫిర్యాదులు రావటం, ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవటంతో ఆమెను సిట్టింగ్ స్క్వాడ్ విధుల నుంచి తొలగించారు. ఇప్పుడు ఆమె పేరుతో జారీ చేయాల్సిన హాల్ టికెట్లు వేరే వ్యక్తి ఆమె హోదాతో ఏఐ కోఆర్డినేటర్‌గా సం తకాలు చేయటం గందర గోళానికి దారి తీసింది. పరీక్షార్థులు ఈ హాల్ టికెట్లు చెల్లుతాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ వెంకటప్పయ్యను వివరణ కోరగా, తన దృష్టికి రాలేదని చెప్పారు. ఏఐ కోఆర్డినేటర్ కాని వేరే వ్యక్తులు సంతకం చేయకూడదని వివరణ ఇచ్చారు. డీఈవో సుబ్బారెడ్డిని వివరణ కోరగా బాలుర హైస్కూల్ ఏఐ కో ఆర్డినేటర్‌ను తామేమి మార్చ లేదని, రాష్ట్ర అధికారులు మార్చినట్టు తనకు సమాచారం లేదని చెప్పారు.

ఎన్నికల ప్రక్రియలో సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు

ఎన్నికల సంఘం డైరెక్టర్ అనూజ్ చందక్

మచిలీపట్నం,మార్చి11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం డైరెక్టర్ అనూజ్ చందక్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు, వివిధ ప్రధాన రాజకీయ పార్టీల నాయకులకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియలో సమస్యలు, ఇబ్బందులు ఉంటే వాటిని నేరుగా అన్ని రాజకీయపార్టీల నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియపరిచే వెసులుబాటును కల్పించినట్లు లేఖలో పేర్కొన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి, ప్రధాన ఎన్నికలఅధికారి స్థాయి లో పరిష్కారం కాని సమస్యలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి నేరుగా తెలియ జేయవచ్చన్నారు. సమస్యలపై రాజకీయపార్టీల నాయకులతో చర్చించి,వాటి పరిష్కారమార్గాలపై చర్చలు జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోగా రాజకీయపార్టీల నాయకులు కేంద్ర ఎన్నికలసంఘానికి సమస్యలను తెలియజేయాలని ఆయన సూచించారు.

గోరా టెక్నోహబ్ ప్రారంభం రేపు

బెంజిసర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువతను అత్యాధునిక టెక్నాలజీ వైపు నడిపించే దిశగా ఈనెల 13వ తేదీన విజయవాడలోని నాస్తిక కేంద్రంలో గోరా టెక్నో హబ్‌ను ప్రారంభిస్తున్నట్లు గోరా టెక్నో హబ్ చైర్మన్ డాక్టర్ జి. సమరం చెప్పారు. నాస్తిక కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోరా టెక్నో హబ్‌ను ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, డీఆర్‌డీఏ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ అధ్యక్షత వహిస్తారన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీని యువతకు చేరువ చేయడం కోసమే టెక్నో హబ్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు పరుగులు పెడుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత చేరువచేసేందుకు టెక్నో హబ్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులను భాగ్యస్వామ్యం చేస్తూ వర్క్‌షాపులు, సెమినార్‌లను నిపుణులైన శాస్త్రవేత్తలతో నిర్వహిస్తామని డాక్టర్ సమరం చెప్పారు. గోరా టెక్నో హబ్‌లో అంతరక్షశాలనే ఏర్పాటు చేశామన్నారు. అందులో చంద్రయాన్-3, శాటిలైట్, చంద్రుని మీద ఓవర్ ప్రయాణం, స్పేస్‌షిప్ వంటి ఎన్నో ఆసక్తికర అంశాలను పొందుపరిచామన్నారు. సమావేశంలో గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత, రష్మీ, సకల తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారం కోరుతూ వీవోఏల ధర్నా

విజయవాడ (ధర్నాచౌక్) మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు రోడ్డెక్కారు. ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో మంగళవారం చేపట్టిన ధర్నాలో పెద్దసంఖ్యలో వీవోఏలు పాల్గొన్నారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌ల ఉద్యోగాలకు ఎసరుపెట్టే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్నికల సందర్భంగా వీవోఏలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబును కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీవోఏ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సి.హెచ్.రూపాదేవీ అధ్యక్షతన జరిగి ఈ కార్యక్రమంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధనలక్ష్మీ, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి..నాగేశ్వరరావు, కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కోదాడలో గంజాయి ముఠా అరెస్టు

సూర్యాపేట క్రైం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడలో గంజాయి అమ్ముతున్న కృష్ణాజిల్లాకు చెందిన ఐదుగురిని సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కొత్తపల్లి నర్సింహా జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనుమూరుకు చెందిన మల్లెడ వెంకట వంశీ, వణుకూరుకు చెందిన గోకులమూ డి ఆనంద్ ఒడిషా రాష్ట్రంలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారు. కోదాడలో గంజాయిని యువకులకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న కోదాడ పట్టణ పోలీసులు దాడి చేశారు. వెంకటవంశీ, ఆనంద్, విజయవాడ నుంచి గం జాయి కోసం వచ్చిన యువకులు తెచ్చిన బైక్‌పై పరారయ్యారు. తేజ, పాలపర్తి క్రిష్ణచైతన్య, సంపత్‌కుమార్, నాగవీరభాస్కర్ రావు, హేమస్ నర్సింహసాయిలను పట్టుకోవడంతో పాటు రూ.లక్ష విలువ చేసే 9.860 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహం, సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య

వైద్య విద్యార్థుల క్రీడా నైపుణ్యం అభినందనీయం

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించటం అభినందనీయమని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం అన్నారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో హెల్త్ యూనివర్శిటీ 26వ పురుషుల అంతర్ క్రీడా పోటీలు ఫేజ్-1 మంగళవారంతో ముగిశాయి. ఈ సభలో వీసీ డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య విద్యార్థుల దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు యూనివర్శిటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీ లు నిర్వహిస్తున్నామన్నారు. సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. విజేతలకు బహుమతులు, పతకాలు, సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సివి రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి భీమేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, యూనివర్శిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవినేని రవి తదితరులు పాల్గొన్నారు.


గన్నవరం విమానాశ్రయంలో తిరిగొచ్చిన మయన్మార్ శరణార్థులు

మయన్మార్ నుంచి ఏడుగురు శరణార్థులు రాక

- కుటుంబసభ్యులకు అప్పగించనున్న సీఐ శివ ప్రసాద్

గన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ నుంచి ఏడుగురు శరణార్థులు మంగళవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. మయన్మార్‌లో ఫేక్ వీసాలతో ఉద్యోగాల కోసం వెళ్లిన వారిని తిరిగి పంపడంతో ఇండియన్ గవర్నమెంట్ సహాయంతో ఢిల్లీ తీసుకురాగా, అక్కడ నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. విజయవాడకు చెందిన షేక్ కహాఫ్, సయ్యద్ ఆఫ్రిద్, జోయల్ సన్నీ (గుంటూరు), చిల్లి త్రిదేవ్(రాజమండ్రి), షేక్ గౌస్ మస్తాన్(ఫిరంగిపురం), షంషేర్ భాషా(ప్రొద్దుటూరు), రాకేష్‌కుమార్(విశాఖపట్నం)లను గన్నవరం సీఐ బివి శివ ప్రసాద్ రిసీవ్ చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని కుటుంబ సభుయలకు అప్పగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైల్వే టీటీఈ, ఆర్‌పీఎఫ్ పోలీసుల చొరవ

- రైల్వే ఉన్నతాధికారుల అభినందన

రైల్వేస్టేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కపుర్తలా రైలు కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సిఎఫ్) మాజీ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్ ఈనెల 6వ తేదీన 20677 వందేభారత్ రైలులో ప్రయాణం చేస్తూ విజయవాడలో దిగే సమ యంలో ల్యాప్‌ట్యాప్‌ను మరచిపోయారు. ల్యాబ్‌టాప్‌ను ఆర్‌పీఎఫ్ సి బ్బంది ఆయనకు అందజేశారు. తనకు ల్యాప్‌టాప్‌ను అందజేయటంలో చొరవ చూపిన టీటీఈ, ఆర్‌పీఎఫ్, రైల్వే అధికారులను అభినందించారు. శ్రీనివాస్ తాను రైలులో ప్రయాణిస్తూ ల్యాప్‌టాప్‌ను వినియోగించారు. విజయవాడలో ఆయన దిగుతూ ల్యాప్‌టాప్‌ను తన సీటులోనే మరచి పోయారు. చెన్నై డివిజన్‌కు చెందిన ఆన్‌బోర్డు ట్రావెలింగ్ టిక్కెట్ ఎగ్జామినర్ టీటీఈ తాను విధుల నుంచి దిగుతూ సీటులను తనిఖీ చేసినప్పుడు అతనికి ల్యాప్‌టాప్ కనిపించింది. వెంటనే ఆ సమాచారాన్ని విజయవాడ డివిజన్ ఆర్‌పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. వెంటనే రిజర్వేషన్ చార్టులను పరిశీలించి శ్రీనివాస్ పేరును గుర్తించి అందజేశారు. వృత్తి నైపుణ్యం, సమగ్రత, సమర్థత, ప్రయాణికుల సేవల పట్ల అంకిత భావం, నిబద్ధతను గుర్తుచేసి వారిని ప్రశంసించారు.

దుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర బృందం

ఇంద్రకీలాద్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ వారిని మంగళవారం కేంద్ర ప్రభుత్వ సులభతర వాణిజ్య విధానం, కంప్లయన్స్ రిడక్షన్ బృందం దర్శించుకుంది. కేబినేట్ సెక్రటేరియట్ నుంచి వందనా గుర్నాని, సంచాలకురాలు శ్వేతా మహంతి, డీపీ ఐఐటీ డిప్యూటీ సెక్రటరీ యశ్వని ముండ్, నీతి అయోగ్ ప్రతినిధి గాయత్రి పాండే అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం వారికి డిప్యూటీ ఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలను అందచేశారు.

పెండింగ్ బిల్లుల కోసం బిల్డింగ్ కాంట్రాక్టర్ల పోరు రేపు

బెంజిసర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్(సబ్కా) ఈ నెల 13న విజయవాడలో చలో సబ్కా కార్యక్రమానికి పిలుపునిచ్చింది.అదే రోజు సాయంత్రం తమ కార్యాచరణను ప్రకటి స్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్స్ అందరూ ఛలో సబ్కా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని అసోసియేషన్ కోరింది. కోవిడ్ సమయంలో పీహెచ్‌సీలను నిర్మించినా నేటి వరకు బిల్లులు రాలేదని, తాగునీటి పనులు, 15వ ఆర్థిక సంఘం పనులు, కాల్వల మరమత్తులు, స్థానిక సంస్థల్లో ఎస్‌డీఎఫ్ పనులు చేసిన నేటి వరకు బిల్లులు రాలేదని అసోసియేషన్ తెలిపింది.

సమగ్రశిక్షా ఉద్యోగుల ధర్నా

ధర్నాచౌక్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎ.పి. నాగేశ్వరరావు, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.కాంతారావు, యు.కళ్యాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాన్ మోడి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థ పట్ల నమ్మకం పెంపు లక్ష్యంగా పల్లెనిద్ర

ఉంగుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసింగ్ వ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో పల్లెనిద్ర చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఆయన పల్లెనిద్ర చేశారు. స్థానిక సమస్యలపై చర్చించి, నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గస్తీ పెంపు, పోలీస్ మిత్ర బృందా ఏర్పాటుతో నేరాల అదుపుకు సమాలోచనలు జరిపారు. పల్లెనిద్ర కార్యక్రమంతో సమస్యాత్మక గ్రామాల్లో నిఘాను మరింత పటిష్టంచేసి, శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఆస్కారముంటుందన్నారు. పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉన్నారని, వారి సేవలను నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఎస్సై చావా సురేష్, పోలీస్‌సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫ్యాషన్

వేసవిలో గాలి చొరబడే, తేలికపాటి కాటన్ చీరల ట్రెండ్ మొదలైపోతుంది. వీటిలో ప్రింటెడ్ కాటన్ చీరలు సర్వత్రా ఆదరణ పొందుతూ ఉంటాయి. అలాంటి కొన్ని కాటన్ చీరల మీద ఓ లుక్కేద్దామా...

వేసవిలో హాయిగొలిపేలా



మల్ కాటన్

మస్లిన్ కాటన్ అనే పేరున్న ఈ మల్ కాటన్ చీరలు శతాబ్దాలుగా వాడుకలో ఉన్నాయి. పర్షియా భాషలో మల్‌మల్ అనే పదానికి కాటన్ వూల్ అని అర్థం. పేరుకు తగ్గట్టే ఈ చీరలు ఎంతో మెత్తగా, సౌకర్యంగా ఉంటాయి. ఈ మల్ వస్త్రం సహజసిద్ధ మెరుపు కోల్పోకుండా వేర్వేరు రంగులను అద్దే వీలుండడం వల్ల, మల్ కాటన్ చీరలను ఆకర్షణీయమైన ప్రింట్లలో తయారు చేస్తూ ఉంటారు. ప్రధానంగా చమటను పీల్చే గుణం కలిగి ఉండడం మూలంగా మల్ చీరలు వేసవిలో విపరీతంగా ఆదరణ పొందుతూ ఉంటాయి.

బగ్రు కాటన్

సహజసిద్ధ రంగులతో చేతి అద్దకంతో రూపొందే ఆకర్షణీయమైన బగ్రు చీరలకు రాజస్థాన్‌లోని బగ్రు ఎంతో ప్రసిద్ధి పొందింది. వందేళ్ల చరిత్ర కలిగిన బగ్రు అద్దకం కోసం డిజైన్లు చెక్కిన చెక్క బ్లాక్‌లను ఉపయోగిస్తారు. ఇండిగో, పసుపు మొదలైన సహజసిద్ధ రంగులతో రూపొందే బగ్రు చీరలు ఎక్కువ కాలం కూడా మన్నుతాయి.

మన్నిక ఇలా...

వేసవిలో ఎలాంటి కాటన్ చీరలను ఎంచుకున్నా, వాటి రంగులు వెలసిపోకుండా, నాణ్యత తగ్గిపోకుండా కాపాడుకోవడం కోసం ఈ చీరలను నీడలోనే ఆరబెట్టాలనే విషయం మర్చిపోకూడదు. అలాగే వాటిని ఉతికే విధానం కూడా సున్నితంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే కాటన్ చీరలు ఎక్కువ కాలం మన్నుతాయి.



పిల్లలు అడిగిందల్లా ఇచ్చేస్తున్నారా?

పిల్లలు సాధారణంగా కంటికి ఆకర్షణీయంగా కనిపించిన ప్రతీదీ కావాలని అడుగుతూ ఉంటారు. ఇలా అడిగిందల్లా ఇవ్వడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. పిల్లల కోరికలు, వాటిని నెరవేర్చడం మధ్య తల్లిదండ్రులు ఎలా సమతూకం పాటించాలో తెలుసుకుందాం.

- పిల్లలు అడిగినవన్నీ తెచ్చి ఇస్తూవుంటే వాళ్లలో మొండితనం పెరుగుతుందని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి. అలాగని పిల్లలు ఏమి అడిగినా పట్టించుకోకపోతే వారిలో నిరాశ పెరుగుతుంది. పిల్లల వయసును దృష్టిలో ఉంచుకొని వారి అవసరాల మేరకు ఏది తప్పనిసరిగా కావాలో అడిగి తెలుసుకుని దాన్ని మాత్రమే తల్లిదండ్రులు కొనిస్తే సరిపోతుంది.
- పిల్లలకు ఏదోఒకటి కొనిచ్చి తాత్కాలికంగా



సంతోషపెట్టే బదులు వాళ్లకి ఉపయోగపడేవాటిని మాత్రమే తల్లిదండ్రులు తేవడం మంచిది.
- ఖరీదైన బొమ్మలు, డిజిటల్ గేమ్స్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ లాంటివి పిల్లల సామర్థ్యాన్ని పెంచలేవు. వీటివల్ల పిల్లల్లో సృజనాత్మక శక్తి, సంభాషించే సామర్థ్యం, భాషా నైపుణ్యం, సందర్భాన్ని అర్థం చేసుకునే పరిణతి లాంటివి అలవడవు. పిల్లల శరీర బరువు పెరిగి వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం ఏర్పడవచ్చు. సాధ్యమైనంత వరకూ పిల్లలతో ఎక్కువగా మాట్లాడుతూ వారితో రకరకాల ఆటలు ఆడించడం మంచిది.
- స్నేహితుల దగ్గర ఉందనో, తన వద్ద ఉంటే గొప్పగా ఉంటుందనో ఇలా పలు రకాల కారణాలతో పిల్లలు ఏవేవో అడుగుతూ ఉంటారు. పిల్లలు ఏమి అడుగుతున్నారు? ఎందుకు అడుగుతున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు ఒక నిర్ణయానికి రావాలి. వీలైతే పిల్లలతో సవివరంగా మాట్లాడవచ్చు. సరైన కారణం దొరకని పక్షంలో పిల్లలకు నచ్చజెబుతూ వారి మనసు మళ్లించే ప్రయత్నం చేయాలి.
- పిల్లలు అడిగినవన్నీ ఇవ్వకుండా తల్లిదండ్రులు కొన్ని హద్దులు నిర్దేశించడం అలవాటు చేసుకోవాలి. పిల్లల మనసు నొచ్చుకుంటుందనీ, వాళ్లు ఏడుస్తున్నారనీ అడిగిన ప్రతీదాన్నీ తెచ్చి ఇచ్చే ప్రయత్నాలు చేయకూడదు. దీనివల్ల పిల్లల్లో మానసిక సమస్యలు ఏర్పడతాయి.
- పిల్లలు అడిగిన వస్తువును కొనకుండా అద్దెకు తీసుకు వచ్చే వీలుందా? ఎవరి దగ్గర నుంచైనా తీసుకునే అవకాశం ఉందా? సొంతంగా తయారు చేసుకునే వెసులుబాటు ఉందా? అనే అంశాలను తల్లిదండ్రులు పరిశీలించాలి. వీటి గురించి పిల్లలతో చర్చిస్తే వాళ్లలో ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుంది.

సాయంకాలం నడక మంచిది!

వేసవికాలంలో సాయంత్రం పూట వాకింగ్‌కు వెళ్లడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

- సాయంత్రంపూట అహ్లాదకరమైన వాతావరణంలో నడవడం వల్ల మెదడులో సెరటోనిన్ అనే రసాయనం విడుదలవుతుంది. దీంతో రాత్రిపూట నిద్ర బాగా పడుతుంది.
- ఉదయం నుంచి సాయంత్ర వరకూ రకరకాల పనులతో శారీరకంగా అలసట, మానసికంగా ఒత్తిడి అధికంగా ఏర్పడతూ ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం కనీసం అరగంటసేపు నడిస్తే బడలిక తీరి మెదడు ఉత్సాహంగా పనిచేస్తుంది.
- సాయంత్రం వేళ వేగంగా నడవడం వల్ల శరీరానికి తగినంత ఆక్సిజన్ లభిస్తుంది. ఊపిరితిత్తులు, గుండె కండరాలు ఆరోగ్యంగా పనిచేస్తాయి. మానసిక ఉల్లాసం లభిస్తుంది.
- మధుమేహంతో బాధపడేవారు సాయంకాలం నడవడం అలవాటు చేసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయి నియంత్రణలో ఉంటుంది. రక్తపోటు సమస్య రాదు. శరీరంలోని కొవ్వులు తొందరగా కరుగుతాయి.
- సాయంకాలపు నడక వల్ల శరీరంలోని కండరాలు బలపడతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అతిగా తినాలనే కోరిక తగ్గి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జీవక్రియలు వేగవంతమవుతాయి. జీర్ణాశయ సమస్యలు తీరుతాయి. రాత్రి భోజనం తరవాత కొద్దిసేపు నడవడం వల్ల కడుపులో ఆమ్లత్వం, పొట్టలో ఉబ్బరం, అజీర్తి లాంటివి తగ్గుతాయి.



సంకల్పం

అభిరుచే ఆశయంగా

సంకల్ప బలం దేన్నయినా జయించగలదు... ఎంతటి లక్ష్యాన్నయినా... వైకల్యాన్ని అయినా! అందుకు నిలువెత్తు సాక్ష్యం సురభి బన్సాల్. ఊహ తెలిసినప్పటి నుంచీ చక్రాల కుర్చీలో నుంచే ప్రపంచాన్ని చూసినా... ఆ ప్రభావాన్ని తన జీవితం మీద పడనివ్వలేదు. ఉన్నత విద్యతో కార్పొరేట్ కొలువులు సంపాదించిన ఆమె... మోటివేషనల్ స్పీకర్‌గా, యూట్యూబర్‌గా తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకొంది. అన్నిటికీ మించి మించి... సవాళ్లెన్నిటినో అధిగమించి... నాట్యంతో అందరినీ మైమరిపిస్తోంది. ఎందరికో ప్రేరణనిస్తోంది.



"మన జీవితం మన చేతుల్లోనే ఉంటుందనేది నా నమ్మకం. అందుకే దాన్ని అందంగా, విజయవంతంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత కూడా మనదే. ముంబయిలోని సాధారణ మధ్యతరగతి కుటుంబం మాది. పుట్టుకతోనే సెరెబ్రల్ పాల్సీ (మెదడు పక్షవాతం) ఉందని వైద్యులు తేల్చారు. ఇది ఎదుగుదల మీద, మానసిక, శారీరక కదలికల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. ఊహ తెలిసినప్పటి నుంచీ చక్రాల కుర్చీలోనే నా ప్రయాణం. చుట్టుపక్కల పిల్లలతో కలిసి ఆడుకోవాలని, పరుగెత్తుతూ గంతులేస్తూ బాల్యాన్ని ఆస్వాదించాలని... నెరవేరవని తెలిసినా ఎన్నో కలలు. కాస్త పెద్దయ్యాక నా గురించి నాకు పూర్తి అవగాహన వచ్చింది. ఇక అప్పటి నుంచి బాధను పక్కకు నెట్టి... వైకల్యాన్ని మరిచి అడుగు ముందుకు వేశాను. నేను ఎవరికీ తక్కువ కాదని నాకు నేను ధైర్యం చెప్పుకొని, నాకంటూ ఒక కెరీర్‌ను నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నాను. ఎదురైన సవాళ్లను నా అభివృద్ధికి అవకాశాలుగా మలుచుకున్నాను. దృఢ సంకల్పంతో, అచంచలమైన స్ఫూర్తితో నన్ను నేను నిరూపించుకొనేందుకు పోరాటం మొదలుపెట్టాను.



టాప్ కంపెనీల్లో కొలువు...

నా ప్రతి అడుగులో మా అమ్మానాన్న అండగా నిలిచారు. ఏది కావాలంటే అది సమకూర్చారు. వారి ప్రోత్సాహంతోనే నేను పాఠశాలకు వెళ్లి చదువుకున్నాను. అందరితో పోటీపడి మంచి మార్కులు తెచ్చుకున్నాను. ఉన్నత చదువులు కొనసాగించగలిగాను. ముంబయి 'ఠాకూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అండ్ రీసెర్చ్' నుంచి 2006లో ఎంబీయే ఫైనాన్స్ పూర్తి చేశాను. వెంటనే 'జేపీ ఎంటర్‌ప్రైజెస్'లో ఎగ్జిక్యూటివ్‌గా చేరాను. అదే నా తొలి ఉద్యోగం. దాదాపు మూడేళ్లు అక్కడ పని చేశాక 'మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా'లో అసిస్టెంట్ మేనేజర్‌గా అవకాశం లభించింది. ఏడేళ్లకు పైగా అక్కడి మెంబర్‌షిప్, ఇన్‌స్పెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించాను. అందులో పని చేస్తుండగానే, 2016లో ప్రముఖ కంపెనీ 'మోర్గాన్ స్టాన్లే' నుంచి పిలుపు వచ్చింది... మేనేజర్‌గా. మరో ఏడేళ్లు ఆ సంస్థలో గడిచిపోయాయి. టాప్ కంపెనీల్లో వివిధ విభాగాల్లో పని చేయడంవల్ల వ్యాపార, ఆర్థిక లావాదేవీల మీద పట్టు లభించింది.

ఎవరేమన్నా...

దాదాపు పద్దెనిమిదేళ్ల ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లు, సమస్యలు. నా సామర్థ్యాన్ని కాకుండా నా వైకల్యాన్ని చూసి కుంగదీసే మాటలు. ఎవరేమన్నా... ఎంతటి అవమానాలు ఎదురైనా దృఢ చిత్తంతో అన్నిటినీ అధిగమించాను. ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మలుచుకున్నాను. ఉద్యోగంతోనే సరిపెట్టుకోకుండా నలుగురిలో నన్ను నేను భిన్నంగా నిలుపుకొనే ప్రయత్నం కూడా చేస్తూ వచ్చాను. అదే ఇవాళ నన్ను ఈ ప్రపంచానికి గొప్పగా పరిచయం చేయడానికి దోహదపడింది.

లక్ష్యం వైపు నడిపిస్తూ...

ఒక వైపు ఉద్యోగానికి వెళుతూనే ఖాళీ సమయాల్లో వివిధ సర్టిఫికెట్ కోర్సులు చేశాను. లైఫ్ కోచ్‌గా యువతను లక్ష్యం దిశగా నడిపించాను. మోటివేషన్ స్పీకర్‌గా తోటి మహిళల సాధికారతకు తోడ్పాటు అందిస్తున్నాను. మానసికంగా కుంగిపోయినవారికి మనో ధైర్యం ఇస్తూ, కార్యోన్ముఖులను చేస్తున్నాను. నా అనుభవం, నాకున్న విజ్ఞానాన్ని పంచుతూ ఒక మార్గదర్శకురాలిగానే కాకుండా ఒక స్నేహితురాలిగా కూడా యువతరంలో స్ఫూర్తి నింపుతున్నాను.

నాట్యం నా అభిరుచి...

చిన్నప్పటి నుంచీ నాకు నాట్యం అంటే ఎంతో ఇష్టం. నర్తకిగా ప్రశంసలు పొందాలనేది నా బలమైన ఆకాంక్ష. నేను తిరిగేది చక్రాల కుర్చీలోనే. శారీరకంగా నా కదలికలకు కొన్ని పరిమితులున్నాయని తెలుసు. కానీ వాటిని దాటి అనుకున్నది సాధిస్తేనే కదా... మనమేంటో ప్రపంచానికి తెలిసేది. అందుకే నాకు అత్యంత ఇష్టమైన నాట్యం నేర్చుకోవాలని నిశ్చయించుకున్నాను. దాని కోసం నా ఉద్యోగం వదిలేశాను. పూర్తి సమయం కథక్ అభ్యాసానికి కేటాయించాను. కథక్‌లో తొలి అంకం పూర్తి చేశాను. 'భావ్ నృత్య' పరీక్షలో ఉత్తీర్ణత సాధించాను. నా శరీరం ఇప్పుడు లయబద్ధంగా కదులుతుంది. ఇదేకాకుండా బాలీవుడ్ పాటలకు కూడా నాదైన శైలిలో నాట్యం చేస్తున్నాను.

రికార్డులూ ఉన్నాయి...

నాట్యం నా అభిరుచి మాత్రమే కాదు... నా హృదయ స్పందన కూడా. నాలోని భావాలను పలికించే ఒక ప్రక్రియ. నాట్యానికి సరిహద్దులు లేవు. నా దృష్టిలో ఇది ఒకరిలో చైతన్యం రగిలించగలదు. కొన్ని రియాలిటీ షోస్‌లో, మరికొన్ని వేదికలపై ప్రదర్శనలు ఇచ్చాను. కళ పట్ల నాకున్న అంకితభావానికి గుర్తుగా 'హార్వార్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నా పేరు నమోదైంది. కొన్ని ప్రముఖ సంస్థల నుంచి అవార్డులు, అభినందనలు అందుకున్నాను. నాలాంటివారిలో, యువతరంలో స్ఫూర్తిని నింపే ఉద్దేశంతో యూట్యూబ్ చానల్ కూడా ప్రారంభించాను. నా డ్యాన్స్ వీడియోలను అందులో పోస్ట్ చేస్తున్నాను. 'మీ ప్రయాణం నాకు ప్రేరణ కలిగిస్తోంది' అంటూ కామెంట్లు చదివినప్పుడు నా మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది. గర్వంగానూ ఉంటుంది."

పాత్రలపై మొండి మరకలను ఇలా తొలగించాలి..!

ప్రతిరోజూ వంట కోసం వాడే పాత్రలపై మొండి మరకలు ఏర్పడుతూ ఉంటాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగించిన తరవాతే ఆ పాత్రలను తిరిగి ఉపయోగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వంట పాత్రలపై నిలిచే మరకలు, వాసనలను తేలికగా పోగొట్టే చిట్కాల గురించి తెలుసుకుందాం.

- రాత్రిపూట ఒక గిన్నెలో ఒక కప్పు వేడి నీళ్లు, రెండు చెంచాల డిష్ వాష్ లిక్విడ్ వేసి బాగా కలిపి ఉంచాలి. మరుసటి రోజు ఈ విశ్రమంలో స్క్రబ్బర్ ముంచి దానితో పాత్రలను తోమి తరవాత నీటితో కడగాలి. దీంతో పాత్రల లోపలి భాగంలో ఏర్పడిన మరకలు, వండిన పదార్థాల వాసనలు తొలగిపోతాయి.



- ఒక గిన్నెలో నాలుగు చెంచాల బేకింగ్ సోడా వేసి దానికి రెండు చెంచాల నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. స్క్రబ్బర్‌తో ఈ పేస్టుని కొద్దిగా తీసుకుంటూ పాత్రలను తోమాలి. తరవాత నీటితో శుభ్రం చేస్తే మసి, జిడ్డు తొలగి పోయి పాత్రలు కొత్తవాటిలా మెరుస్తాయి.
- ఒక పళ్లెంలో మూడు చెంచాల రాళ్ల ఉప్పు తీసుకోవాలి. సగానికి కోసిన నిమ్మకాయ చెక్కతో ఈ ఉప్పుని అద్ది దానితో వంట పాత్రలను తోమి వేడినీళ్లతో శుభ్రం చేయాలి. దీంతో పాత్రలకు పట్టిన వాసనలు పూర్తిగా పోతాయి.
- పాత్రలు మాడిపోతూ ఉంటాయి. ఈ పాత్రల్లో సగం వరకూ నీళ్లు పోసి రెండు చెంచాల ఉప్పు, రెండు చెంచాల డిష్ వాషింగ్ లిక్విడ్, రెండు చెంచాల నిమ్మరసం వేసి స్టవ్ మీద పెట్టి వేడి చేయాలి. అయిదు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి అరగంటసేపు నాననిచ్చి స్క్రబ్బర్‌తో రుద్దితే పాత్రల్లోని మాడు మరకలు పోతాయి.

శరణార్థులకు ఆమె భరోసా

ఊహ తెలియకముందే శరణార్థిగా భారతదేశంలో అడుగుపెట్టారు జగదీశ్వరి శశిధరన్. అనేక ఆంక్షలు, పరివిఎతుల మధ్య తన కలను నెరవేర్చుకోవడానికి పోరాటం సాగించారు. ఇప్పుడు శ్రీలంక కాందిశీకుల పిల్లలకు మెరుగైన జీవితాలు కల్పించడానికి కృషి చేస్తున్నారు.

"మాతృభూమి స్వర్గం లాంటిదంటారు. కానీ నేను పుట్టిన దేశం అంతర్యుద్ధంతో ప్రత్యక్ష నరకంగా మారిపోయింది. దాంతో 'ఎక్కడో ఒక చోట బతికుంటే చాలు' అనుకుంటూ ఎన్నో కుటుంబాలు ప్రాణాలను అరచేత పట్టుకొని పరుగులు తీశాయి. అలాంటి కుటుంబాల్లో మాదీ ఒకటి. మా స్వస్థలం శ్రీలంకలోని మన్నార్ జిల్లా పేసాలై. మా నాన్న పేరు చిదంబరం, అమ్మ భువనేశ్వరి. వారికి అక్కడ సొంత ఇల్లు, స్థిరమైన జీవనోపాధి ఉండేవి. 1990ల్లో అంతర్యుద్ధం, ఘర్షణలతో శ్రీలంక అట్టుడికిపోయింది. తమిళ సంతతికి చెందిన వారి మీద దాడులు తీవ్రతరమయ్యాయి. దాంతో నా తల్లితండ్రులు అన్నీ వదిలేసి... కట్టుబట్టలతో ఒక నాటు పడవ మీద భారతదేశానికి శరణార్థులుగా వచ్చారు. వారి దగ్గర పాస్‌పోర్ట్ లాంటి పత్రాలేవీ లేవు. వారితో పాటు ఇదే విధంగా శ్రీలంకను కొన్ని వేలమంది విడిచిపెట్టారు. రామేశ్వరం చేరుకున్నప్పుడు... సినీ నటుడు విజయకాంత్ వారందరినీ పరామర్శించి, భోజన సౌకర్యం కల్పించినట్టు నా తల్లితండ్రులు గుర్తు చేసుకొనేవారు. ఆ తరువాత అధికారులు వారిని మదురైకి సమీపంలో ఉన్న 'అనైయూర్ శరణార్థ శిబిరాని'కి తరలించారు. అప్పటికి నా వయసు ఎనిమిది నెలలు. శ్రీలంకలో పరిస్థితులు చక్కబడిన తరువాత మళ్ళీ అక్కడికి వెళ్ళాలని అమ్మా నాన్నా అనుకున్నారు. కానీ ముప్ఫయ్యేళ్ళు దాటినా అది జరగలేదు.

సీటు ఇచ్చేది లేదన్నారు...

శరణార్థ శిబిరంలో తలదాచుకున్నవారికి ఎన్నో ఆంక్షలు, నిఘా ఉంటాయి. ఎక్కడికి వెళ్తున్నదీ నిర్వాహకులకు, అధికారులకు చెప్పాలి. నిర్ణీత సమయం లోపల తిరిగి శిబిరానికి చేరుకోవాలి. బతుకుతెరువు కోసం నా తల్లితండ్రులు భవన నిర్మాణ పనివారుగా మారారు. అప్పటి నుంచి మేము 'కేరాఫ్ అనైయూర్ రెఫ్యూజీ క్యాంప్'గా మిగిలిపోయాం. చిన్న వయసులో నాకు చాలా కలలుండేవి. బాగా చదువుకోవాలనీ, మంచి డ్యాన్సర్‌నీ, నటినీ కావాలనీ... ఇలా ఎన్నో. ఇరుకైన ఇళ్ళు, చాలీచాలని వసతుల మధ్య బతుకుతున్నా నా కలల్ని ఎప్పుడూ చంపుకోలేదు. వాటిని నెరవేర్చుకోవడం కోసం కష్టపడ్డాను. అయితే ఈ క్రమంలో... నేను కాందిశీక కుటుంబానికి చెందినదాన్ని కావడంతో చాలా ఇబ్బందులు పడ్డాను. మదురై ప్రభుత్వ సంగీత కళాశాలలో... నృత్యంలో డిప్లమా చేయడానికి దరఖాస్తు చేసుకున్నాను. సీటు కూడా వచ్చింది. కానీ కమ్యూనిటీ సర్టిఫికెట్ లేకపోవడంతో అడ్మిషన్ ఇవ్వలేమని నిర్వాహకులు చెప్పారు. ఏడుస్తూ బయటకు వెళ్తున్న నన్ను కాలేజీ ఫ్యాకల్టీ సభ్యురాలు తాంజై భవానీ మణి గమనించి పిలిచారు. "విద్యకు ఆంక్షలేమిటి?" అని కాలేజీవారిని నిలదీసి, నాకు సీటు ఇప్పించారు. ఆ తరువాత ఎన్నో ప్రదర్శనల్లో నా నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో... నాడు అభ్యంతరపెట్టినవారే "నువ్వు మా కాలేజీకి గర్వకారణం"



అని మెచ్చుకున్నారు. చదువు పూర్తి కాగానే పలు సంస్థల్లో పార్ట్-టైమ్ లెక్చరర్‌గా పని చేశాను. మరోవైపు ప్రసిద్ధ తవిఎళ గాయని డాక్టర్ విజయలక్ష్మీ నవనీత కృష్ణన్ బృందంలో పదహారేళ్ళుగా దేశంలోని పలుచోట్ల ప్రదర్శనలు ఇచ్చాను. విదేశాల్లో కూడా ఎన్నో అవకాశాలు, ఆహ్వానాలు వచ్చాయి. కానీ శరణార్థినైన నాకు పాస్‌పోర్ట్ లేకపోవడంతో వాటన్నిటినీ వదులుకోవాల్సి వచ్చింది. 2010లో సొంతంగా ఒక డ్యాన్స్ స్కూల్ ఏర్పాటు చేశాను. మరోవైపు వివిధ పాఠశాలల్లో డ్యాన్స్‌టీచర్‌గా ఉన్నాను. ఏడేళ్ళుగా పలువురు పిల్లలకు ఉచిత శిక్షణ అందిస్తున్నాను.

అదే మా కల...

భర్త, ఒక కుమారుడి బాధ్యతలు, నా ప్రదర్శనలు, బోధన... వీటన్నిటితో బిజీగా ఉన్న నాకు కొవిడ్ సమయం కావలసినంత తీరిక కల్పించింది. అప్పటివరకూ మా శరణార్థ శిబిరంలోని పిల్లలకు తరచుగా వివిధ రూపాల్లో సాయం చేస్తున్నా... పూర్తి స్థాయి ప్రణాళికతో ముందుకి సాగే అవకాశాన్ని అది కలిగించింది. వారిలో చాలామందికి ఎదగాలనే ఆశ ఉన్నా కాందిశీకులనే ముద్ర వెంటాడుతూనే ఉంది. శరణార్థులను అక్రమ చొరబాటుదారులుగా చూసే ధోరణి కూడా ఎక్కువ కావడంతో... సమాజంలో అవమానాలను, అసమానతలను ఎదుర్కోవాల్సి వస్తోంది. చక్కగా చదువుకోడానికి అవకాశం కల్పిస్తే వారిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. అందుకే నా ప్రదర్శనల ద్వారా వచ్చే డబ్బు, కొందరు స్పాన్సర్ల సహకారంతో... ప్రతిభ, ఆసక్తి ఉన్న పిల్లల చదువుకు సాయం చెయ్యడం ప్రారంభించాను. మొదట ఒకరు, తరువాత మరొకరు... ఇలా అనైయూర్ క్యాంప్ నుంచి 15 మందికి పైగా పిల్లలు ఉన్నత చదువుల్ని పూర్తి చేసి, ఉద్యోగాలు సంపాదించుకున్నారు. వారిలో ఒకరు సివిల్ ఇంజనీర్. ఒక అమ్మాయి అగ్రికల్చర్ బీఎస్సీ ఫైనలియర్‌లో చదువుతోంది. మరికొందరు పిల్లలు కూడా సాయం పొందుతున్నారు. ఒక బాలుడికి బోన్ మారో మార్పిడి అవసరం అయింది. నా అభ్యర్థన మేరకు మాజీ ఐఎఎస్ ఒకరు ముందుకొచ్చి, ఆ ఖర్చు భరించారు. ఆ ఆపరేషన్ విజయవంతమైంది. ఆ రోజు నేను పొందిన ఆనందాన్ని నా జీవితంలో ఎన్నడూ అనుభూతి చెందలేదు. ఇక, కొందరు వితంతువులకు కుట్టు మిషన్లు సమకూర్చి వారి జీవనోపాధికి దోహదం చేశాను. అలాగే... ఇతర అవసరాల్లో ఉన్నవారిని కూడా ఆదుకోవడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. వీలున్నంతవరకూ దీన్ని కొనసాగిస్తాను. ఎప్పుడో ఈ దేశానికి కాందిశీకులుగా వచ్చాం. మాకు భద్రతతో సహా ప్రతిదీ ఈ దేశం ఇచ్చింది. అందుకే భారతీయ పౌరులుగా మరణించాలనేది మా కల. పరిస్థితులు క్రమంగా మారి, నా కుమారుడితో సహా తరువాతి తరం పిల్లలకైనా భారతీయ పౌరసత్వం లభించాలని, శరణార్థి శిబిరాల్లో కాకుండా హుందాతనంతో గౌరవంగా జీవించే అవకాశం దక్కాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను."

బిజినెస్

విజయవాడ ● బుధవారం 12 మార్చి 2025

ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా సంతకంతో కొత్త రూ.100, 200 నోట్ల జారీ

ముంబై: ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.100, 200 కరెన్సీ నోట్లు త్వరలో మార్కెట్లోకి విడుదల కానున్నాయి. కొత్త నోట్ల డిజైన్ ఇప్పటికే మార్కెట్లో అందుబాటులో ఉన్న మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లోని రూ.100, 200 నోట్లను అన్ని విధాలుగా పోలి ఉంటాయని ఆర్‌బీఐ మంగళవారం వెల్లడించింది. అంతేకాదు, ప్రస్తుతం మార్కెట్లో చలామణి అవుతున్న రూ.100, 200 నోట్లు యథావిధిగా చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది.

క్రీమ్‌లైన్ డెయిరీలో పూర్తి వాటా

గోద్రెజ్ ఆగ్రోవెట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గోద్రెజ్ ఆగ్రోవెట్ డెయిరీ రంగంలో పట్టు పెంచుకుంటోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే క్రీమ్‌లైన్ డెయిరీ ఈక్విటీలో మిగిలిన 48.06 శాతం వాటాను ప్రమోటర్ల నంచి రూ.930 కోట్లకు కొనుగోలు చేసినట్టు తెలిపింది. ఈ డెయిరీ ఈక్విటీలో గోద్రెజ్ ఆగ్రోవెట్‌కు ఇప్పటికే 51.9 శాతం వాటా ఉంది. తాజా వాటా కొనుగోలుతో క్రీమ్‌లైన్ డెయిరీ ఈక్విటీలో 100 శాతం వాటా గోద్రెజ్ ఆగ్రోవెట్ పరమైంది. ఈ ఏడాది సెప్టెంబరుకల్లా ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది.

భారత్‌లో స్టార్‌లింక్ సేవలు..

● ఎయిర్‌టెల్‌తో స్పేస్‌ఎక్స్ జట్టు ● రిలయన్స్ జియోకు గట్టి పోటీ!!



న్యూఢిల్లీ: భారత్‌లోని తన కస్టమర్లకు స్టార్‌లింక్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు దేశీయ ప్రైవేట్ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ మంగళవారం ప్రకటించింది. అయితే, భారత్‌లో స్టార్‌లింక్ సేవలందించేందుకు స్పేస్‌ఎక్స్ లైసెన్సు పొందడంపై ఈ ఒప్పందం ఆధాపడి ఉంటుందని ఎయిర్‌టెల్ స్పష్టం చేసింది. స్టార్‌లింక్ సేవలకు అవసరమైన లైసెన్సు దరఖాస్తును భారత ప్రభుత్వం ఇంకా సమీక్షిస్తోంది. స్టార్‌లింక్ మాతృసంస్థే స్పేస్‌ఎక్స్. ప్రధాని మోదీ గత నెలలో అమెరికాలో పర్యటించిన సందర్భంగా మస్క్‌తోనూ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా స్పేస్, మొబిలిటీ, టెక్నాలజీ, ఆవిష్కరణలు తదితర అంశాలపై చర్చించారు. తర్వాత కొద్ది వారాలకే మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా, స్పేస్‌ఎక్స్ భారత్‌లోకి ప్రవేశించేందుకు వేగంగా పావులు కదుపుతుండటం గమనార్హం.

నీకు నేను.. నాకు నువ్వు

ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇరు సంస్థలు కలిసి స్టార్‌లింక్ సేవలు ఎయిర్‌టెల్ సర్వీసులకు ఏ విధంగా తోడ్పడతాయి..? భారత్‌లో స్పేస్‌ఎక్స్ నేరుగా సేవలందించేందుకు ఎయిర్‌టెల్ అనుభవం ఏ విధంగా దోహదపడుతుందని పరిశీలించనున్నాయి. భారత్‌లోని ఎయిర్‌టెల్ కస్టమర్లకు స్టార్‌లింక్ సేవలందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేయడం కీలక మైలురాయి అని, భవిష్యత్ తరం శాటిలైట్ సేవలందించే విషయంలో కంపెనీ నిబద్ధతకు ఇది నిదర్శనమని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ, వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ అన్నారు. దేశంలోని ప్రస్తుతం ఇంటర్నెట్ సౌకర్యం లేని అత్యంత మారుమూల ప్రాంతాల్లోనూ తమ కంపెనీ గరిష్ఠ వేగంతో కూడిన ఇంటర్నెట్ సేవలందించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడనుందన్నారు.

పరస్పర ప్రయోజనాలపై పరిశీలన

ఈ ఒప్పందంలో భాగంగా స్పేస్‌ఎక్స్, ఎయిర్‌టెల్ ద్వారా స్టార్‌లింక్ డివైజ్‌లతో పాటు సేవలను ఆఫర్ చేయనుంది. అలాగే, బిజినెస్ కస్టమర్లు, కమ్యూనిటీ సెంటర్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు తదితర వర్గాలతో అనుసంధానమయ్యే అవకాశాలను సైతం అన్వేషించనుంది. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను మరింత మెరుగుపర్చడంతోపాటు విస్తరించేందుకు స్టార్‌లింక్ ఏ విధంగా సాయపడగలదని ఇరు సంస్థలు అన్వేషించనున్నాయి.

జియో వర్సెస్ స్టార్‌లింక్

శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను వేలం వేయాలని భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో డిమాండ్ చేయగా.. స్టార్‌లింక్ సహా ఇతర అంతర్జాతీయ సంస్థలు నేరుగా కేటాయింపులు జరపాలని కోరాయి. కాగా, కేంద్రం మస్క్ కంపెనీకే సానుకూలంగా ప్రకటన చేసింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి అనుగుణంగా శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను నిర్దిష్ట దరకు నేరుగా కేటాయించడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. తాజా భాగస్వామ్యం ద్వారా స్టార్‌లింక్, ఎయిర్‌టెల్ కలిసి రిలయన్స్ జియోకు గట్టిపోటీనిచ్చేందుకు సిద్ధమవుతున్నట్లుగా కన్పిస్తున్నది. ఎయిర్‌టెల్, స్పేస్‌ఎక్స్ కలిసి చవకగా సేవలను ఆఫర్ చేయడం ద్వారా బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో జియో మార్కెట్ వాటాను కొల్లగొట్టేందుకు అవకాశాలున్నాయి.

యూపీఐ, రూపే కార్డు లావాదేవీలు ప్రియమవుతాయా?

మర్చంట్ చార్జీలను పునఃప్రవేశపెట్టే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), రూపే డెబిట్ కార్డు ద్వారా జరిపే లావాదేవీలపై మర్చంట్ చార్జీల (మర్చంట్ డిస్కౌంట్ రేట్-ఎండీఆర్)ను పునఃప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని సమాచారం. ప్రస్తుతం యూపీఐ, రూపే కార్డు లావాదేవీల ప్రాసెసింగ్‌పై బ్యాంకులకు మర్చంట్లు ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, చిన్న వ్యాపారులకు మర్చంట్ చార్జీల మినహాయింపును కొనసాగించినప్పటికీ, వార్షిక జీఎస్‌టీ టర్నోవర్ రూ.40 లక్షలకు మించిన వ్యాపారుల నుంచి ఎండీఆర్ వసూలు చేయాలని బ్యాంకింగ్ రంగం ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. ఎండీఆర్ చార్జీలను శ్రేణుల వారీగా ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. అంటే, బడా మర్చంట్ల నుంచి అధిక చార్జీ, చిన్న విక్రేతల నుంచి అత్యల్ప రుసుము వసూలు చేస్తే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఎండీఆర్ అంటే..?

సాధారణంగా మనం యూపీఐ లేదా కార్డు ద్వారా షాపుల్లో చెల్లింపులు జరుపుతాం. ఆ లావాదేవీని సంబంధిత బ్యాంక్ ప్రాసెసింగ్ చేశాకే మనం చెల్లించిన సొమ్ము విక్రేత ఖాతాలో జమవుతుంది. ఈ లావాదేవీని ప్రాసెస్ చేసేందుకు విక్రేత బ్యాంక్‌కు చెలించాల్సిన రుసుమునే మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అంటారు. ఆ మొత్తం లావాదేవీ విలువలో ఒక శాతం కంటే తక్కువే. అయితే, దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం యూపీఐ, రూపే కార్డులపై ఎండీఆర్‌ను 2022లో ఎత్తివేసింది. మాస్టర్, వీసా కార్డులు, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులపై ఇప్పటికీ విక్రేతలు ఎండీఆర్ చెల్లించాల్సి ఉంటుంది.

వినియోగదారులపై భారం పడుతుందా..?

ఎండీఆర్ విక్రేతల నుంచి బ్యాంకులు వసూలు చేసే రుసుము. అది కూడా బడా మర్చంట్ల నుంచి మాత్రమే. కాబట్టి, యూపీఐ ద్వారా చెల్లింపులు జరిపే వినియోగదారులపై, చిన్న విక్రేతలపై ఎలాంటి ప్రభావం ఉండదని ఇండస్ట్రీ వర్గాలన్నాయి.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ అకౌంటింగ్‌లో తేడాలు

రూ.2,100 కోట్ల నెట్‌వర్త్ హాంఫట్

రూ.20,000 కోట్ల మార్కెట్ క్యాప్ ధమాల్

IndusInd Bank

న్యూఢిల్లీ: డెరివేటివ్స్ పోర్టుఫోలియో ఆస్తుల లెక్కింపులో తేడాలు ప్రైవేట్ రంగంలోని ఇండస్‌ఇండ్ బ్యాంక్‌ను కుదిపేస్తున్నాయి. ఈ తేడాతో 2024 డిసెంబరు నాటికి బ్యాంకు నికర ఆస్తుల విలువ 2.35 శాతం (సుమారు రూ.2,100 కోట్లు) తగ్గిపోయిందని రెగ్యులేటరీ సంస్థలకు బ్యాంక్ తెలిపింది. గత ఏడాది సెప్టెంబరు-అక్టోబరు మధ్య జరిగిన అంతర్గత ఆడిటింగ్‌లోనే ఈ లోపాన్ని గుర్తించినా సోమవారమే ఈ విషయాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కి తెలిపినట్టు బ్యాంక్ సీఈఓ, ఎండీ సుమంత్ కథ్‌పాలియా తెలిపారు. ఈ నష్టం ఏ మేరకు ఉంటుందనే స్పష్టత కోసం అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీని బ్యాంక్ ఆడిటర్‌గా నియమించింది. ఈ సంస్థ నివేదిక ఈ నెలాఖరు లేదా వచ్చే నెల ప్రారంభం కల్లా అందుతుందని కథ్‌పాలియా చెప్పారు.

భయపడొద్దు: మరోవైపు ఈ అకౌంటింగ్ లోపంపై వాటాదారులెవరూ గాభరా పడాల్సిన అవసరం లేదని ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రమోటర్ అశోక్ హిందూజా కోరారు. డిపాజిట్ల చెల్లింపులకూ ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. ఈ రూ.2,100 కోట్ల నష్టాన్ని భర్తీ చేసుకునే ఆర్థిక సామర్థ్యం తమకు ఉందని వాటాదారులకు, మదుపరులకు హామీ ఇచ్చారు. అవసరమైతే బ్యాంక్ ఈక్విటీలో తమ వాటా మరింత పెంచుకునేందుకూ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

షేరు ఢమాల్

మరోవైపు మంగళవారం కూడా ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు కుప్పకూలింది. బీఎస్ఈలో ఇంట్రాడేలో ఒక దశలో 28 శాతం వరకు నష్టపోయి రూ.649 కనిష్ఠ స్థాయిని తాకింది. చివరికి 27.17 శాతం నష్టంతో రూ.655.95 వద్ద ముగిసింది. 2020 నవంబరు తర్వాత ఇండస్‌ఇండ్ షేరు ఈ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. కాగా ఈ భారీ నష్టాలతో బ్యాంకు షేర్లలో మదుపు చేసిన మదుపరులు రూ.20,000 కోట్ల వరకు నష్టపోయారు.

ఆరంభ నష్టాల నుంచి రికవరీ

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో ఆరంభ నష్టాల నుంచి తేరుకున్నప్పటికీ, మిశ్రమంగా ముగిశాయి. ఒక దశలో 451 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 12.85 పాయింట్ల నష్టంతో 74,102.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మాత్రం 37.60 పాయింట్ల లాభంతో 22,497.90 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 14 రాణించగా.. మిగతా 16 నష్టపోయాయి.

- యమహా మోటార్ కంపెనీ సరికొత్త ఫీచర్లతో ఎఫ్‌జెడ్-ఎస్-ఎఫ్ఐ హైబ్రిడ్ బైక్ కొత్త మోడల్‌ను మార్కెట్లోకి తెచ్చింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.1.44 లక్షలు. దీనికి ఓబీడీ-2బీ ప్రమాణాలకు దీటైన 149 సీసీ బ్లూకోర్ ఇంజన్ అమర్చారు.
- కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా ఒంగోలులో కొత్త శాఖను ప్రారంభించింది. దీంతో పాటు బెంగళూరు, తమిళనాడులోని బగాయంలో ఒక్కో శాఖను ఏర్పాటు చేసింది. దీంతో బ్యాంక్ మొత్తంశాఖల సంఖ్య 880కి చేరింది.
- యాక్సిస్ ఎంఎఫ్.. నిఫ్టీ 500 వాల్యూ 50 ఈటీఎఫ్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ముగింపు తేదీ ఈ నెల 12.

‘టెంప్లెట్ మోడల్’లో కొత్త విమానాశ్రయాలు

పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో నానాటికీ పెరిగిపోతున్న విమాన ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు మరిన్ని విమానాశ్రయాలు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నంలో భాగంగా కొత్త విమానాశ్రయాలు అందుబాటులోకి తెచ్చేందుకు "టెంప్లెట్ మోడల్" అనుసరించాలనుకుంటున్నట్టు పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు చెప్పారు. టెంప్లెట్ మోడల్‌లో ప్రయాణికులు, సరుకు రవాణా, విమానయాన శిక్షణ సంస్థలు సహా విభిన్న అవసరాలకు వేర్వేరు విమానాశ్రయాలుంటాయి. దీని వల్ల ప్రయాణికులు రాకపోకలు సాగించే విమానాశ్రయాలపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతున్న విమానయాన మార్కెట్లలో ఒకటైన మన దేశంలో ప్రస్తుతం 159 విమానాశ్రయాలున్నాయి. 200 శిక్షణ విమానాల సరఫరాకు ఎంఓయూపై సంతకాలు చేసే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ విమానయాన సంస్థలు ఇప్పటికే 1,700 విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని చెప్పారు. దీన్ని బట్టి రాబోయే 15-20 సంవత్సరాల కాలంలో మన దేశానికి 30 వేల మంది పైలట్లు అవసరమని మంత్రి తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఆరు వేల నుంచి ఏడు వేల మధ్యలో పైలట్లున్నారని ఆయన చెప్పారు.

150 శిక్షణ విమానాలు తయారుచేయనున్న ‘శక్తి’: దేశీయంగా విమానాల తయారీకి ఉత్తేజం కల్పిస్తూ శక్తి ఎయిర్‌క్రాఫ్ట్ పరిశ్రమ 150 శిక్షణ విమానాలను నిర్మించనుంది. తమిళనాడుకు చెందిన శక్తి గ్రూప్, ఆస్ట్రియాకు చెందిన డైమండ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల మధ్య జాయింట్ వెంచర్ ఇది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	410
చిత్తూరు	443	విశాఖపట్నం	415

డజను గుడ్లు రూ. 66

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	73	విజయవాడ	95
వరంగల్	73	గుంటూరు	90
కరీంనగర్	73	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	73	చిత్తూరు	77
కర్నూలు	73	నెల్లూరు	82
విశాఖపట్నం	89	అనంతపురం	82
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,490 ▼	80,200 ▼	1,07,000 ▼
విజయవాడ	88,500 ▼	83,400 ▼	99,300 ▼
విశాఖపట్నం	86,250 ▲	79,060 ▲	97,540 ▼
రాజమండ్రి	87,490 ▼	80,200 ▼	99,500 ▲
ప్రొద్దుటూరు	87,600 ▼	81,120 ▼	97,800 ▼
ముంబై	86,024 ▼	78,798 ▲	96,626 ▼

స్పోర్ట్స్


నిరాశపరచిన షట్లర్లు

బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో గాయత్రీ గోపీచంద్ జోడీ మినహా భారత అగ్రశ్రేణి క్రీడాకారులందరూ టాప్-10లో చోటు కోల్పోయారు. మంగళవారం బీడబ్ల్యూఎఫ్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో లక్ష్యసేన్ ఐదు స్థానాలు దిగజారి 15వ ర్యాంక్‌కు, ప్రణయ్ 29వ ర్యాంక్‌కు పడిపోయారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 15 నుంచి 16వ ర్యాంక్‌కు దిగొచ్చింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి 2021 తర్వాత తొలిసారి టాప్- 10లో స్థానం కోల్పోయి 7 నుంచి 12వ ర్యాంక్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి-త్రీసా జంట నిలకడగా తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జోడీ కెరీర్‌లో తొలిసారిగా 20వ ర్యాంక్ సాధించి, టాప్-20లోకి ప్రవేశించింది.

రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం ఎత్తివేత

ఊపిరిపీల్చుకొన్న రెజ్లర్లు



సంజయ్ సింగ్

న్యూఢిల్లీ: కొన్ని నెలలుగా అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న రెజ్లర్లకు శుభవార్త. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై విధించిన నిషేధాన్ని క్రీడా మంత్రిత్వ శాఖ ఎత్తివేసింది. దీంతో జోర్డాన్‌లోని అమ్మాన్ వేదికగా జరగనున్న ఆసియా చాంపియన్‌షిప్ సెలెక్షన్ ట్రయల్స్ సహా సమాఖ్య తమ కార్యకలాపాలను యథావిధిగా కొనసాగించేందుకు మార్గం సుగమం అయింది. ఈ ట్రయల్స్‌ను ఈనెల 15న నిర్వహించనున్నారు. అలాగే ప్రస్తుత అధ్యక్షుడు, బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అనుచరుడు అయిన సంజయ్ సింగ్ నియంత్రణలోకి సమాఖ్య వచ్చేసినట్టయింది. స్పోర్ట్స్ కోడ్ ఉల్లంఘన కారణంగా 2023, డిసెంబరు 24న సంజయ్ సింగ్ అధ్యక్షతన ఏర్పడిన డబ్ల్యూఎఫ్ఐ కార్యవర్గంపై క్రీడాశాఖ సస్పెన్షన్ విధించింది. రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ హవాసాగే గోండాలోనే అండర్-15, అండర్-20 జాతీయ చాంపియన్‌షిప్స్‌ను ఏర్పాటు చేయాలనుకోవడం కూడా ప్రభుత్వాగ్రహానికి కారణమైంది. రెజ్లర్ల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్టు క్రీడాశాఖ ప్రకటించింది. సమాఖ్య కార్యాలయాన్ని బ్రిజ్‌భూషణ్ ఇంటి నుంచి ఢిల్లీకి తరలించినట్టు దర్యాప్తులో తేలిందని తెలిపింది. ప్రభుత్వ నిర్ణయంపై అధ్యక్షుడు సంజయ్ సింగ్ సంతోషం వ్యక్తం చేశాడు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకొంటామన్నాడు. సమాఖ్యపై నిషేధం ఎత్తివేయకపోతే రెజ్లర్లకు అన్యాయం చేసినట్టేనని క్రీడామంత్రి మన్‌సుఖ్ మాండవ్య అన్నారు. కాగా, ప్రభుత్వ నిర్ణయంతో క్రుటదారులు మట్టికరిచారని బ్రిజ్‌భూషణ్ చెప్పాడు.

ప్రీక్వార్టర్స్‌కు లక్ష్య సేన్, మాళవిక



లక్ష్య సేన్

ప్రణయ్ ఇంటిదారి ● ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్



మాళవిక

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్ లక్ష్య సేన్, మాళవిక బన్సోడ్ ముందంజ వేయగా.. హెచ్ఎస్ ప్రణయ్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో లక్ష్య సేన్ 13-21, 21-17, 21-15తో లి యంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు. తొలి గేమ్‌లో ఓడినా.. సేన్ బలంగా పుంజుకొని మిగతా రెండు గేమ్‌లో నెగ్గాడు. రెండో రౌండ్‌లో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో సేన్ తలపడనున్నాడు. కాగా, హెచ్ఎస్ ప్రణయ్ 19-21, 16-21తో టోమా జూనియర్ పోపోవ్ (ఫ్రాన్స్) చేతిలో వరుస గేముల్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్ 21-13, 10-21, 21-17తో యో జి మిన్ (సింగపూర్)పై గెలిచి రెండో రౌండ్‌కు చేరుకొంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీష్ కుమార్-ఆద్య వరియత్ జంట 6-21, 15-21తో చైనాకు చెందిన గు జిన్ వ-చెన్ ఫాంగ్ హుయ్ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 20-22, 18-21తో చైనీస్ తైపీకి చెందిన షి పి షాన్-హంగ్ యన్ జు చేతిలో పోరాడి ఓడింది.

టాప్-5లో దీప్తి శర్మ



దుబాయ్: ఐసీసీ మహిళల వన్డే క్రికెట్ ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన దీప్తి శర్మ ఐదో స్థానానికి ఎగబాకింది. ఈక్రమంలో తను అమేలియా కెర్ (న్యూజిలాండ్)ను అధిగమించడం విశేషం. తాజా జాబితాలో ఆసీస్ క్రికెటర్ ఆష్లే గార్డ్‌నర్ టాప్‌లో ఉంది. ఇక టీ20 ఆల్‌రౌండర్లలో దీప్తి మూడో ర్యాంకులోనే కొనసాగుతోంది. అలాగే వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి స్మృతి మంధాన (2) మాత్రమే టాప్-10లో చోటు దక్కించుకుంది.

ఆర్‌సీబీకి ఓదార్పు

● రాణించిన మంధాన ● ముంబైపై విజయం ● డబ్ల్యూపీఎల్



మంధాన (53)

ముంబై: గెలిస్తే ఫైనల్లో చోటు లభించే కీలక మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ తడబడింది. అటు వరుసగా ఐదు ఓటములతో ఇప్పటికే డబ్ల్యూపీఎల్ నుంచి వైదొలిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఉత్కంఠ పోరులో హర్మన్‌ప్రీత్ సేనకు షాకిచ్చింది. మంగళవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 11 రన్స్ తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసింది. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ చెలరేగడంతో ఆర్‌సీబీ భారీ స్కోరందుకుంది. ముఖ్యంగా ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న ఓపెనర్ స్మృతి మంధాన (53)తో పాటు ఎలిస్ పెర్రీ (49 నాటౌట్), రిచా (36) రాణించారు. ఓపెనర్ సబ్బినేని మేఘన (26)తో కలిసి మంధాన తొలి వికెట్‌కు 41, ఆ తర్వాత ఎలిస్‌తో రెండో వికెట్‌కు 59 పరుగులు జత చేసింది. చివర్లో వేర్‌హామ్ (10 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 31 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్ జట్టు విజయంలో కీలకమైంది. మరో ఎండ్‌లో ఎలిస్ కూడా ధాటిని చూపగా ఆఖరి నాలుగు ఓవర్లలో ఆర్‌సీబీ 65 పరుగులు రాబట్టింది.

బ్రంట్ పోరాటం: అనంతరం భారీ ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 188 పరుగులు చేసి ఓడింది. వీరి ఇన్నింగ్స్‌లో నాట్ సివర్ బ్రంట్ (69) ఆరంభంలో పోరాడగా, చివర్లో సజన (23) ఆర్‌సీబీని వణికించినా ఫలితం లేకపోయింది. హర్మన్ (20), మాథ్యూస్ (19) విఫలమయ్యారు. ఆఖరి ఓవర్‌లో 28 పరుగులు కావాల్సిన వేళ సజన వరుస సిక్సర్లతో హడలగొట్టి ఐదో బంతికి వెనుదిరిగింది. స్నేహ్ రాణాకు మూడు.. గార్త్, పెర్రీలకు రెండేసి వికెట్లు దక్కాయి.

ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్

ఆర్‌సీబీ చేతిలో ముంబై ఓడిపోవడంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ప్రవేశించింది. వాస్తవానికి ఢిల్లీ-ముంబై ఖాతాలో పది పాయింట్లే ఉన్నా రన్‌రేట్ మెరుగ్గా ఉండడం ఢిల్లీకి వరంగా మారింది. అటు గురువారం జరిగే ఎలిమినేటర్‌లో ముంబై-గుజరాత్ జట్లు తలపడతాయి. ఇందులో విజేత ఫైనల్‌కు వెళ్తుంది.

సంక్షిప్త స్కోర్లు: బెంగళూరు: 20 ఓవర్లలో 199/3 (మంధాన 53, పెర్రీ 49 నాటౌట్, రిచా ఘోష్ 36, వేర్‌హామ్ 31 నాటౌట్; హేలీ మాథ్యూస్ 2/37)
ముంబై: 20 ఓవర్లలో 188/9 (సివర్ 69, సజన 23, హర్మన్ 20; స్నేహ్ 3/26, గార్త్ 2/33, ఎలిస్ 2/53).

మూర్ఖుల మాటల్ని పట్టించుకోవద్దు: జావేద్ అక్తర్



న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ షమికి బాలీవుడ్ ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ మద్దతుగా నిలిచారు. అతిగా స్పందించే మూర్ఖుల మాటలను పట్టించుకోవద్దన్నారు. ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ మధ్యలో షమి ఎనర్జీ డ్రింక్ తాగాడు. దీంతో రంజాన్ నెలలో ఉపవాసం ఉండకుండా షమి పాపం చేశాడని అఖిల భారత ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వి విమర్శించారు. దీనిపై జావేద్ స్పందిస్తూ..‘షమి సాబ్.. దుబాయ్‌లోని క్రికెట్ మైదానంలో.. మండుటెండలో నీళ్లుతాగడాన్ని తప్పుబట్టే మూర్ఖుల మాటల్ని పట్టించుకోవద్దు. అద్భుత భారత జట్టులో నువ్వుకూడా ఒకడివైనందుకు గర్విస్తున్నా’ అని పోస్టు చేశారు.

ఈ జట్టూ ఫైనల్ చేరుతుంది..

భారత్-బి టీమ్‌ను ఎంపిక చేసిన వాన్

న్యూఢిల్లీ: భారత జట్టును విమర్శించడానికి ఎప్పుడూ కాచుకు కూర్చొనే ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్.. చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన తర్వాత రోహిత్ సేనపై ప్రశంసల జల్లు కురిపించాడు. యువ ఆటగాళ్లతో తాను ఎంపిక చేసిన భారత్-బి జట్టుకు కూడా చాంపియన్స్ ట్రోఫీ నెగ్గగల సామర్థ్యం ఉందని అన్నాడు.

వాన్ ఎంపిక చేసిన ‘బి’ జట్టు: యశస్వీ జైస్వాల్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్.

ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో లలితకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో విజయనగరం అమ్మాయి లలిత కాంస్య పతకం కొల్లగొట్టింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ పోటీల్లో మంగళవారం ముగిసిన టీ11 విభాగం 1500 మీటర్ల పరుగులో లలిత 5 నిమిషాల 39 సెకన్లలో రేసును ముగించి తృతీయ స్థానం సాధించింది. నేపాల్‌కు చెందిన విక్టోరియా స్వర్ణం కైవసం చేసుకోగా, భారత్‌కే చెందిన రాధా వెంకట్ రజతం దక్కించుకుంది.

స్వదేశానికి చాంపియన్లు



గిల్

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన భారత జట్టు క్రికెటర్లు ఒక్కొక్కరుగా స్వదేశానికి చేరుకుంటున్నారు. సోమవారం కోచ్ గౌతమ్ గంభీర్, పేసర్ హర్షిత్ రాణాతో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ తన కుటుంబసభ్యులతో ముంబైకి చేరుకున్నాడు. అయితే మరికొంత మంది ఆటగాళ్లు రెండు, మూడు రోజుల పాటు దుబాయ్‌లోనే సేద తీరనున్నారు. ఇక స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. భార్య అనుష్కతో కలిసి ఫైనల్ మ్యాచ్ ముగిసిన రోజు రాత్రే హోటల్ నుంచి వెళ్లిపోయాడు. ఈనెల 22 నుంచి ఐపీఎల్ ఆరంభం కానుండడంతో టీమిండియా ఆటగాళ్లకు విశ్రాంతి తీసుకునేందుకు బోర్డు అనుమతిచ్చింది. అందుకే ఈసారి విక్టరీ పరేడ్ కూడా నిర్వహించలేదు.

భారత్ దూరం.. లార్డ్స్‌కు నష్టం



లండన్: భారత క్రికెట్ జట్టు ప్రపంచంలో ఎక్కడ ఆడినా స్టేడియాలు కళకళలాడుతుంటాయి. ఇక ఐసీసీ టోర్నీలయితే చెప్పనక్కర్లేదు. టిక్కెట్లు ఎంత ఖరీదైనా హాట్‌కేకుల్లా అమ్ముడుపోతుంటాయి. తాజాగా చాంపియన్స్ ట్రోఫీలోనూ అదే జరిగింది. ఇక లండన్‌లో జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్స్ ఫైనల్‌కు కూడా టీమిండియా అర్హత సాధిస్తుందని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) గట్టి నమ్మకమే పెట్టుకుంది. అందుకే భారత అభిమానుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్న భావనతో ఫైనల్ టిక్కెట్ రేట్లను ఒక్కో దానిపై రూ.5 వేలకు పెంచింది. కానీ న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లపై సిరీస్‌లను ఓడడంతో భారత్ ఈసారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరలేకపోయింది. ఈ దెబ్బకు ఈసీబీ తమ టిక్కెట్ల రేట్లను తగ్గించి రూ.4000-11000 మధ్య ఖరారు చేయడంతో రూ.45 కోట్ల నష్టం వాటిల్లనుంది. ఇంతకుముందే పాత ధరకు కొన్నవారికి మిగిలిన డబ్బును రిఫండ్ చేయనున్నారు. లార్డ్స్ వేదికగా జూన్ 11-15 తేదీల్లో ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగుతుంది.

మరో రెండు రోజుల్లో ఉపాధి వేతనాలు!

- జనవరి నెలాఖరు నుంచి చెల్లించాల్సినవి విడుదల
- వారంలో మెటీరియల్ నిధులూ చెల్లింపు
- రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్రం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వేతన బకాయిలను మరో రెండు రోజుల్లో విడుదల చేయనున్నట్టు తెలిపింది. ఈ ఏడాది జనవరి నెలాఖరు నుంచి చేపట్టిన పనులకు వేతనాలను చెల్లించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఢిల్లీ వెళ్లి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు విజ్ఞప్తి చేయడంతో కేంద్రం స్పందించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వేతన బకాయిలు లేకుండా చెల్లింపులు సాఫీగా సాగాయి. అయితే కేంద్ర బడ్జెట్ రూపకల్పన సమయంలో నిధులు విడుదల చేయకపోవడంతో జనవరి నెలాఖరు నుంచి ఉపాధి కూలీలకు చెల్లింపులు నిలిచిపోయాయి. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంతో ఇప్పుడు వేతనాల విడుదలకు మార్గం సుగమమైంది. మరో రెండు రోజుల్లో కూలీలందరికీ వేతనాలు ఖాతాల్లో జమ అవుతాయని కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. మరో వారం రోజుల్లో ఉపాధి మెటీరియల్ బకాయిలు కూడా చెల్లిస్తామన్నారు. కేంద్రం నుంచి నిధులు విడుదలైన వెంటనే మెటీరియల్ నిధులు కూడా వెండర్స్ ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు.

జగన్ కక్షల నుంచి 386 మంది ఇంజనీర్లకు విముక్తి

- నీరు-చెట్టు పనుల్లో క్రమశిక్షణ చర్యలు ఉపసంహరణ
- జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ ఉత్తర్వులు

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నీరు-చెట్టు పథకం కింద పనులు చేసినందుకు కక్షగట్టి నాటి జగన్ ప్రభుత్వం చేసిన విజిలెన్స్ విచారణలు, వేధింపులు, క్రమశిక్షణ చర్యల నుంచి 386 మంది జలవనరుల శాఖ ఇంజనీర్లకు విముక్తి లభించింది. వారిపై క్రమశిక్షణ చర్యలను నిలిపివేస్తూ ఆ శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులపై 386 మంది ఇంజనీరింగ్ అధికారులతో పాటు జల వనరుల శాఖ, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖల ఇంజనీర్లు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు కూడా స్వాగతించారు.

వారికి కారుణ్య నియామకం వర్తిస్తుందా?

- ఆదాయ పన్ను కట్టే కుటుంబానికి అర్హత ఉంటుందా?
- ప్రభుత్వానికి విద్యుత్ పంపిణీ సంస్థ లేఖ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులు సర్వీసులో మరణిస్తే భార్యకు పింఛను, వారసుల్లో అర్హులైన వారిలో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నారు. అయితే, ఆర్థికంగా బాగా వెనుకబడిన కుటుంబాలకు మాత్రమే కారుణ్య నియామకాలను వర్తింపజేయాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో.. తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సీఎండీ పృథ్వీతేజ్ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. "భార్య ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే, వారసుల్లో ఒకరికి కారుణ్య నియామకాలు చేపట్టవచ్చునా లేదా స్పష్టత ఇవ్వండి" అని ఆ లేఖలో కోరారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ఉటంకించారు .ఇదే విషయం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి కూడా వివరించారు.

జీఎస్టీ అదనపు కమిషనర్‌గా సౌమ్య



విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీఎస్టీ అదనపు కమిషనర్‌గా నూతలపాటి సౌమ్య నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. సౌమ్య 2011 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారిణి. రాష్ట్రంలో బాధ్యతలు స్వీకరించిన తేదీ నాటి నుంచి మూడేళ్లపాటు ఆమె డిప్యుటేషన్‌పై పనిచేయనున్నారు. సౌమ్య ప్రస్తుతం గుంటూరులోని కస్టమ్స్ అండ్ జీఎస్టీ అప్పీల్స్ కమిషనరేట్‌లో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు విజయవాడలోని కస్టమ్స్ అదనపు కమిషనర్‌గా పనిచేశారు.

చక్రాల కింద నలిగిపోయారు!

- రెండు బైకులను ఢీకొట్టి ఐదుగురిని చిదిమేసిన కర్ణాటక ఆర్టీసీ బస్సు
- వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తుండగా కర్నూలు జిల్లాలో ఘటన
- మృతుల్లో ఏపీకి చెందిన గర్భిణి, ఆమె భర్త
- కర్ణాటకకు చెందిన దంపతులతోపాటు కుమారుడు
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమన్న పోలీసులు



ఘటనా స్థలం నుంచి మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



ఆదిలక్ష్మి, ఈరన్న (ఫైల్)

ఆదోని రూరల్/కర్నూలు, రాయచూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం ద్విచక్రవాహనాలపై ఆస్పత్రులకు వెళ్తున్నవారిపై కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు దూసుకెళ్లి ఐదు నిండు ప్రాణాలను బలితీసుకుంది. కర్నూలు జిల్లా ఆదోని మండలం పాండవగల్లు గ్రామం వద్ద మంగళవారం చోటు చేసుకుందీ ఘోరం. కర్నూలు జిల్లా కుప్పగల్లు గ్రామానికి చెందిన దంపతులు కురువ పూజారి ఈరన్న (25), పూజారి ఆదిలక్ష్మి (23)లకు వ్యవసాయమే జీవనాధారం. వీరికి సుస్మిత అనే మూడేళ్ల కుమార్తె ఉంది. ప్రస్తుతం ఆదిలక్ష్మి మూడు నెలల గర్భిణి. నెలవారీ వైద్య పరీక్షల కోసం మంగళవారం ఉదయం ఆదోని ఆస్పత్రికి బైక్‌పై బయలుదేరారు. అదే క్రమంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి పట్టణంలో అగ్రిమాపక శాఖ హోంగార్డుగా పని చేస్తున్న హేమాద్రి (40) చర్మసంబంధిత వ్యాధికి ఆదోని మండలం ఇస్వి గ్రామంలో ఇచ్చే నాటు వైద్యం కోసం భార్య నాగరత్న (35), కుమారుడు దేవరాజు (20)తో కలిసి బైక్‌పై వస్తున్నారు. వీరంతా మరో 20 నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకుంటారనగా, పెద్దతుంబలం-కౌతాళం మధ్య జాలిమంచి క్రాస్ రోడ్డు వద్ద, ఆదోని నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు(కేఏ 37 ఎఫ్ 0711) ఢీకొంది. దీంతో వేర్వేరు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ఐదుగురూ బస్సు చక్రాల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందారు. హేమాద్రి, నాగరత్న, దేవరాజు మృతదేహాలు రోడ్డుపక్కనే చెల్లాచెదురుగా పడిపోగా.. ఈరన్న, ఆదిలక్ష్మి మృతదేహాలు బస్సు చక్రాల కింద నలిగిపోయాయి. ఆ సమయంలో బస్సులో 14 మంది ప్రయాణికులు ఉన్నారు. గంగావతికి చెందిన బస్సు డ్రైవర్ మహ్మద్‌సాబ్‌లాతి పారిపోయాడు. ఆదోని డీఎస్పీ హేమలత సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐదుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అతివేగంతో పాటు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా పోలీసులు తెలిపారు.

ప్రమాద స్థలంలో రహదారి వాలుగా (యూటర్న్) ఉంది. అక్కడ బస్సు వేగాన్ని ఏమాత్రం తగ్గించకుండా వెళ్లడం.. పైకి ఎక్కేచోట బైకులు ఎదురు రావడంతో బస్సును డ్రైవర్ అదుపుచేయలేక ఢీకొట్టినట్లు తెలిసింది.

విచారం వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్

బస్సు ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీడీపీ కార్యకర్తలైన రైతు దంపతుల ఈరన్న, ఆదిలక్ష్మి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనలో మృతి చెందిన కర్ణాటక వాసులకు సంబంధించి అవసరమైన సహాయసహకారాలు అందించాలని టీడీపీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడుకు ఫోన్ చేసి సూచించారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆదోని ఆస్పత్రికి వెళ్లి పూజారి ఈరన్న, ఆదిలక్ష్మి మృతదేహాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కర్ణాటక మృతుల కుటుంబాలవారితో మాట్లాడారు.

లడ్డూ తయారీకి సకాలంలో అందని నెయ్యి!

- కొత్త పరికరాలతో ల్యాబ్ పరీక్షలకు అధిక సమయం
- ఇబ్బంది పడుతున్న టీటీడీ!



తిరుమల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నెయ్యి వినియోగం, నాణ్యత పరీక్షల అంశంలో టీటీడీ పరిస్థితి కాస్త ఇబ్బందిగా మారింది. ఇటీవల ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన నూతన పరికరాలతో పరీక్షకు ఎక్కువ సమయం పడుతుండటంతో, ప్రసాదాల తయారీకి సకాలంలో నెయ్యి అందించలేకపోతోంది. శ్రీవారి అన్నప్రసాదాలతో పాటు లడ్డూప్రసాదాల తయారీ కోసం టీటీడీ ప్రతిరోజూ 12 వేల నుంచి 14 వేల కేజీల నెయ్యిని వినియోగిస్తోంది. గతంలో తిరుమలలోని ల్యాబ్‌లో నెయ్యి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు సరైన పరికరాలు లేకపోవడంతో కల్తీ జరిగిందంటూ టీటీడీలో తీవ్రస్థాయిలో కలకలం రేపిన విషయం తెలిసిందే. తిరుమల ల్యాబ్‌లోనే నెయ్యి నాణ్యతను వంద శాతం పరీక్షించే పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని టీటీడీ భావించింది. ఈ క్రమంలో దాదాపు రూ.70 లక్షల విలువైన గ్యాస్ క్రోమాటోగ్రాఫ్(జీసీ), హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రాఫ్ (హెచ్‌పీఎల్‌సీ)అనే రెండు పరికరాలను నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డు విరాళమిచ్చింది. వీటిని ఇటీవల తిరుమలలోని ల్యాబ్‌లో ఏర్పాటు చేసి పరీక్షలు చేయడం మొదలుపెట్టారు. అయితే టెండర్ సరఫరాదారుల నుంచి నెయ్యి సకాలంలో తిరుమలకు చేరుతున్నప్పటికీ పరీక్షించే సమయం అధికంగా పడుతున్న క్రమంలో ప్రసాదాల తయారీకి సకాలంలో నెయ్యి చేరడం లేదని సమాచారం. నూతన పరికరాలు కావడంతో సూక్ష్మస్థాయిలో పరీక్షించేందుకు అధిక సమయం పడుతున్నట్టు తెలిసింది. గత మూడురోజుల క్రితం మాత్రమే ఈ సమస్య తలెత్తిందని, నెయ్యి విషయంలో ఎలాంటి కొరత లేదని, ప్రస్తుతం టీటీడీ వద్ద దాదాపు 23 వేల కేజీల నెయ్యి సిద్ధంగా ఉందని టీటీడీ అధికారి ఒకరు వెల్లడించారు. ఎప్పటిలానే రోజుకు 3.5 లక్షల లడ్డూలను, అన్నప్రసాదాలను దిట్టం ప్రకారం తయారు చేస్తున్నామని తెలిపారు.

కల్తీ నెయ్యి కేసు ఏసీబీ కోర్టుకు బదిలీ చేయాలి

- పిటిషన్ దాఖలు చేసిన సిట్.. తీర్పు రిజర్వు

తిరుపతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసు విచారణను నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలంటూ సిట్ అధికారులు తిరుపతి 2వ ఏడీఎం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టీటీడీకి నెయ్యి సరఫరా టెండర్లు దక్కించుకున్న ఏఆర్ డెయిరీ నాణ్యత లేని నెయ్యిని సరఫరా చేసిందన్న ఆరోపణలపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రిమినల్ కేసుపై స్థానిక 2వ ఏడీఎం కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే మంగళవారం సిట్ అధికారులు ఈ కేసును నెల్లూరులోని ఏసీబీ కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ పిటిషన్ ఫైల్ చేశారు. నెయ్యి సరఫరా టెండర్ల వ్యవహారంలో నగదు అక్రమ లావాదేవీలు జరిగాయని, ఈ కారణంగా కేసు విచారణను అవినీతి కేసులు విచారించే ఏసీబీ కోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై సిట్ తరఫున, అలాగే నిందితుల తరఫు వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

ఖమ్మంలో అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- రెండు కార్లు, రూ.37లక్షల సొత్తు స్వాధీనం
- నిందితులు ఏపీ, తమిళనాడు వాసులు

వైరా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లో చోరీలు, దోపిడీలు, హత్యలకు పాల్పడుతున్న కరుడుగట్టిన నలుగురు నేరస్థుల ముఠా ఆటలకు ఖమ్మం పోలీసులు చెక్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఈ ముఠా సభ్యులను అరెస్టు చేసి రూ.37లక్షల విలువైన సొత్తును, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా వైరా పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ముఠా వివరాలను ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. నిందితులు సర్వే పేరుతో గత నెల 12న వైరా మునిసిపాలిటీలోని 9వ వార్డులోని ఓ ఇంట్లోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న వృద్ధురాలు శీలం వెంకట్రావమ్మ కాళ్లు, చేతులు కట్టేసి, నోటికి ప్లాస్టర్ చుట్టి ఆమె ఒంటిపై ఉన్న నగలతో పాటు బీరువాలోని బంగారు ఆభరణాలను దోచుకెళ్లారని కమిషనర్ తెలిపారు. అనంతరం వారు కర్ణాటకలోని చల్లాకేర్‌కు వెళ్లి అక్కడా దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. ఖమ్మంలోని దాచాపురం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో ఇద్దరు ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన రాయపాటి వెంకయ్య (అలియాస్ వెంకటేశ్, వెంకన్న) షేక్.నాగూల్‌మీరా కాగా, మరో ఇద్దరు తమిళనాడుకు చెందిన ముత్తురాజ్, విజయ్‌కుమార్ అని తెలిపారు. వీరు ఐదు రాష్ట్రాల్లో అనేక ఆర్థిక నేరాలకు, హత్యలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని చెప్పారు. వైరా, చల్లాకేర్ చోరీ కేసుల్లో నిందితులు కాజేసిన ఆభరణాలను, కారును స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

కుట్లు విప్పిన తెల్లారే పేగులు బయటకు..!

- మళ్లీ శస్త్రచికిత్స చేసిన వైద్యులు.. శ్రీకాకుళం జిల్లాలో ఘటన



చికిత్స పొందుతున్న మెండ పాపారావు

నరసన్నపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరిన ఓ వ్యక్తికి వైద్యులు శస్త్రచికిత్స చేశారు. పది రోజులు ఆస్పత్రిలోనే ఉంచాక, కుట్లు విప్పి ఇంటికి పంపించారు. ఆ మరుసటి రోజే శస్త్రచికిత్స చేసిన భాగం నుంచి పేగులు బయటకు రావడంతో మళ్లీ ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. నరసన్నపేట మండలం కోమర్తి గ్రామానికి చెందిన మెండ పాపారావు కడుపునొప్పితో బాధపడుతూ గత నెల 23న నరసన్నపేటలోని గొలివి ఆస్పత్రిలో చేరారు. వైద్య పరీక్షల అనంతరం పేగులకు చీము పట్టి రంధ్రాలు ఏర్పడ్డాయని గుర్తించిన వైద్యులు పాపారావుకు శస్త్రచికిత్స చేశారు. ఈ నెల 9న వైద్యులు కుట్లు విప్పి.. నడుముకు బెల్టు వేసి ఇంటికి పంపించేశారు. అయితే సోమవారం రాత్రి శస్త్ర చికిత్స చేసిన భాగం నుంచి పేగులు బయటకు రావడంతో కుటుంబ సభ్యులు మంగళవారం అదే ఆస్పత్రిలో చేర్పించారు. కుట్లు కలవలేదని గుర్తించిన డాక్టర్ గొలివి మోహనరావు... మళ్లీ ఆపరేషన్ చేసి వాటిని సరిచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహనరావు మాట్లాడుతూ.. పాపారావు ఆరోగ్యం నిలకడగా ఉందని, శస్త్రచికిత్స అనంతరం కొందరికి కుట్లు కలిసేందుకు నెల రోజులు పడుతుందని చెప్పారు. ముందస్తుగా బెల్టు వేయడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదని అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేక్షక హృదయాలను కొల్లగొడుతుంది



కిరణ్ అబ్బవరం

'క' సినిమాతో సూపర్‌హిట్ అందుకున్నారు కిరణ్ అబ్బవరం. ఆయన నటించిన తాజా చిత్రం 'దిల్‌రుబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి... సారెగమ సంస్థతో కలసి నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ మీడియాతో ముచ్చటించారు. "ఇందులో సిద్ధు అనే పాత్రలో కనిపిస్తా. నా పాత్రను విశ్వకరుణ్ చాలా కొత్తగా తీర్చిదిద్దారు. ఇదో న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతుంది. మహిళలను గౌరవించాలనే సందేశం అంతర్లీనంగా ఉంటుంది. దర్శకుడు సినిమాను నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ఎక్కడా బోర్ కొట్టదు. విజయంపై టీమ్ అంతా నమ్మకంతో ఉంది. మంచి సినిమా చూశామనే సంతృప్తితో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వస్తారు. సినిమాలో సిద్ధు ఏ సందర్భంలోనూ 'సారీ', 'థ్యాంక్స్' చెప్పడు. దానికి కారణం ఏమిటనేది ఆసక్తికరంగా ఉంటుంది. లవ్ ట్రాక్, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు.



రెండింతల వినోదం

నితిన్

'రాబిన్‌హుడ్' సినిమాలో దర్శకుడిగా వెంకీ కుడుముల విశ్వరూపం చూడబోతున్నాం. గతంలో మా ఇద్దరి కలయికలో వచ్చిన 'భీష్మ' చిత్రం కన్నా 'రాబిన్‌హుడ్'లో రెండింతల వినోదం ఉంది. పతాక సన్నివేశాలను చూసి ప్రేక్షకులు 'వావ్' అంటారు. ఈ చిత్రంతో మైత్రీ సంస్థ మరో విజయాన్ని అందుకోబోతోంది' అని హీరో నితిన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. వెంకీ కుడుముల మాట్లాడుతూ "రాబిన్‌హుడ్'తో బ్లాక్‌బస్టర్ కొట్టబోతున్నాం అనే నమ్మకం ఉంది. అతిథి పాత్రలో నటించిన డేవిడ్ వార్నర్‌కు ధన్యవాదాలు. మా నిర్మాతలు నవీన్, రవి ఖర్చుకు వెనకాడకుండా నిర్మించారు' అని చెప్పారు. వెంకీ గారి నుంచి ప్రేక్షకులు ఆశించే వినోదం ఈ చిత్రంలో ఉంది అని శ్రీలీల అన్నారు. అన్ని వాణిజ్య హంగులతో పాటు మంచి కథ ఉన్న చిత్రమిది అని నిర్మాత వై. రవిశంకర్ తెలిపారు.





ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిర్మాత దిల్‌రాజు, నటుడు మంచు మోహన్‌బాబు, ఆయన తనయుడు... మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు.

వందేళ్ల నాటి భవనానికి ఆధునిక హంగులు



సీనియర్ నటుడు, నిర్మాత, మాజీ ఎంపీ మురళీమోహన్ స్వగ్రామంలో గృహ ప్రవేశం చేశారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఆయన తాతగారు 1925లో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఇటీవల చాటపర్రు వచ్చిన మురళీమోహన్, తాతల నాటి ఇంటి జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో పునర్‌నిర్మాణం చేపట్టారు. పాత భవనం రూపురేఖలను మార్చకుండా.. మరో 50 ఏళ్ళు చెక్కు చెదరకుండా ఉండేలా కోట్లు వెచ్చించి కొత్త భవనాన్ని నిర్మించారు. కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు మాజీ ఎంపీ మాగంటిబాబు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

దృశ్యకావ్యంలా షణ్ముఖ



ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా తెరకెక్కిన చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తూ, తులసీరామ్ సాప్పని, రమేశ్ యాదవ్‌తో కలసి నిర్మించారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆది సాయికుమార్ మాట్లాడుతూ "ఆసక్తికరమైన కథతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని చెప్పారు. "ఇందులో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో ఆది కనిపిస్తాడు. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని కొత్త పాయింట్‌తో దృశ్యకావ్యంలా ఈ సినిమా ఉంటుంది" అని దర్శక నిర్మాత షణ్ముగం సాప్పని అన్నారు.

వెలుగు నింపే దీపం అవ్వాలి



వినోద్ నువ్వుల, మధుప్రియ జంటగా నటించిన చిత్రం 'ల్యాంప్'. ఈ నెల 14న విడుదలవుతోంది. రాజశేఖర్ రాజ్ దర్శకత్వంలో జీవీఎస్ శేఖర్‌రెడ్డి నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సీనియర్ నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ 'ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న చిత్రాలకు ఆదరణ లేక చీకటి అలుముకుంది. ఈ 'ల్యాంప్' ఆ చీకట్లు పోగొట్టి వెలుగు నింపే దీపం అవ్వాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ చిత్ర నిర్మాణంలో ఎన్నో కష్టాలు పడ్డామనీ, ఈ దీపం ఆరిపోయే పరిస్థితులు ఏర్పడినా జాగ్రత్తగా కాపాడుకుని రిలీజ్ వరకూ తీసుకువచ్చామని దర్శకుడు రాజశేఖర్ చెప్పారు. ఓ మంచి ప్రయత్నంగా 'ల్యాంప్' పేరు తెచ్చుకుంటుందనీ, కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో సినిమాను విడుదల చేస్తున్నామనీ నిర్మాత జీవీఎస్ రెడ్డి చెప్పారు.

యుగళ గీతం



తమిళ నటుడు చియాన్ విక్రమ్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'వీర ధీర సూరన్ పార్ట్ 2'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో రియా శిబు నిర్మించారు. ఎస్‌జే సూర్య, దుషార విజయన్ కీలక పాత్రలు పోషించారు. తాజాగా, ఈ చిత్రం నుంచి 'కలల్లో కానరాకున్నా.. నీకోసం నేను వేచి ఉన్నా' అంటూ సాగే యుగళ గీతాన్ని విడుదల చేశారు మేకర్స్. రాజేశ్ గోపిశెట్టి లిరిక్స్ అందించగా, శరత్ సంతోష్, రేష్మ, శ్యామ్ ఆలపించారు. జివి ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది.

దర్శకుడు శంకర్‌కు ఊరట


- ఈడీ దర్యాప్తుకు హైకోర్టు బ్రేక్



తమిళ దర్శకుడు ఎస్.శంకర్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు చెందిన రూ.10.11 కోట్ల విలువ చేసే ఆస్తులను జప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు మంగళవారం తాత్కాలిక స్టే విధించింది. శంకర్ దర్శకత్వంలో 'యందిరన్' చిత్రం రాగా, ఈ మూవీ వ్యవహారంలో శంకర్ కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ ఈ సినిమా కోసం తీసుకున్న పారితోషికం ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. అయితే, ఈడీ చర్యను సవాల్ చేస్తూ శంకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన ధర్మాసనం... శంకర్ ఆస్తులను జప్తు చేస్తూ ఈడీ జారీ చేసిన ఆదేశాలపై తాత్కాలిక స్టే విధించింది. ఈ వ్యవహారంలో ఈడీ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 21వ తేదీకి వాయిదా వేసింది.

చెన్నై, మార్చి 11 (ఆంధ్రజ్యోతి)

సాయికుమార్‌కు కొమరం భీమ్ జాతీయ పురస్కారం



నటుడిగా యాభై ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న సాయికుమార్‌కు 2024 సంవత్సరానికి గాను కొమరం భీమ్ జాతీయ పురస్కారం అందజేయనున్నట్లు సెలెక్షన్ కమిటీ చైర్మన్ సి.పార్థసారథి, కో చైర్మన్ నాగబాల సురేశ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. పన్నెండేళ్లుగా భారత కల్చరల్ అకాడమి, ఆదివాసి సాంస్కృతిక పరిషత్ సంయుక్త నిర్వహణలో ఈ అవార్డ్‌ను అందచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 23న కొమరం భీమ్ జిల్లా ఆసిఫాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సాయికుమార్‌కు అవార్డ్ అందజేస్తామని తెలియజేశారు.

కరక క్వారీపై నేతల కన్ను!?

- అటవీ అధికారుల నుంచి సమాచార సేకరణ
- రిజర్వు ఫారెస్టు నుంచి మినహాయింపు కోసం యత్నాలు
- డీనోటిఫైయింగ్ కోసం ఢిల్లీ స్థాయిలో కసరత్తు

విశాఖపట్నం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలోని కరక రిజర్వు ఫారెస్టులో గల రంగురాళ్ల క్వారీపై కూటమికి చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు కన్నేశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రంగురాళ్ల తవ్వాలంటే రిజర్వు ఫారెస్టు నుంచి కరక కొండను డీనోటిఫై చేయించాలి కనుక, అందుకోసం అమరావతి నుంచి ఢిల్లీ వరకూ పావులు కదుపుతున్నారనే ప్రచారం జరుగుతుండడమే ఇందుకు కారణం. కరక రిజర్వు ఫారెస్టు సుమారు మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. చుట్టూ కరక, దాసుపాలెం, రుత్తలపాలెం, పొగచెట్లపాలెం, జమ్మివరం గ్రామాలు ఉన్నాయి. వీటిలో కరక బ్లాక్ ఏరియాలో భారీగా రంగురాళ్ల నిక్షేపాలు ఉన్నాయి. ఇక్కడ మేలు జాతి రంగురాళ్లు ఉన్నాయని చెబుతుంటారు. సుమారు పుష్కరకాలం కిందట కరక, పరిసరాల్లో అటవీ సిబ్బంది సాయంతో స్థానిక నేతలు అనధికారికంగా పెద్దఎత్తున రంగురాళ్ల తవ్వకాలు చేపట్టారు. తర్వాత ప్రభుత్వం గట్టి నిఘా పెట్టడంతో వెనక్కితగ్గారు. వర్షాకాలంలో రాత్రి సమయాల్లో అడపాదడపా తవ్వకాలు చేపడుతున్నారు. అనకాపల్లి జిల్లాలో క్వారీయింగ్ అనుభవం ఉన్న ప్రజా ప్రతినిధి ఒకరు, మరో ప్రజా ప్రతినిధి కలిసి కరక కొండపై రంగురాళ్ల తవ్వకాలకు యత్నిస్తున్నట్లు సమాచారం. అయితే కరక కొండ రిజర్వు ఫారెస్ట్‌లో ఉన్నందున క్వారీయింగ్‌కు అనుమతి ఉండదు. అందుకు ఆ ప్రాంతాన్ని డీనోటిఫై చేయాల్సి ఉంటుంది. సర్కిల్, జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి చివరిగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి ఇవ్వడంతోపాటు డీనోటిఫై చేయాలి. ఒక ప్రాంతంలో రిజర్వు ఫారెస్టును డీనోటిఫై చేయాలంటే మరో ప్రాంతంలో అడవుల పెంపకం చేపట్టాలి. తవ్వకాల కోసం ప్రయత్నాలు మొదలెట్టిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు ఇప్పటికే అటవీ శాఖలో కిందిస్థాయి అధికారుల నుంచి కొంత సమాచారం సేకరించారని తెలిసింది.



అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలోని కరక కొండ ప్రాంతం



పిఠాపురంలోని చిత్రాడ వద్ద శుక్రవారం నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు మనోహర్, దుర్గేశ్

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్

- ఇప్పుడు ఫీజు పోరు అంటూ కొత్త నాటకం: మంత్రి మనోహర్

కాకినాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ ఇప్పుడు ఫీజు పోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపారని మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో విమర్శించారు. 'వైసీపీ చేపట్టే యువత పోరు అంతా బూటకమే. రాష్ట్రం సర్వనాశనం అవ్వడానికి జగన్ వైఖరే కారణం. అన్ని వ్యవస్థలనూ ధ్వంసం చేసిన జగన్‌కు సార్వత్రిక ఎన్నికల్లో యువత, మహిళలు, ప్రజలు బుద్ధి చెప్పారు. ఈ నెల 14న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో నిర్వహించే జనసేన ఆవిర్భావ సభకు లక్షలాది మంది జనసైనికులు హాజరవుతున్నారు' అని వివరించారు. 'ఆవిర్భావ సభలో పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తాం' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు.

ఉనికి కోసమే వైసీపీ యువత పోరు: నాదెండ్ల బ్రహ్మం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024లో జరిగిన ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిన జగన్ పిచ్చి పిచ్చిగా వ్యవహరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య పెరగడానికి కారణమైన వారే... ఇప్పుడు ఫీజు పోరు, యువత పోరు అంటూ డ్రామాలాడుతున్నారన్నారు. ఇవన్నీ వైసీపీ ఉనికిని కాపాడుకునేందుకు ఆడే డ్రామా అన్నారు.

భారత్ ఆత్మగౌరవాన్ని బీజేపీ తాకట్టు పెడుతోంది: నారాయణ

తిరుపతి(ఆటోనగర్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'భారత్ ఆత్మగౌరవాన్ని బీజేపీ ప్రభుత్వం అమెరికాకు తాకట్టు పెట్టే చర్యలు చేస్తోంది. ఫలితంగా దేశ ప్రజలపై భారం పెరిగే అవకాశం ఉంది' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. 'అసెంబ్లీలో ప్రతి పక్షహోదా ఇస్తేనే ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తామని మాజీ సీఎం జగన్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటి పెద్దలను వదలి పెడుతున్న అధికారులు, నాయకులు.. పేదలపై పెత్తనం చెలాయిస్తున్నారు' అని నారాయణ మండిపడ్డారు.

జనాభా పెరగాలి

ఎక్కువ మంది ఉంటే ఎక్కువ సంక్షేమం

- రాష్ట్రంలో జననాల రేటు 1.5 నుంచి 2.1కి చేరాలి
- ఎంతమంది పిల్లల్ని కన్నా ప్రసూతి సెలవులిస్తాం
- ఎస్ఆర్ఎం 10 వేల కుటుంబాలను దత్తత తీసుకోవాలి
- పాపులేషన్ డైనమిక్స్ సదస్సులో సీఎం



ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవలప్‌మెంట్ సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఎంత ఎక్కువ మంది ఉంటే అంత ఎక్కువ సంక్షేమం అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా నియంత్రణ అవసరమని చెప్పామని, కానీ ఇప్పుడు జనాభాను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ముఖ్యంగా దక్షిణ భారతంలో జననాల రేటు తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన 'పాపులేషన్ డైనమిక్స్ సదస్సు'లో ఆయన మాట్లాడారు. జనాభా తగ్గిపోతే చట్టసభల్లో మన సీట్లు కూడా తగ్గుతాయని, అయితే సీట్ల కంటే దేశమే ముఖ్యమని అన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుతోంది. కొన్ని దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణ భారతంలో అభివృద్ధి మెరుగ్గా ఉన్నా.. జననాల రేటు తగ్గిపోతోంది. జనాభా విషయంలో ఉత్తరప్రదేశ్, బిహార్ మనల్ని కాపాడుతున్నాయి. జపాన్, జర్మనీ దేశాలు జనాభా కావాలని అడుగుతున్నాయి. మన జనాభా పెరిగితే అన్ని దేశాల్లో భారతీయులు పెరుగుతారు. మరో 20 ఏళ్ల తర్వాత ఎక్కడికెళ్లినా భారతీయులే కనిపించే పరిస్థితి వస్తుంది. ఏపీలో జననాల రేటు 1.5గా ఉంటే మహారాష్ట్రలో 1.5, కేరళలో 1.4, తమిళనాడులో 1.4గా ఉంది. ఉత్తర భారతంలో ఈ రేటు మెరుగ్గా ఉంది. రాష్ట్రంలో జననాల రేటు 1.5 నుంచి 2.1కు పెరగాలి. రిటైరైన వారు కూడా ఉద్యోగాలు చేసే పరిస్థితి రావాలి. రోజంతా కాకపోయినా కనీసం మూడు నాలుగు గంటలు పనిచేస్తే ఉత్పాదకత పెరుగుతుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

సమాజంలో ట్రెండ్ మారాలి..

సమాజంలో ట్రెండ్ మారిందని, డబుల్ ఆదాయం కావాలి.. పిల్లలు వద్దు అనే పరిస్థితి కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. "జనాభా పెరుగుదలపై చర్చ జరగాలి. నేనే గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని బిల్లు తెచ్చాను. ఇటీవల దాన్ని రద్దు చేశాం. భవిష్యత్తులో ఇద్దరి కంటే ఎక్కువ ఉంటేనే స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులనే చట్టం రావాలి. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం పథకం అమలుచేస్తాం. గతంలో ప్రసూతి సెలవులు రెండు డెలివరీలకే ఉండేది. ఇప్పుడు ఎంతమంది పిల్లల్ని కన్నా సెలవులిస్తాం. ఒక ఇంట్లో గరిష్ఠంగా 25 కిలోల బియ్యం ఇవ్వాలనే నిబంధన కూడా మారుస్తాం" అన్నారు.

గ్లోబల్ లీడర్లు కావాలి

మీరంతా గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని విద్యార్థులనుద్దేశించి సీఎం చంద్రబాబు అన్నారు. "నేను మారుమూల ప్రాంతంలో పుట్టాను. మా ఊర్లో 30 ఇళ్లు కూడా లేవు. కానీ.. నిరంతరం జీవితాన్ని మార్చుకుంటూ వచ్చాను. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చాన్స్‌లర్ కూడా సాధారణ టీచర్ నుంచి యూనివర్సిటీ పెట్టే స్థాయికి ఎదిగారు. మీరు కూడా అలాగే ఉన్నత స్థానాలకు రావాలి. ఎప్పుడు నచ్చితే అప్పుడే చదవండి. కానీ చదివినప్పుడు ఏకాగ్రతతో చదవండి. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 10వేల కుటుంబాలను దత్తత తీసుకుని విద్యా, ఉపాధి పరంగా వారికి సహకారం అందించాలి" అని చంద్రబాబు సూచించారు.

నెలన్నరలో లక్ష కోట్ల పనులు ప్రారంభిస్తాం

రానున్న నెలన్నర రోజుల్లో అమరావతిలో రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేస్తామని సీఎం తెలిపారు. మూడేళ్లలో ఆ నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. 'గత ఐదేళ్లలో అమరావతిలో ఒక్క అంగుళం రోడ్డు కూడా నిర్మించలేదు. పైగా అంతకుముందు చేపట్టిన నిర్మాణాలను మధ్యలో వదిలేశారు. పేదరిక రహిత సమాజం లక్ష్యంగా ఉగాది రోజున పీ-4 విధానం ప్రారంభిస్తున్నాం. విద్యార్థులు ఉద్యోగాలకోసం చూసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి. గ్రామాల్లో ఉండి పనిచేసే ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం పాలసీ తీసుకొస్తున్నాం. గతంలో భార్యలు... భర్తలపై ఆధారపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. దేశంలో 80 శాతం మంది భార్యల జీతాలు భర్తల కంటే ఎక్కువగా ఉన్నాయి. అప్పట్లో మహిళలకు విద్యారంగంలో 33శాతం రిజర్వేషన్ తీసుకొచ్చాం. భవిష్యత్తులో అబ్బాయిలకే రిజర్వేషన్ ఇచ్చే పరిస్థితి వస్తుంది" అన్నారు. సదస్సులో ఎస్ఆర్ఎం వర్సిటీ చాన్స్‌లర్ టీఆర్ పారిందర్, ప్రెసిడెంట్ పి.సత్యనారాయణన్ పాల్గొన్నారు.

'ఆడుదాం..' అవినీతిపై ఏసీబీ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అవినీతికి తెర తీశారు. మంత్రి రోజా, శాప్ ఛైర్మన్ సిద్ధార్థరెడ్డి చెప్పిన వారికి వర్కర్ ఆర్డర్లు ఇవ్వడం, నచ్చిన వారికి ప్రాజెక్టులు ఇవ్వడం ద్వారా భారీగా వెనుకేసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. తొలుత రూ.50 కోట్లతో మొదలుపెట్టి అమాంతంగా దానిని రూ.119 కోట్లకు పెంచి 'దోచుకుందాం' ఆట మొదలుపెట్టారు. అయితే, మొత్తం ఎంత ఖర్చు ఎంతయింది ఎక్కడా లెక్కలు లేవు. దీనిపై చీకటి జీవోలు తెచ్చి వాటిని దాచేశారు. మొత్తం స్పోర్ట్స్ కిట్లు, యాప్, టీ - షర్టులు, బ్రోచర్లు, క్రీడల నిర్వహణ, రవాణా, ఫుడ్ అండ్ ప్రైజ్ మనీ, ముగింపు రోజు ఏర్పాట్లు.. ఇలా మొత్తం రూ.119 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. పేరుకు ఇది ప్రభుత్వ కార్యక్రమం. కానీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ చాలా క్రీడలు జగన్ పార్టీ అభిమానులు, కార్యకర్తలతోనే ఆడించారు. ఎక్కడ చూసినా జగన్ బొమ్మలు, కొన్ని చోట్ల వైసీపీ రంగులు... కొన్నిచోట్ల ఓడిపోయిన వారిని గెలిపించారనీ, గెలిచిన వారిని ఓడినట్టు ప్రకటించారన్న విమర్శలు వచ్చాయి. మరోవైపు నిజమైన క్రీడాకారులను పట్టించుకోలేదు. సరైన భోజన సదుపాయాలు కూడా కల్పించలేదు. క్రీడలకు కూడా రాజకీయ, కులం రంగులు అద్ది ప్రతిభకు పాతరేశారన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి.

ఆ అధికారులే కూటమిలోనూ కీలకం

స్పోర్ట్స్ కిట్ల కొనుగోలు ప్రక్రియను ఆర్అండ్‌బీకి అప్పగించారు. కిట్ల కోసం రూ.38.55 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పినా, అందులో దోచేసిందే ఎక్కువ. క్రీడాకారులకు నాసిరకం కిట్లు సరఫరా చేశారు. యాప్‌లు, ప్రచార నిర్వహణ పనులను అస్మదీయులకు అప్పగించి దాదాపు రూ.రెండు కోట్లు వారి జేబులో పెట్టారు. స్పోర్ట్స్ కిట్ల కొనుగోలులో కొంత మంది అధికారులు పాత్ర కూడా ఉన్నట్టు అప్పట్లో విమర్శలు వచ్చాయి. వారే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ కీలకమైన పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. రూ.34.20 కోట్లతో టీ -షర్టులు కొనుగోలు చేశారు. వాటిపై వైసీపీ జెండా రంగులు, జగన్ బొమ్మలు ముద్రించారు. బ్రోచర్ల పేరిట మరో రూ.3.43 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాల కలెక్టర్లకు దాదాపు రూ.40 కోట్లు విడుదల చేశారు. జిల్లాల్లో స్పోర్ట్స్ నిర్వహణకు రూ.21 కోట్లు, క్రీడాకారుల తరలింపుకు రూ.76 లక్షలు, వారికి ఆహారానికి రూ.4.26 కోట్లు, ప్రైజ్ మనీ కోసం దాదాపు రూ.12.21 కోట్లు ఖర్చు చేశామని చెప్పుకొన్నారు. ముగింపు కార్యక్రమానికి రూ.2.70 కోట్లు వెచ్చించినట్టు నిర్వాహకులు ప్రకటించారు.

ఆ ఐదేళ్లూ క్రీనీడలే..

రాష్ట్రంలో 2019 నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో అనేక మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. వారికి జీవోల ప్రకారం నగదు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉండగా, నిధులు లేవంటూ ఎగ్గొట్టారు. కీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడానికీ సుముఖత చూపలేదు. క్రీడా సంఘాలకు ఇవ్వాల్సిన గ్రాంట్లు, ఒలింపిక్ అసోసియేషన్‌కు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో పెట్టారు. 2023లో గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో మనవాళ్లు సత్తా చాటారు. ఏసీబీ దృష్టిసారిస్తే మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

వైసీపీ నేతల మద్యం దోపిడీ

- అక్రమాలపై సిట్ వేయగానే తాడేపల్లిలో ఫైళ్లు తగలబెట్టారు
- సీసీ టీవీ ఫుటేజ్ ఇవ్వమంటే ఇవ్వరు.. అచ్చెన్న, అనిత, రవీంద్ర ఫైర్
- ఏది అడిగితే అది ఇచ్చేస్తారా: బొత్స.. మండలిలో వాగ్యుద్ధం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాలు, అక్రమాలపై మంగళవారం శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం అమ్మకాల్లో ఆ పార్టీ నేతలు దోపిడీకి పాల్పడ్డారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. గత ప్రభుత్వంలో మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించిందని, అయితే సిట్ వేసిన రోజు సాయంత్రానికే తాడేపల్లిలో సంబంధిత ఫైళ్లను తగలబెట్టారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఐడీ విచారణ జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న మండలిలో విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ.. తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ఇంటి ముందు ఫైళ్లు తగులబెట్టారన్న వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని పట్టుబట్టారు. గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు జరిగితే విచారించి చర్యలు తీసుకోవచ్చన్నారు. ఇంట్లో ఏదో జరిగితే సీసీ టీవీ ఫుటేజ్ ఇవ్వమని అడిగితే ఇస్తారా? అని ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుని.. షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏదైనా ప్రమాదం జరిగితే సీసీ టీవీ ఫుటేజ్ తీసుకుంటారని, తాడేపల్లి ఘటనపై ఫుటేజ్ ఇవ్వాలని గుంటూరు ఎస్పీ మూడు నాలుగు సార్లు అడిగినా ఇవ్వలేదని పేర్కొన్నారు. బాధ్యతాయుత పదవిలో ఉన్నవారు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరైంది కాదని హోంమంత్రి అనిత అన్నారు. విచారణలో భాగంగా పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్ అడిగితే ఎవరైనా ఇవ్వాల్సిందేనన్నారు.

దుర్గగుడిలో సింహాలు మాయం ఇప్పటికీ అంతుపట్టని అంశమే: ఆనం

గతంలో దేవాలయాలపై జరిగిన దాడుల ఘటనలన్నింటిపైనా కమిటీ వేసి విచారించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు. జగన్ పాలనలో విజయవాడ దుర్గగుడిలో అమ్మవారి రథానికి సంబంధించి మాయమైన వెండి సింహాల వ్యవహారం ఇప్పటికీ అంతుపట్టని అంశంగా ఉందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ హయాంలో దేవాలయాలపై జరిగిన దాడులపై టీడీపీ సభ్యులు ప్రశ్నలు అడిగారు. ఆయా ప్రశ్నలకు స్పందించిన మంత్రి ఆనం.. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా హిందూ ఆలయాలపై 228 దాడులు జరిగినట్టు అప్పటి డీజీపీ గౌతం సవాంగ్ చెప్పారని తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి విచారణ నివేదికలు పంపాలని హోంశాఖను కోరామన్నారు.

బాలికల జోలికొస్తే జైలే

- లైంగిక నేరాల్లో ఆర్నెల్లలో నలుగురికి కఠిన శిక్షలు: డీజీపీ గుప్తా

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడితే జీవితం జైలు పాలేనని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. రాష్ట్రంలో గడచిన ఆర్నెల్లలో జరిగిన నాలుగు అత్యాచారాల కేసుల్లో పోలీసులు సమర్థవంతంగా చేసిన దర్యాప్తు వల్ల రేపిస్టులకు ఐదేళ్ల నుంచి పాతికేళ్ల వరకూ శిక్షలు పడ్డాయని తెలిపారు. విజయనగరం జిల్లా రామభద్రపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఐదు నెలల పసికందుపై అత్యాచారానికి పాల్పడిన సమీప బంధువు ఎరుకన్న దొర(40)కు 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించిందన్నారు. విశాఖలోని గంట్యాడ పోలీసు స్టేషన్ పరిధిలో మూడున్నరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసిన 31 ఏళ్ల విసినిగిరి రవికి కేవలం 134రోజుల్లో పోక్సో కోర్టు 25ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించిందని చెప్పారు. విజయగనరం జిల్లా పూసపాటిరేగ పోలీసు స్టేషన్ పరిధిలో ఐదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన మైనపు హరీశ్(19)కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష పడిందని పోలీస్ బాస్ తెలిపారు. విజయనగరంలో ఏడేళ్ల బాలికపై 55 ఏళ్ల ఆటోడ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బంది పెట్టడంతో ఐదేళ్లపాటు జైలుపాలయ్యాడని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతపై సమీక్షించిన పోలీస్ బాస్.. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో 'ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్' ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆపదలో ఉన్న మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 181, 112, 1098, 1093కి ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే పోలీసులు రక్షిస్తారని భరోసా ఇచ్చారు. వేధింపులు, నేరాల కట్టడి కోసమే శక్తి టీమ్స్ పని చేస్తున్నాయన్న డీజీపీ అబలలు, బాలికల భద్రత కోసం 'శక్తి' యాప్ అందుబాటులోకి తెచ్చామని అన్నారు.

తప్పు చేస్తే తాట తీస్తాం

(మొదటి పేజీ తరువాయి)

> 'తప్పు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరు. తప్పు చేసేవారి తాట తీస్తాం. గత వైసీపీ ప్రభుత్వం 'దిశ' పేరుతో దిక్కుమాలిన యాప్‌ను తీసుకొచ్చింది. దానివల్ల ఉపయోగం ఉండేది కాదు. కానీ ఇప్పుడు 'శక్తి' యాప్ ద్వారా వంద శాతం యాక్షన్ ఉంటుంది. సంతోషకరమైన విషయమేమిటంటే.. గత ఐదేళ్లూ శాసనసభలో బూతులే విన్నాం. ఇప్పుడు ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయి.'
>
> - అసెంబ్లీలో సీఎం చంద్రబాబు

సంతోషంగా జీవించాలంటే శాంతిభద్రతలను కాపాడటం చాలా ముఖ్యమని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, తప్పు చేసినవారి తీట తీస్తామని సీఎం హెచ్చరించారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరిరోజు అవుతుందని స్పష్టం చేశారు. 'వైసీపీ ప్రభుత్వంలో నేను, మీరు, అందరమూ బాధితులమే. డ్రగ్స్, గంజాయి వినియోగం విపరీతంగా పెరిగింది. బాధ్యత గల ప్రతిపక్షంగా ఆందోళన చేస్తే.. తిరిగి టీడీపీ కార్యాలయంపై దాడి చేశారు. ఇంత దుర్మార్గాన్ని నా రాజకీయ జీవితంలో చూడలేదు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనా ఉంది. రాజకీయాల ముసుగులో నేరాలు, ఘోరాలకు పాల్పడతామంటే ఈ ప్రభుత్వంలో సాగదు. శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉదాసీనంగా వ్యవహరిస్తే పోలీసుల పట్ల కూడా కఠినంగా వ్యవహరిస్తాం' అన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

ప్రజలు కూడా సహకరించాలి

రాష్ట్రంలో గంజాయి సాగు చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు. డ్రోన్ పెట్రోలింగ్‌తో గంజాయి సాగును గుర్తిస్తాం. ఒక్క ఎకరాలో కూడా గంజాయి పండించడానికి వీల్లేదు. వ్యాపారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి గంజాయి పండించే అమాయకులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం. తల్లిదండ్రులు కూడా గంజాయికి అలవాటుడిన తమ పిల్లల్ని జాగ్రత్తగా కంట్రోల్ చేయాలి. గత ప్రభుత్వం రాష్ట్రంలో గంజాయిపై కనీసం ఒక్కసారైనా సమీక్ష చేసిన పాపాన పోలేదు. అసెంబ్లీలో కూడా చర్చించలేదు. చివరికి పోలీసు వాహనాలకు పెట్రోలు కూడా ఇవ్వని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దుతున్నాం. రాష్ట్రంలో గంజాయి సాగు, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు 'ఈగల్' ద్వారా ఇప్పటికే యుద్ధాన్ని ప్రారంభించాం. దీనిని ఆపేది లేదు.

ఆడబిడ్డల జోలికొస్తే అదే గతి

సోషల్ మీడియాలో విచ్చలవిడితనం పెరిగిపోయింది. వ్యక్తిగత దూషణలతో ఆడబిడ్డలు తలెత్తుకుని తిరగలేని విధంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ప్రేమ పేరుతో అమ్మాయిలను ఇబ్బందులు పెడుతున్నారు. ఆడబిడ్డల జోలికొస్తే వారికి అదే చివరి రోజవుతుంది. గతంలో ఇలాగే దాచేపల్లిలో ఒక అమ్మాయిపై అఘాయిత్యానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడానికి 10 టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశాం. ఇక తప్పించుకోలేనని భావించి నాలుగో రోజు అతనే ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఆడబిడ్డల జోలికొస్తే ఎవరికైనా ఇదే గతి పడుతుంది. ఆడబిడ్డలకు రక్షణగా నిన్ననే శక్తి యాప్‌ను ప్రారంభించాం. ఆడపిల్లలందరూ ఆ యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో ఆ యాప్ ద్వారా సమాచారం అందిస్తే 6 నుంచి 9 నిమిషాల్లోనే పోలీసులు వస్తారు. ఇలాంటి ఫిర్యాదులు నమోదైన తర్వాత బాధితులకు ఏదైనా జరిగితే.. దానికి పోలీసులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనిపై అందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై కూడా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేరస్థులకు 2, 3 నెలల్లోనే శిక్ష పడే పరిస్థితిని తీసుకువచ్చాం. సైబర్ నేరాలను అరికట్టేందుకు 26 సైబర్ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో గత ప్రభు త్వం సృష్టించిన భూ సమస్యలు భయంకరంగా ఉన్నాయి. భూ ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడేవారు భయపడేలా త్వరలోనే ల్యాండ్ గ్రాబింగ్-2024 చట్టాన్ని తీసుకురానున్నాం.

హత్యా రాజకీయాలకు పాల్పడలేదు

వైఎస్ వివేకా హత్య కేసులో ఆరుగురు సాక్షులు చనిపోవడం ఆలోచించాల్సిన అంశం. 2019లో నేను సీఎంగా ఉండగానే వివేకా హత్య జరిగింది. ఆయన గుండెపోటుతో చనిపోయారని ఆ రోజు ఉదయమే వాట్సాప్ మెసేజ్ వచ్చింది. నేను కూడా నిజమని నమ్మేశాను. నేరస్థులు ఏవిధంగా ట్రాప్‌లో పడేస్తారనడానికి ఇదొక ఉదాహరణ. నేను హత్యా రాజకీయాల మరక అంటకుండా 40ఏళ్లు రాజకీయాలు చేశాను. హత్యా రాజకీయాలు చేసినవారికి వ్యతిరేకంగా పోరాడి ప్రజాక్షేత్రంలో శిక్ష పడేలా చేసి.. వారిని రాజకీయాల్లో లేకుండా చేశానే తప్ప నేనెప్పుడూ హత్యా రాజకీయాలు చేయలేదు' అని చంద్రబాబు వివరించారు.

పోలవరానికి మరో రూ.2,704 కోట్లు

- కేంద్రం నిర్ణయం.. ఒకట్రెండు రోజుల్లో విడుదల

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులకు నిధుల కొరత లేకుండా కేంద్రం మరో రూ.2,704 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ఆర్థికశాఖ మంగళవారం ఈ నిర్ణయం తీసుకుంది. ఒకట్రెండు రోజుల్లో ఈ నిధులు ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా తెరచిన బ్యాంకు ఖాతాలో జమకానున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు తొలి విడతగా గతేడాది అక్టోబరులో కేంద్ర జలశక్తి శాఖ రూ.2,348 కోట్లు అడ్వాన్సుగా ప్రకటించింది. దరిమిలా డయాఫ్రం వాల్, ఇతరత్రా పనులను ప్రారంభించారు. దానికి కొనసాగింపుగా ఇప్పుడీ 2,704 కోట్లు ఇస్తోంది. ఇంకోవైపు.. ప్రాజెక్టు పనుల పురోగతిపై ఈ నెల 17న పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది. 18న కేంద్ర జల సంఘం కూడా సమీక్ష జరుపనుంది. ఈ నెల 27న పోలవరం బ్యాక్‌వాటర్ సమస్యపై ఏపీ, తెలంగాణ అధికారులతో పీపీఏ భేటీ కానుంది.

నేడు, రేపు ఎండ ప్రచండమే!

అమరావతి, విశాఖపట్నం, మార్చి11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం 180 మండలాల్లో సాధారణ వడగాడ్పులు, 19 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ఉంటాయని హెచ్చరించింది. మంగళవారం అల్లూరి జిల్లా పాడేరు, మన్యం జిల్లా కురుపాంలో 39 డిగ్రీలు, ఏలూరు జిల్లా రాజుపోతేపల్లి, నంద్యాల జిల్లా జూపాడు బంగ్లాలో 38.7 డిగ్రీలు, విజయనగరం జిల్లా నెలివాడలో 38.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితలద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో మంగళవారం తమిళనాడు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రాయలసీమలోని మిగిలిన ప్రాంతాల్లో పాక్షికంగా మేఘాలు ఆవరించాయి. రానున్న 24 గంటల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

పార్లమెంట్‌లో అరకు కాఫీ

- లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వినతి

న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఆవరణలో అరకు కాఫీ షాపు కొలువు దీరనుంది. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ సీఎం రమేశ్ కలిశారు. అరకు కాఫీ ప్రాముఖ్యతను, పలు సందర్భాల్లో ప్రధాని కీర్తించిన విషయాలను స్పీకర్ దృష్టికి తెచ్చారు. అనంతరం రామ్మోహన్ నాయుడు 'అరకు కాఫీని ప్రోత్సహించాలని లోకసభ స్పీకర్ ఓం బిర్లాని కోరాం. పార్లమెంటులో అరకు కాఫీ ప్రచారం కోసం ప్రత్యేకమైన కార్యక్రమం, శాశ్వతంగా ఒక స్టాల్ ఏర్పాటు చేయాలని కోరాం. స్పీకర్ ప్రత్యేక చొరవతో ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లోనే కాఫీ షాపు ప్రారంభించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు' అని ఎక్స్‌లో వెల్లడించారు.

రాష్ట్రంలో జాతీయ రహదారులకు 6938 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 సంవత్సరానికి కొనసాగుతున్న, కొత్త జాతీయ రహదారుల ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం రూ.6,938.38 కోట్లు కేటాయించింది.

ఏపీ పునర్నిర్మాణానికి చేయూతనివ్వండి: కలిశెట్టి

న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఏపీ పునర్ నిర్మాణానికి కేంద్రం చేయూతనివ్వాలి' అని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు కోరారు. మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగింది. ప్రజలు ఎంతో విశ్వాసంతో చంద్రబాబును సీఎంని చేశారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంలో కేంద్రం అండగా నిలవాలి. జాతీయ పశు సంవర్ధక మిషన్ కింద ప్రతిఏటా రాష్ట్రానికి రూ.100 కోట్లు కేటాయించాలి. రాయలసీమ, ఉత్తరాంధ్రలో తాగు, సాగు నీటి ఎద్దడి నివారణకు, పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలి' అని ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి చేశారు.

తూర్పున కొబ్బరి బోర్డు పెట్టాలి: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులకు మేలు చేకూరేలా తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభలో రూల్ 377 కింద స్పీకర్ ప్రత్యేక అనుమతితో మంగళవారం రాష్ట్రంలోని కొబ్బరి రైతుల సమస్యలను పురందేశ్వరి ప్రస్తావించారు. ప్రముఖ కొబ్బరి ఉత్పత్తిదారుగా ఏపీకి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని తూర్పు గోదావరి జిల్లాలో ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి: బైరెడ్డి శబరి


న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బేడ బుడగ జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. మంగళవారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆమె మాట్లాడారు. 'ఏపీలో బేడ బుడగ జంగం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కులం. బుర్ర కథలు చెబుతుంటారు. 1976లో కేంద్రం వారిని ఎస్సీ జాబితాలో చేర్చడంతో విద్య, ఉద్యోగాల్లో ప్రయోజనం పొందారు. 2008లో వీరిని ఎస్సీ నుంచి ఓసీ జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి అన్నివిధాలుగా అన్యాయం జరుగుతోంది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో వారిని ఎస్సీ జాబితాలో చేర్చారు. ఏపీలో సైతం వారిని ఎస్సీ జాబితాలో చేర్చాలి' అని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుకు నిధులివ్వండి: ఎంపీ నాగరాజు

న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు నిధులివ్వాలని కేంద్రాన్ని ఎంపీ నాగరాజు కోరారు. మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమ తాగు, సాగు నీటి సమస్యలకు బనకచర్ల ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వడంతోపాటు అటవీ భూములనూ కేటాయించాలి' అని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

15 కోట్ల సీఎస్ఆర్ నిధులు ఇవ్వండి: పుట్టా మహేశ్

న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.3.09 కోట్లు, నూజివీడు ట్రిపుల్ ఐటీలో మౌలిక వసతులకు రూ.12.17 కోట్లు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.



రాష్ట్రంలో నేటి నుంచే లిఫ్టుల చట్టం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లిఫ్ట్ అండ్ ఎస్కలేటర్స్ బిల్లు-2025ను ప్రవేశపెట్టారు. ఈ సభల్లో ప్రవేశపెట్టిన తొలి బిల్లు ఇదే. ఉభయ సభల ఆమోదం పొందిన బిల్లును గవర్నర్ అంగీకారం కోసం రాజ్‌భవన్‌కు పంపారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా వెనువెంటనే బిల్లును ఆమోదించారు. బుధవారం చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలను ఇంధనశాఖ విడుదల చేయనుంది. దీంతో లిఫ్టులు, ఎస్కలేటర్ల చట్టం-2025 బుధవారం నుంచే అమలులోకి రానుంది. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ, 'రాష్ట్రంలో వేగంగా నిర్మితమవుతున్న బహుళ అంతస్తుల భవనాలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలు, హోటళ్లు, మాల్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ బిల్లును ప్రవేశపెడుతున్నాం. పెరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి ఈ బిల్లు దోహదపడుతుంది' అని పేర్కొన్నారు.

మీకెందుకు అంత నిర్లక్ష్యం..?

- సభ్యుల ప్రశ్నలకు సమగ్ర సమాధానం తయారు చేయలేరా?
- ఎంఎస్ఎంఈ అధికారులపై మంత్రి కొండపల్లి ఆగ్రహం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ అధికారులపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. శాసనమండలిలో తన శాఖకు సంబంధించిన ప్రశ్నకు అధికారులు సమగ్ర సమాధానం తయారు చేయకపోవడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. మండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వంకా రవీంద్రనాథ్, మొండితోక అరుణ్‌కుమార్.. 2014-19, 2019-24 మధ్య ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు ఏవైనా ప్రోత్సాహకాలు అందించారా? వాటి వివరాలు తెలపాలని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు అధికారులు అరకొరగా సమాధానం తయారు చేశారు. దీంతో ఆగ్రహించిన మంత్రి.. సభ నుంచి బయటకు రాగానే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు బాధ్యత లేదా? అంటూ నిలదీశారు. దీనికి బాధ్యులు ఎవరో? లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలపై స్పీకర్ సమీక్ష


క్రీడా పోటీల బహుమతులను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్న, మంత్రులు రాంప్రసాద్, ఫరూక్ తదితరులు

శాసన సభ్యుల కోసం ఈనెల 18,19,20 తేదీల్లో ప్రత్యేకంగా నిర్వహించనున్న క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, శాసనసభ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, సుందరపు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. రాజకీయ నేతలకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతో సహాయపడతాయని, అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని స్పీకర్ కోరారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, విజేతలకు 20న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన మంగళవారం పూర్తయింది. ఐదుగురు అభ్యర్థుల నామినేషన్లను అధికారులు ఆమోదించారు. పరిశీలనకు అభ్యర్థులు హాజరయ్యారు. పోటీ లేని నేపథ్యంలో.. నామినేషన్ల ఆమోదంతో అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లే. అయితే 13 వరకు ఉపసంహరణకు గడువు ఉండటంతో.. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఏకగ్రీవ ఎన్నికపై అధికారులు ప్రకటన చేస్తారు.

ఐదేళ్లలో రామాయపట్నం ఎందుకు పూర్తి చేయలేదు?

- అభివృద్ధి నిరోధకులుగా మారొద్దు: ఆనం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఐదేళ్లలో రామాయపట్నం పోర్టు పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ.. కందుకూరు టీడీపీ ఎమ్మెల్యే రామాయపట్నం పోర్టు కాంట్రాక్టర్‌ను బెదిరించారని చెప్పారు. దీనిపై మంత్రి ఆనం జోక్యం చేసుకుని.. ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాల గురించి ప్రశ్న అడిగి, పోర్టుల గొడవేంటి అని ప్రశ్నించారు. సభలో పోర్టుల మంత్రి లేరని చెప్పారు.

తెలుగు గంగ కాల్వలకు రూ.100 కోట్లు: నిమ్మల

తెలుగు గంగ ప్రాజెక్టు విస్తరణ పనుల్లో 27 శాతం మిగిలి ఉన్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో భూమా అఖిలప్రియ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ పనులను జీవీపీఆర్ సంస్థకు అప్పగించామని, భూసేకరణ, రైతుల అభ్యంతరాల వల్ల 27 శాతం పనులు ఉండగానే ప్రీక్లోజ్ చేసుకుందన్నారు. ఈ పనులకు 100 కోట్లతో అంచనాలు సిద్ధం చేస్తున్నామన్నారు.

రైతుకు గిట్టుబాటు ధర లేదు: వైసీపీ

కూటమి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'పంటల బీమా ఊసే లేదు. మిర్చికి గిట్టుబాటు ధర లేదు. తుఫాన్లు, కరువుతో నష్టపోయిన రైతులకు సాయం చేయలేదు' అని విమర్శించారు.

మాజీ మంత్రి ఉమా, వెంకన్నలను కలిసిన బీద



రవిచంద్రయాదవ్‌ను సన్మానిస్తున్న ఉమా, జ్ఞాపిక అందచేస్తున్న బుద్దా

విజయవాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ అభ్యర్థి బీద రవిచంద్ర యాదవ్ మంగళవారం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలను మర్యాదపూర్వకంగా కలిశారు. గొల్లపూడిలో తనను కలిసిన రవిచంద్రను ఉమా దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అలాగే విజయవాడలో తనను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థిని బుద్దా వెంకన్న సత్కరించారు.

జగన్ హోంలోనే హోం శాఖ

- వైసీపీ నేతల బూట్ల కింద నలిగిన పోలీసు చట్టాలు
- అసెంబ్లీలో 'హోం' డిమాండ్లపై చర్చలో ఎమ్మెల్యేలు

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వంలో హోంశాఖ జగన్ హోం లోనే ఉంది. పోలీసు చట్టాలు వైసీపీ నేతల బూట్ల కింద నలిగిపోయాయి' అని సీనియర్ శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో హోంశాఖకు సంబంధించి డిమాండ్లపై చర్చలో ఆయన మాట్లాడారు. 'ఆనాడు క్వార్ట్జ్ మైనింగ్ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాం. నాపై 18 కేసులు పెట్టి వేధించారు. చివరకు నాపై హిజ్రాలతో దాడి చేయించారు' అని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ... 'జగన్ ప్రభుత్వంలో మా నాయకుడు చంద్రబాబు ఇంటిపైన, కార్యాలయంపైనా దాడులు చేశారు. నిరసన చేపట్టిన టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి వేధించారు. మాచర్లలో చంద్రయ్య అనే టీడీపీ కార్యకర్త జై చంద్రబాబు అన్నందుకు గొంతు కోశారు. నాపై 8 కేసులు పెట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ... 'ఇన్నేళ్లయినా వివేకా హత్యకేసులో పురోగతి లేదు. సాక్షులు ఒక్కొక్కరుగా ఇప్పటికే ఆరుగురు చనిపోయారు. ఆ హత్య చేసిందెవరో రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలుసు' అని అన్నారు. తొలుత జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.

విద్యా వ్యవస్థను నాశనం చేశారు

- విద్యార్థులకు 4వేల కోట్లకు పైగా బకాయిలు
- ఇంటర్ పుస్తకంలో జగన్, లక్ష్మీపార్వతి సందేశాలు
- విద్యారంగాన్ని తిరిగి గాడిలో పెడతాం: లోకేశ్

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను తిరిగి గాడిలో పెడతామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. దేశంలో ఏపీ మోడల్ విద్యా విధానాన్ని నంబర్ వన్ చేయడమే తమ లక్ష్యమన్నారు. విద్యా వ్యవస్థపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వంలో 12లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. జీవో 117 వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలలు 12,512కు చేరాయి. విద్యార్థుల డ్రాపౌట్ రేటు 12.5 శాతానికి పెరిగింది. 47వేల మంది బాలికలు విద్యకు దూరమయ్యారు. రాష్ట్రంలో పాఠశాల విద్య ఎంత దారుణంగా దిగజారిపోయిందో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, అసర్ నివేదికలు బహిర్గతం చేశాయి. పాఠశాలల్లో 45 రకాల యాప్‌లు పెట్టి గందరగోళం చేశారు. ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద నిలబెట్టారు. టాయిలెట్ల ఫొటోలు తీయించారు. నాడు-నేడు పనులను మధ్యలోనే వదిలేశారు. మొదటి దశ పనులు


అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

పూర్తి చేయడానికే ఇంకా రూ.880 కోట్లు కావాలి' అని లోకేశ్ చెప్పారు. వైసీపీ హయాంలో బొమ్మల పిచ్చి ముదిరిపోయిందని చెబుతూ.. 'విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, డిక్షనరీలు అన్నిటిపైనా జగన్ ఫొటోలు, పేర్లు రాసుకున్నారు. చివరికి పిల్లలకు ఇచ్చే గుడ్లపై వైఎస్ఆర్ పేరు రాశారు. చిక్కీలపై జగన్ ఫొటోలు వేసుకోవడం వారి బొమ్మల పిచ్చికి పరాకాష్ఠ. ఇంటర్మీడియట్ బోటనీ పుస్తకంలో జగన్, లక్ష్మీపార్వతి సందేశాలు పెట్టారు. మొత్తం ఎనిమిది పేజీలు సందేశాలకే కేటాయించారు. అవి తొలగిస్తే రూ.30లక్షలు మిగిలాయి. అందుకే ఈ ప్రభుత్వంలో రాజకీయ నేతల ఫొటోలు వేయకూడదని నిర్ణయం తీసుకున్నాం. విద్యా కానుక, చిక్కీలు, గుడ్లలో రాబోయే ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్లు మిగులుతాయి. పైగా గత ప్రభుత్వం పెట్టిన గుడ్లు, చిక్కీల బకాయిలు మేమే చెల్లించాం' అని లోకేశ్ చెప్పారు.

సంస్కరణలు తీసుకొస్తున్నాం

'జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకొస్తాం. తరగతికి ఒక టీచర్‌ను ఇచ్చేలా మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం. కేజీ టూ పీజీ మొత్తం కరిక్యులమ్ మారుస్తాం. పిల్లల బ్యాగుల బరువు తగ్గించేందుకు సెమిస్టర్ల వారీగా పుస్తకాలు ముద్రిస్తున్నాం. ఉపాధ్యాయ బదిలీలకు చట్టం చేస్తున్నాం. ఈ నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తాం.' అని లోకేశ్ అన్నారు. పాఠశాలల్లో పెండింగ్ పనులను ఈ ఏప్రిల్‌లో ప్రారంభించి, వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. నో బ్యాక్ డే ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్‌కు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోళ్ల లలిత కుమారి కోరారు. వైసీపీ ప్రభుత్వం విద్యాశాఖకు ఏమీ చేయలేదని గౌతు శిరీషా ఆరోపించారు. పాఠశాలల్లో టీచర్ పోస్టులు భర్తీ చేయాలని పల్లె సింధూరరెడ్డి కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మిస్తాం: సంధ్యారాణి

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కూన రవికుమార్, పల్లె సింధూరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో 2014 -19 మధ్యలో 12,496 అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేశామని, అందులో 6,161 భవనాలను పూర్తి చేశామని చెప్పారు.

త్రిభాషా విధానంపై రాజకీయం సరికాదు: లోకేశ్

త్రిభాషా విధానంపై రాజకీయం చేయడం సరికాదని మంత్రి లోకేశ్ అన్నారు. మాతృభాష పరిరక్షణపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు చేసిన సూచనలపై ఆయన స్పందించారు. 'సరిహద్దు జిల్లాల్లో కన్నడ, ఒడియా, ఉర్దూ, తమిళం భాషలను నా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నేను దృష్టి పెట్టాలి. మాతృభాష అనేది చాలా కీలకం. అనవసరంగా పక్క రాష్ట్రాల్లో అపోహలు సృష్టిస్తున్నారు. కేంద్ర మంత్రిని కలిసినప్పుడు కూడా మాతృభాషను మర్చిపోవద్దని చాలా స్పష్టంగా చెప్పారు. త్రిభాషా విధానం తీసుకొచ్చారు. అందులో తప్పు లేదు. ఈరోజు పిల్లలు జర్మన్, జపనీస్ నేర్చుకోవాలనుకుంటున్న యుగంలో.. త్రిభాషా విధానంపై కావాలని రాజకీయం చేయడం సరికాద'న్నారు.


ప్రభుత్వం అందజేయనున్న నూతన యూనిఫాంతో విద్యార్థులు

'పిల్లల' కోసం ఎమ్మెల్యేలతో కమిటీ

శారీరక, మేధో వైకల్యం ఉన్న పిల్లలకు ఎలాంటి విద్య అందించాలి అనే అంశం, భవిత సెంటర్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యేలతో కమిటీ ఏర్పాటు చేస్తామని లోకేశ్ తెలిపారు. సుందరపు విజయ్‌కుమార్ అడిగిన ప్రశ్నకు లోకేశ్ సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 679 భవిత సెంటర్లు ఉన్నాయని, 41,119 మంది ప్రత్యేక అవసరాలున్న పిల్లలు వాటిలో రిజిష్టర్ అయ్యారని తెలిపారు. భవిత సెంటర్లలో ఆధునిక టెక్నాలజీని తీసుకురావాలని, స్పెషల్ పిల్లలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చూడాలని విజయ్‌కుమార్ కోరారు.

అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తాం

పూర్వపు ఆంధ్రప్రదేశ్ ప్రాచీన పత్ర భాండాగారం రక్షణపై ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నకు లోకేశ్ బదులిస్తూ.. రాష్ట్ర చరిత్రకు సంబంధించిన ఆర్కైవ్స్, ఓరియంటల్ లైబ్రరీ, జిల్లా గెజిట్స్‌కు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. సెంట్రల్ లైబ్రరీకి అమరావతిలో భూమి కేటాయించాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణను కోరగా, అంగీకరించారని చెప్పారు.

జగన్ దెబ్బకు అమర్‌రాజా వెళ్లిపోయింది

- ప్రతి ఎమ్మెల్యే పెట్టుబడుల కోసం కృషి చేయాలి: లోకేశ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దెబ్బకు రాష్ట్రానికి ఆదాయపు పన్ను చెల్లిస్తున్న అమర్‌రాజా బ్యాటరీస్ హైదరాబాద్‌కు తరలిపోవడం తనను చాలా బాధిస్తున్నదని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం పెట్టుబడిదారులను కష్టాలు పెట్టిందని, కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ముందుకు వెళుతోందని చెప్పారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ పరిశ్రమలు, ఐటీ రంగంలో పెట్టుబడులు రాబట్టేందుకు ఎమ్మెల్యేలంతా సహకరించాలని కోరారు. అసెంబ్లీ, మండలిలోని అధికార, ప్రతిపక్ష సభ్యులంతా పెట్టుబడులను ఆహ్వానించేందుకు కృషి చేయాలన్నారు. విశాఖపట్నం కేంద్రంగా సాఫ్ట్‌వేర్ రంగంలో పెట్టుబడులు తీసుకువస్తామని చెప్పారు. విశాఖలో ఏఐ ఆధారిత ఐటీని అభివృద్ధి చేస్తామన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ వ్యాలీని విశాఖలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో పెట్టుబడులను రాబట్టేందుకు ప్రయత్నించాలన్నారు.

మండలిలో ఇసుక దుమారం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇసుక అమ్మకాలపై మంగళవారం శాసనమండలిలో వాడివేడిగా చర్చ జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక విధానం వల్ల వేలాది మంది తీవ్రంగా నష్టపోయారని, ఇసుక దొరక్క, పనిలేక వందల మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి, అచ్చెన్నాయుడు మండిపడ్డారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాతో వైసీపీ నేతలు వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఇసుక దోపిడీతో ప్రభుత్వానికి 1,250 కోట్లు నష్టం చేకూర్చారని మండిపడ్డారు. జిల్లా స్థాయిలో శాండ్ కమిటీల ద్వారా ఇసుక తవ్వకాలకు అనుమతిస్తున్నామని చెప్పారు. ఉచిత ఇసుక విధానంతో పేదవాడికి లబ్ధి చేకూరడం లేదని గతం కంటే పెద్దగా మార్పులేదని వైసీపీ సభ్యులు బొత్స సత్యనారాయణ, తోట త్రిమూర్తులు విమర్శించారు. గత ప్రభుత్వంలో విశాఖలో లారీ ఇసుక రూ.12 వేలకే దొరికేదని బొత్స చెప్పారు. బొత్స వ్యాఖ్యలపై మంత్రులు దీటుగా జవాబిచ్చారు. గత ప్రభుత్వంలో టన్నుకు రూ.375 చొప్పున రీచ్ వద్దే వసూలు చేశారని, రవాణా ఖర్చుతో ధర ఎక్కువగా ఉండేదన్నారు. గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.8,500 ఉంటే ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో రూ.1,800కు ఇంటి వద్దకే చేరుస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. విశాఖలో గత ప్రభుత్వంలో లారీ ఇసుక రూ.50వేలకు అమ్మారని, ఇప్పుడు రూ.20వేలకే ఇంటికి చేరుతోందన్నారు. గత ఐదేళ్లలో రూ.12వేలకు లారీ ఇసుక దొరికిందన్నది అసత్యమని మంత్రి పార్థసారథి అన్నారు. వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

పీఎం కిసాన్‌తోపాటే అన్నదాత సుఖీభవ

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మే నెలలో అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్, రబీ, మధ్యలో ఒకసారి పీఎం కిసాన్ కింద రైతులకు సాయాన్ని అందిస్తుంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నదాత సుఖీభవ కింద ఇచ్చే సాయాన్ని కూడా అందించాలని నిర్ణయించాం' అని మంత్రి వివరించారు. మంగళవారం శాసనమండలిలో వ్యవసాయ రంగంలో సంక్షోభం అనే అంశంపై జరిగిన లఘు చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ 'అన్నదాత సుఖీభవ మూడు విడతలుగా ఇస్తామంటున్నారని.. ప్రభుత్వానికి ఇది మంచిదికాదని ఒకేసారి సాయం అందించాలి' అని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ 'కేంద్రం ఖరీఫ్, రబీ, మధ్యలో ఒకసారి మూడు విడతలుగా సాయం ఇస్తోంది. వాళ్లు ఎప్పుడిస్తే రాష్ట్ర ప్రభుత్వ వాటా డబ్బులు అప్పుడే ఇవ్వడానికి నిర్ణయించాం' అని చెప్పారు. గత ప్రభుత్వం రైతు భరోసా కింద ఏడాదికి రూ.7,500 ఇచ్చి, మిగతా పథకాలన్నీ ఆపేసిందని మంత్రి విమర్శించారు. రుణమాఫీకి 2016లో బాండ్లు ఇచ్చారని 2019 వరకు డబ్బులు ఇవ్వకుండా ఏంచేశారని బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మిర్చి ఒక్క టన్నైనా రూ.11,700కి కొన్నారా? అని ప్రశ్నించారు. రైతాంగానికి గిట్టుబాటు ధర పెద్ద సమస్యగా మారిందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. పత్తిని సీసీఐ యార్డుల్లో కాకుండా జిన్నింగ్ మిల్లుల్లో కొంటున్నారన్నారు. పండించిన ధాన్యంలో 40 శాతం మాత్రమే కొనుగోలు చేశారని మిగిలిన 60శాతం రైతుల వద్దే ఉందన్నారు.

జగన్ పత్రిక కొనుగోలుకు 144 కోట్లు

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రికకు గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచిపెట్టిందని శాసనమండలిలో టీడీపీ సభ్యులు విరుచుకుపడ్డారు. 15,004 సచివాలయాలకు ఆ పేపర్ వేశారని.. వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు కూడా ఆ పేపరే కొనేలా చేశారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు జగన్ పత్రిక పేపర్ కొనడానికి వీలుగా వారికి నెలకు రూ.200 చొప్పున ఆ ప్రభుత్వం అలవెన్సు ఇచ్చిందన్నారు. తద్వారా ఐదేళ్లలో ఆ పత్రిక కొనుగోలుకు రూ144.06 కోట్లను చెల్లించిందని తెలిపారు. గత ఐదేళ్లలో అన్ని వార్తాపత్రికలకు విడుదల చేసిన ప్రభుత్వ ప్రకటనల విలువ రూ.859.3 కోట్లు కాగా.. రూ.556.82 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఇందులో జగన్ పత్రికకు ఇచ్చిన ప్రకటనల విలువ రూ.371.12 కోట్లు అని.. ఇందులో రూ.196.31 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. టీడీపీ సభ్యులు అశోక్‌బాబు, దువ్వారపు రామారావు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో జగన్ పత్రికకు రూ.400 కోట్లు చెల్లించారని దీనిపై విచారణకు సభా సంఘం వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కచ్చితంగా విచారణ జరుపుతామని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

జగన్ ఇస్తానన్న కోటి సాయంపై విచారణ చేద్దామా?

బుడమేరు వరద బాధితులకు ప్రభుత్వ సాయంపై శాసనమండలిలో మంగళవారం వాడీవేడి చర్చ జరిగింది. నాడు పరామర్శకు వెళ్లి బాధితులకు మాజీ సీఎం జగన్ ప్రకటించిన రూ.కోటి సాయం ఏమైందో విచారణ కమిటీ వేసేందుకు ప్రభుత్వం సిద్ధమని.. వైసీపీ సభ్యులు రెడీయేనా హోంమంత్రి అనిత వైసీపీ సభ్యులకు సవాల్ విసిరారు. వరద బాధితులకు పూర్తి స్థాయిలో సాయం అందించలేదని, దరఖాస్తులు తీసుకుంటే లక్ష వస్తాయని వైసీపీ ఎమ్మెల్సీ రూహుల్లా చేసిన వ్యాఖ్యలపై ఆమె, మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. 'వరద బాధితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిహారం అందించింది. ఎక్కడా అసంతృప్తి లేదు. బుడమేరు వరదను రాజకీయం చేయొద్దు. ఎవరైనా పరిహారం అందలేదని ఇప్పుడు వచ్చినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇంకా లక్ష మంది వస్తారంటూ పెద్దల సభలో కూర్చుని అసత్యాలు మాట్లాడుతున్నారు' అని విమర్శించారు. వైసీపీ విధానాల వల్లే బుడమేరుకు వరద వచ్చిందని, దీనిపై చర్చకు తాము సిద్ధమని రవీంద్ర అన్నారు. వరద బాధితులకు జగన్ రూ.కోటి ఇచ్చారని, పాలు, నీరు, నిత్యావసరాలు అందజేశామని బొత్స తెలిపారు. బాధ్యత కలిగిన వారెవరైనా విరాళాలను ప్రభుత్వ వ్యవస్థకు ఇస్తారని, ప్రభుత్వానికి జగన్ ఏమీ ఇవ్వలేదని పార్థసారథి చెప్పారు.

అమరావతిలో 64 వేల కోట్లతో 73 పనులు

39 వేల కోట్ల విలువైన 63 పనులకు టెండర్లు

- అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి/విజయవాడ(ఇబ్రహీంపట్నం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మొత్తం రూ. 64,721 కోట్లతో 73 పనులను అంచనా వేశామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ఆ 73 పనుల్లో 63 పనులకు టెండర్లు పూర్తి చేశామన్నారు. వాటి విలువ రూ. 39,678 కోట్లని వివరించారు. అమరావతిలో నిర్మాణాలపై అసెంబ్లీలో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల భవనాల నిర్మాణాలు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో పనులకు ఆమోదం తెలిపి సంస్థలకు లేఖలు ఇస్తామని తెలిపారు. అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్, ఏడీబీ రూ. 13,400 కోట్లు ఇవ్వడానికి అనుమతిచ్చాయన్నారు. కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రూ. 5 వేల కోట్లు, హడ్కో నుంచి రూ. 11 వేల కోట్లు అనుమతివచ్చిందని, వాటితో అగ్రిమెంట్ చేసుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ కింద రూ. 1560 కోట్లు ఇస్తుందన్నారు. ఇవి కాకుండా మార్టుగేజ్, లీజుల ద్వారా వివిధ సంస్థల నుంచి అమరావతి నిర్మాణానికి నిధులు సేకరిస్తున్నామన్నారు. అమరావతిని మూడేళ్లలో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. రెండేళ్లలో మెయిన్ రోడ్డులు, మూడేళ్లలో అంతర్గత రోడ్లు పూర్తి చేస్తామన్నారు. అసెంబ్లీ, హైకోర్టు మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. తాము 2014-19లో 131 సంస్థలకు 1,277 ఎకరాలు ఇచ్చామని, గత ఐదేళ్ల పరిణామాలవల్ల కొందరు వెనక్కి వెళ్లారని, ఇపుడు 31 సంస్థలకు 629 ఎకరాలు భూమి ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం ఆర్-5 జోన్‌లో 50 వేల మందికి ఒక సెంటు భూమి అమరావతిలో ఇచ్చారని,వారికి వేరేచోట భూమి కేటాయిస్తామన్నారు.

నాడు జగన్ ఒప్పుకొన్నారు

అమరావతిని రాజధానిగా నిర్ణయించినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత జగన్ అమరావతిలోనే రాజధాని ఉండాలని, 30 వేల ఎకరాలు అవసరమని అసెంబ్లీలో ఒప్పుకొన్నారని నారాయణ చెప్పారు. ప్రభుత్వం మారగానే మూడు ముక్కలాట ఆడి రైతులను ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ఐదేళ్లలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రైతులకు సుజనా చౌదరి అండగా నిలిచారని అన్నారు. తాము 2015 జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ లోగా కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాలు సేకరించామని పేర్కొన్నారు. కేవలం సీఎం చంద్రబాబుపై నమ్మకంతో రైతులు భూమి ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎనిమిది నెలల్లో సమస్యలు పరిష్కరించి టెండర్లు ఆహ్వానించామన్నారు. ఇక పుత్తూరు మున్సిపాలిటీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతోందని మంత్రి చెప్పారు. టెండర్లు పిలవకుండానే ఎస్ఎస్ ట్యాంక్‌బండ్ మరమ్మత్తు పనిలో రూ. 45.82 లక్షలు పూర్తి చేశారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడారు. వైసీపీది అరాచపాలన అని మండిపడ్డారు. అమరావతి రైతుల బాధలు విని ఐదేళ్లపాటు కోర్టుల చుట్టూ తిరిగామన్నారు. తాను అమరావతిలో అంగుళంభూమి కొనడం గానీ, అమ్మడంగానీ చేయలేదన్నారు.అమరావతిని రెరాచట్టం కిందకు తీసుకురావాలని, రైతులకు జరిగిన నష్టాన్ని ఏ విధంగా భర్తీ చేస్తారో చెప్పాలని కోరారు.

కేబినెట్ ఆమోదం తర్వాత పనులు: నారాయణ

అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 37,702.15 కోట్ల విలువైన 59 టెండర్లకు సీఆర్డీఏ ఆమోదం తెలిపిందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ నెల 17న జరిగే కేబినెట్‌లో వీటన్నింటికీ ఆమోదం పొంది వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఏప్రిల్‌లో 20 వేల మంది అమరావతి అభివృద్ధి పనుల్లో పాల్గొంటారన్నారు. సీఎం అధ్యక్షతన 45వ సీఆర్డీఏ సమావేశం జరిగిందని తెలిపారు. ఈసమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. 59 టెండర్లలో సీఆర్డీఏకు చెందిన 22 పనుల విలువ దాదాపు రూ. 22,607.11 కోట్లు అని, ఏడీసీకి చెందిన 37 పనుల విలువ దాదాపు రూ. 15,095.04 కోట్లని ఆయన తెలిపారు. సీఆర్డీఏకు చెందినవి 24 పనులు కాగా ప్రస్తుతానికి 22 పనులకు సంబంధించిన టెండర్లను మాత్రమే ఓపెన్ చేశామన్నారు. మిగిలిన 2 పనులకు ఈనెల 17న టెండర్లు ఓపెన్ చేస్తామన్నారు. అవికాక ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బిడ్జ్, జాతీయ రహదారి నిర్మాణం తదితర పనులకు దాదాపు రూ. 16,871.52 కోట్లు విలువైన మరో 19 పనులకు ఈనెలాఖరు లోపు టెండర్లు పిలిచి పనులను చేపడతామన్నారు.

అప్పారావు కుటుంబ ఆచూకీ దొరికింది!

- 20 ఏళ్ల క్రితం ఉపాధి కోసం వెళ్లి తప్పిపోయిన వైనం
- అప్పటి నుంచి తమిళనాడులో గొర్రెల కాపరిగా వెట్టిచాకిరీ
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం అన్వేషణ

పార్వతీపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తమిళనాట తప్పిపోయిన అప్పారావు కుటుంబ ఆచూకీ లభ్యమైంది. ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన కొండగొర్రె అప్పారావు 20 ఏళ్ల క్రితం తన స్వగ్రామం నుంచి కొంతమందితో కలిసి పనికోసం రైలులో పాండిచ్చేరికి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో టీ తాగడానికి అప్పారావు రైలు దిగడంతో ఆ రైలు వెళ్లిపోయింది. డబ్బులు లేకపోవడంతో అక్కడే ఉండిపోయాడు. ఇటీవల తమిళనాడులోని శివగంగ జిల్లా కదంబకళంలో తనిఖీల్లో అప్పారావు అడవిలో గొర్రెలు కాస్తూ లేబర్ అధికారుల కంటబడ్డాడు. విచారించగా, తమిళనాడులో ఓ వ్యక్తి 20 ఏళ్లుగా జీతం ఇవ్వకుండా గొర్రెల కాపరిగా పెట్టి పని చేయించుకున్నట్లు తేలింది. దీంతో ఇన్నాళ్లూ వెట్టిచాకిరిలో మగ్గిన అప్పారావుకు అధికారులు విముక్తి కలిగించారు. తనది పార్వతీపురం మండలం జమ్మవలస అని చెప్పగా, అక్కడి అధికారులు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు.


మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌ను కలిసిన అప్పారావు కూతురు, అల్లుడు

ఇక్కడి పోలీసులు అప్పారావు ఫొటోను చుట్టుపక్కల గ్రామాల్లో చూపించినా ఎవరూ గుర్తు పట్టలేదు. ఈ క్రమంలో.. 'ఉపాధి కోసం వెళ్లి 20 ఏళ్లుగా వెట్టి చాకిరీ' అన్న శీర్షికతో అప్పారావు 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 2న కథనం ప్రచురితమైంది. ఆ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పార్వతీపురం మండలం ములక్కాయవలసలో నివాసం ఉంటున్న కూతురు సాయమ్మ, అల్లుడు దొంబుదొర చందుకు తెలుసుకున్నారు. వారు మంగళవారం మన్యం జిల్లా కలెక్టర్‌ను కలిశారు. అప్పారావును రప్పించి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు అధి ప్రయత్నాలు చేస్తున్నారు.

జ్యోతిషం పేరుతో రూ.లక్ష స్వాహా

- టీవీలో స్ర్కోలింగ్ చూసి, ఫోన్ చేసి డబ్బు పోగొట్టుకున్న బాధితుడు
- మోసంపై పోలీసులకు ఫిర్యాదు.. నిందితుడు అరెస్టు.. రూ.లక్ష రికవరీ

మద్దూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జ్యోతిషం పేరుతో ఓ ఘరానా మోసగాడు రూ.లక్ష స్వాహా చేశాడు. 'జ్యోతిషం చెప్పబడును' అంటూ టీవీలో వచ్చిన స్ర్కోలింగ్‌ను చూసిన బాధితుడు ఆ వలలో చిక్కుకున్న ఘటన తెలంగాణలోని సిద్దిపేట జిల్లా కమలాయపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మోసగించిన డబ్బును తిరిగి ఇప్పించారు. కేసు వివరాలను సీఐ శ్రీను మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. కమలాయపల్లికి చెందిన నారాయణచారి కొద్ది రోజులుగా ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో జనవరిలో ఓ టీవీ చానల్‌లో జ్యోతిషం చెప్పబడును అంటూ వచ్చిన స్ర్కోలింగ్‌ను చూసి అక్కడ ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేశాడు. జ్యోతిషం చెప్పించుకుంటే.. బాధలు తొలగిపోయి, మంచి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పెద్దపలకనూరు చెందిన దక్షిణపు శివయ్య అనే వ్యక్తి నమ్మబలికాడు. దీంతో శివయ్య చెప్పిన విధంగా నారాయణచారి మొదట


నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు వివరాలు వెల్లడిస్తున్న టీ పోలీసులు

ఆయన బ్యాంకు ఖాతాకు రూ.50 వేలు పంపాడు. వారం తర్వాత శివయ్య ఫోన్ చేసి పూజకు డబ్బులు సరిపోలేదని, సగంలో ఆగిపోయిందని నమ్మించడంతో.. నారాయణచారి మరో రూ.50 వేలు పంపించాడు. మళ్లీ వారం తర్వాత ఫోన్ చేసి ఇంకా డబ్బు కావాలని, పూజ పూర్తవ్వలేదని, పూజ పూర్తి కాకుంటే చెడు జరుగుతుందని చెప్పడంతో నారాయణచారికి అనుమానం వచ్చింది. తాను మోసానికి గురైనట్లు భావించిన బాధితుడు 1930 నంబరుకు ఫోన్ చేసి నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్టు చేశాడు. కేసు నమోదు చేసి, సాంకేతికత సాయంతో నిందితుడు శివయ్యను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. జాతకాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడని చెప్పారు. అతని సెల్‌ఫోన్ సీజ్ చేసి, బాధితుడికి రూ.లక్ష తిరిగి ఇప్పించామని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జైల్లోనే వంశీ.. 25 వరకు రిమాండ్ పొడిగింపు



విజయవాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ మోహన్‌కు న్యాయస్థానం రిమాండ్‌ను పొడిగించింది. ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీతోపాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వంశీ రిమాండ్ గడువు మంగళవారంతో ముగిసింది. దీంతో ఆయనను జైలు అధికారులు జూమ్ యాప్ ద్వారా న్యాయాధికారి ఎదుట హాజరు పరిచారు. దీంతో ఆయన రిమాండ్‌ను ఈ నెల 25 వరకు పొడిగిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు న్యాయాధికారి హిమబిందు వెల్లడించారు.

పోసానిని కస్టడీకి ఇవ్వండి



- నరసరావుపేట కోర్టులో పోలీసుల పిటిషన్
- కౌంటర్ దాఖలు కోసం నేటికి వాయిదా
- మరో రెండు కేసుల్లో కృష్ణమురళికి బెయిల్ ఇచ్చిన బెజవాడ, ఆదోని కోర్టులు

నరసరావుపేట లీగల్/విజయవాడ/కర్నూలు లీగల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు పోసాని కృష్ణమురళిని వారం రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పల్నాడు జిల్లా నరసరావుపేట 2 టౌన్ పోలీసులు స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు కోసం విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ఈ నెల 3న అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌జైలు నుంచి పీటీ వారెంట్‌పై పోసానిని తీసుకువచ్చిన నరసరావుపేట పోలీసులు స్థానిక కోర్టులో హాజరు పరిచారు. దీంతో న్యాయస్థానం పోసానికి రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసును సమగ్రంగా విచారించేందుకు పోసానిని వారం రోజులపాటు కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఈ నెల 3నే పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం రెండు రోజులపాటు(ఈ నెల 8, 9 తేదీల్లో) పోసానిని నరసరావుపేట 2 టౌన్ పోలీసుల కస్టడీకి అనుమతించింది. అయితే, ఆ రెండు రోజుల్లో విజయవాడ భవానీపురం పోలీసులు పోసానిని పీటీ వారెంట్‌పై తీసుకువెళ్లడంతో పోలీస్ కస్టడీకి తీసుకోవడం సాధ్యపడలేదు. దీంతో తాజాగా మరోసారి కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఇక కర్నూలు జైల్లో ఉన్న పోసానికి విజయవాడలోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అదేవిధంగా కర్నూలు జిల్లా ఆదోనిలో నమోదైన కేసులోనూ పోసానికి బెయిల్ లభించింది. ఆదోని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ అపర్ణ మంగళవారం బెయిల్ ఆదేశాలు జారీ చేశారు.

జెత్వానీ కేసులో న్యాయవాది ఇనకొల్లుకు ఉపశమనం

- తదుపరి చర్యలు నిలిపివేసిన హైకోర్టు

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లుకు హైకోర్టులో ఉపశమనం లభించింది. ఈ కేసులో ఆయనపై తదుపరి చర్యలన్నింటినీ ధర్మాసనం నిలిపివేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రతివాదులుగా ఉన్న పోలీసులకు, జెత్వానీకి నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. తనపై నమోదైన ఆ కేసును కొట్టివేయాలని న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు తాజాగా హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ హాజరయ్యారు.

వీడియో పోస్టు చేస్తే దోపిడీ కేసా?

- కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వండి
- కర్నూలు 3 టౌన్ ఎస్‌హెచ్‌వోకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రిని అవమానించేలా వీడియో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారని ఫిర్యాదు వస్తే.. దోపిడీకి పాల్పడ్డారనే సెక్షన్ల కింద కేసు ఎలా నమోదు చేస్తారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు నేరుగా కోర్టు ముందు హాజరుకావాలని కర్నూలు 3 టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. నిందితుడు ప్రేమ్‌కుమార్ అరెస్టు, దోపిడీ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌హెచ్‌వోకు స్పష్టం చేసింది. వైసీపీ నేత ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేయడంలో, ఆయనకు జ్యుడీషియల్ రిమాండ్ విధింపులో ఎస్‌హెచ్‌వో, మేజిస్ట్రేట్ ఆలోచనా రహితంగా వ్యవహరించారని కోర్టు ఆక్షేపించింది. విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో రోడ్లపై టోల్‌గేట్లు పెట్టి కూటమి ప్రభుత్వం వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయనుందని ప్రేమ్‌కుమార్ ఓ వీడియోను చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీనిపై ఫిర్యాదు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. కాగా, తన తండ్రిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని కొరిటిపాటి అభినయ్ గత ఏడాది డిసెంబరులో హైకోర్టులో హెబియస్ కార్పస్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. నిందితులను అరెస్టు విషయంలో పోలీసులు చట్ట నిబంధనలు అనుసరించడం లేదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి. విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. ప్రేమ్‌కుమార్ అరెస్టు విషయంలో పోలీసులు చట్టనిబంధనల ప్రకారమే నడుచుకున్నారని తెలిపారు.

సునీల్‌నాయక్‌కు మరోసారి నోటీసులు

- రఘురామ చిత్రహింసల కేసులో జారీ

ఒంగోలు క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో బిహార్ అగ్నిమాపక దళం ఐజీ సునీల్‌నాయక్‌కు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మరోసారి నోటీసులు జారీచేశారు. ఈనెల 2న విచారణకు హాజరుకావాలని తొలుత నోటీసులు ఇవ్వగా సునీల్‌నాయక్ హాజరు కాలేదు. దీంతో ఈనెల 14 నుంచి వారంలోపు ఏదో ఒక రోజు రావాలని మళ్లీ నోటీసులు జారీచేశారు. వైసీపీ పాలనలో రఘురామను హైదరాబాద్‌లో అరెస్టు చేసి గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించారు. ఆ సమయంలో అప్పటి సీఐడీ డీఐజీ సునీల్‌నాయక్ సీఐడీ కార్యాలయంలోనే ఉన్నట్లు విచారణాధికారి నిర్ధారణకు వచ్చారు. దీంతో విచారణకు హాజరు కావాలని మరోమారు ఆయనకు వాట్సాప్, ఫ్యాక్స్ ద్వారా నోటీసులు పంపించినట్లు సమాచారం.

బోరుగడ్డ 'పరార్'!

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం తన న్యాయవాది ద్వారా హైకోర్టును ఆశ్రయించాడు. అదేం కుదరదని... సాయంత్రంలోపు అతను జైలులో లొంగిపోవాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. అయినా... బోరుగడ్డ తన అజ్ఞాతం వీడలేదు. "హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం బెయిల్ గడువు ముగిసేలోపు బోరుగడ్డ అనిల్ జైలుకు వచ్చి లొంగిపోలేదు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టుకు, పైఅధికారులకు తెలియచేశాం" అని రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులకు కూడా సమాచారం అందించారు. సాయంత్రం 5 గంటల్లోపు చెన్నై నుంచి విమానంలో వచ్చయినా జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవలసిందేనని హైకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. గ్రేస్ పీరియడ్ అరగంట కలుపుకొని సాయంత్రం 5.30 గంటలు దాటినా బోరుగడ్డ జైలుకు రాలేదు.

ఎక్కడున్నాడు?

హైకోర్టును బురిడీ కొట్టించి మధ్యంతర బెయిల్‌పై విడుదలైన బోరుగడ్డ ఎక్కడున్నాడో పోలీసులకూ అంతుచిక్కడంలేదు. తల్లికి అనారోగ్యం పేరిట గతనెల 14వ తేదీన తొలిసారి బోరుగడ్డ మధ్యంతర బెయిలు పొందాడు. ఆ తర్వాత... దానిని పొడిగించుకునేందుకు నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాడు. గత నెల 23వ తేదీనే ఆయన తల్లి పద్మావతి చెన్నై అపోలో నుంచి డిశ్చార్జి అయ్యారు. అంతకు ముందుగానీ, ఆ తర్వాత గానీ బోరుగడ్డ తన తల్లితో లేరని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఏది ఏమైనా... హైకోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం సాయంత్రానికి అతను జైలులో లొంగిపోవాలి. బోరుగడ్డ జైలు నుంచి మధ్యంతర బెయిల్‌పై విడుదలైన తర్వాత తెలంగాణలోని రంగారెడ్డి, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అక్కడ అతడికి వైసీపీకి చెందిన ముఖ్య నేత ఒకరు సహకరించినట్లు అనుమానిస్తున్నారు. బోరుగడ్డపై 4నెలల కిందటే లుక్‌అవుట్ నోటీసు జారీ అయ్యింది. అంటే... దేశంలోని విమానాశ్రయాల నుంచి ఎక్కడికీ పారిపోయే అవకాశంలేదు. ఈ నేపథ్యంలో... రోడ్డు మార్గంలో నేపాల్ లేదా ఇతర దేశాలకు పారిపోయే అవకాశముందని అనుమానిస్తున్నారు. మరోవైపు... తన 'నకిలీ లీలలు' బయటపడినప్పటికీ బోరుగడ్డ వీడియో విడుదల చేసి ప్రభుత్వంపై బెదిరింపులకు దిగాడు. ఇది విడుదల చేసి నాలుగు రోజులైనప్పటికీ... అది ఎక్కడి నుంచి, ఎవరి ఫోన్‌లో రికార్డు చేశారనే విషయాన్ని పోలీసులు ఇప్పటికీ గుర్తించలేదు. ఇప్పుడు బోరుగడ్డ కోసం గుంటూరు, అనంతపురం పోలీస్ బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. అతడికి ఎవరు సహకరిస్తున్నారు? బ్యాంక్ ఖాతాల లావాదేవీలు, కుటుంబ సభ్యుల కదలికలు, వారి సెల్‌ఫోన్‌లు, గతంలో బోరుగడ్డ ఎవరెవరితో టచ్‌లో ఉన్నాడు, రాజమండ్రి కారాగారం నుంచి ఎవరెవరితో మాట్లాడాడు... వంటి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. బోరుగడ్డతోపాటు ఆయన తల్లి, కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా స్విచ్‌ఆఫ్‌లోనే ఉండటం గమనార్హం. ముందస్తు ప్రణాళికలో భాగంగానే కుట్రపూరితంగా బోరుగడ్డ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు అంచనాకు వచ్చారు.

> **ఆ ఇద్దరికీ ఇబ్బందే!**
>
> 'బోరుగడ్డ అనిల్ ఎవరో తెలియని వ్యక్తులు అతడికి జామీను ఇచ్చారు. కోర్టు ఆదేశాల ప్రకారం అతడు తిరిగి జైలుకు రాకపోతే వారే ఇబ్బందిపడతారు. వారిని ప్రాసిక్యూట్ చేయాల్సి రావొచ్చు. బోరుగడ్డపై ఇప్పటికే ఉన్న కేసులకు అదనంగా కోర్టు ధిక్కారం, ఆదేశాలను బేఖాతరు చేయడం, ఫోర్జరీ డాక్యుమెంట్లు సమర్పించడం తదితర కేసులు కూడా నమోదవుతాయి. తప్పుడు పత్రాల సమర్పణలో న్యాయవాది పాత్ర ఉంటే ఆయనా చట్టానికి అతీతుడేమీ కాదు.'
>
> - ముప్పాళ్ల సుబ్బారావు, ప్రముఖ న్యాయవాది, రాజమహేంద్రవరం

జామీనుదారుల పరిస్థితేంటి?

బోరుగడ్డ జైలుకు తిరిగి రాకపోవడంతో అతడికి జామీను ఇచ్చిన ఇద్దరు వ్యక్తులూ కేసుల్లో ఇరుక్కునే అవకాశం ఉంది. అతడు మొదటిసారి మధ్యంతర బెయిల్‌పై వెళ్లినప్పుడు తన బావమరిది, మరొక సంబంధీకుడిని పూచీకత్తులుగా చూపించాడు. బెయిల్ పొడిగింపు లభించాక..పూచీకత్తు ఇవ్వడానికి వచ్చిన వాళ్లు తెలంగాణ వారు కావడం, వారిలో ఒకరి ఫోన్ నంబరు డయల్ చేయగా ట్రూకాలర్‌లో ఆధార్‌కు భిన్నమైన పేరు రావడంతో హైదరాబాద్ పోలీసులకు జైలు అధికారులు సమాచారమిచ్చి పూచీకత్తులను తిరస్కరించారు. దీంతో హడావుడిగా తూర్పుగోదావరి జిల్లా ఉండేశ్వరపురం కొత్తకాలనీకి చెందిన వేమగిరి శేషగిరి, కొక్కిరిపాటి అబ్బులును చూపించారు. వీరిద్దరికీ బోరుగడ్డతో పరిచయమే లేదు. వీరిలో ఒకరు ఆటో డ్రైవరు.. మరొకరు న్యాయవాది గుమాస్తా అని తెలుస్తోంది. వీళ్లకు మధ్యాహ్నం జైలు అధికారి ఫోన్ చేయగా.. ఒకరు తనకు సంబంధం లేదని సమాధానమివ్వగా, మరొకరు ఫోన్ కాల్‌కు స్పందించలేదని తెలిసింది.

'ఫైబర్' ఉద్యోగుల వివరాలు తక్షణమే ఇవ్వండి

- ఇన్‌చార్జి ఎండీ ప్రవీణ్ ఆదిత్యకు సీఎంఓ ఆదేశం

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఉద్యోగుల పూర్తి సమాచారం తక్షణమే అందించాలని సంస్థ ఇన్‌చార్జి ఎండీ ప్రవీణ్ ఆదిత్యను సీఎంఓ మంగళవారం ఆదేశించింది. సంస్థలో ప్రస్తుతం 780 మంది ఉద్యోగులు ఉన్నారని, వారిలో 200 మంది ఉద్యోగులకు సహేతుక నియామక పత్రాలు లేవని సంస్థ మాజీ చైర్మన్ జీవీ రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రికే సంస్థలో ఉద్యోగుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను అందించాలని సీఎంఓ కోరింది. ఈ సమాచారంతో దినేశ్‌కుమార్, జీవీరెడ్డి ఇచ్చిన సంజాయిషీలను పోల్చుకునే వీలుంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి, తాడేపల్లి ప్యాలె‌స్‌లోని కొందరు నాయకుల సిఫారసుల మేరకు నియమించుకున్న వారిని కొనసాగించడం, వేలకు వేల జీతభత్యాలు చెల్లించడం వంటి అంశాలపై సర్కారు ఆగ్రహంతో ఉన్న విషయం తెలిసిందే.

ఆ 5 రైళ్లు సికింద్రాబాద్‌కు రావు..!

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు ముమ్మరం కావడంతో స్టేషన్‌కు వచ్చే 14 ముఖ్యమైన రైళ్ల రూటు మార్చేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. మొదటి దశలో భాగంగా 5 రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ఆదిలాబాద్-తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ (17405/17405) ఈ నెల 26 నుంచి చర్లపల్లి, బొల్లారం, దయానంద్‌నగర్ స్టేషన్ల మీదుగా నడుస్తుందని అలాగే లింగంపల్లి- కాకినాడ స్పెషల్ (07445/07446) ఏప్రిల్ 2 నుంచి, కాజీపేట్- హడాస్పర్ ఎక్స్‌ప్రెస్ (17013/17014) ఏప్రిల్ 22 నుంచి, లింగంపల్లి- విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్(12805/12806) ఏప్రిల్ 25 నుంచి సికింద్రాబాద్‌కు రాకుండానే వయా చర్లపల్లి మీదుగా నడుస్తాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్- కర్నూలు సిటీ మధ్య నడిచే తుంగభద్ర (17023/17024) ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 10న కాచిగూడ నుంచి ప్రారంభించనున్నారు.

విమానంలో వచ్చయినా తక్షణమే లొంగిపోవాలి!

- బోరుగడ్డ అనిల్‌కు హైకోర్టు ఆదేశం
- మధ్యంతర బెయిల్‌ను పొడిగించేది లేదని స్పష్టీకరణ

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌తో మధ్యంతర బెయిల్ పొందిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్.. చెన్నై నుంచి విమానంలో వచ్చయినా జైలులో వెంటనే లొంగిపోవలసిందేనని హైకోర్టు మంగళవారం తేల్చిచెప్పింది. ఇందుకు మంగళవారం సాయంత్రం 5 గంటల వరకే గడువు విధించింది. తల్లి అనారోగ్యాన్ని కారణంగా చూపి మరోసారి మధ్యంతర బెయిల్‌ను పొడిగించుకునేందుకు అతడు చేసిన ప్రయత్నాన్ని వమ్ముచేసింది. ఇక పొడిగించేది లేదని.. సాయంత్రం 5గంటల్లోపు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు ఇచ్చారు. బోరుగడ్డ తరఫు న్యాయవాది స్పందిస్తూ... పిటిషనర్ ప్రస్తుతం చెన్నైలో ఉన్నారని చెప్పగా.. విమానంలో వచ్చయినా జైలులో సరెండర్ కావలసిందేనని న్యాయమూర్తి తేల్చిచెప్పారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డ.. తన తల్లి బి.పద్మావతి గుండె సంబంధ వ్యాధితో బాధపడుతూ చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, తన సహాయం ఆమెకు అవసరమంటూ హైకోర్టుకు మెడికల్ సర్టిఫికెట్ చూపించి ఈ నెల 11 వరకు మధ్యంతర బెయిల్ పొడిగింపజేసుకున్న విషయం తెలిసిందే. మధ్యంతర బెయిల్‌ను మరికొంతకాలం పొడిగించాలని, వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అతడి తరఫు న్యాయవాది మంగళవారం హైకోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించారు. సదరు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తల్లి ఇప్పటికీ చెన్నై ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారని, మధ్యంతర బెయిల్‌ను మరోసారి పొడిగించాలని కోరారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ తీవ్రంగా స్పందించారు. కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. తల్లి అనారోగ్యాన్ని కారణంగా చూపి పిటిషనర్ మధ్యంతర బెయిల్ పొందారని, గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు పీవీ రాఘవ శర్మ గత నెల 28న ఇచ్చినట్లు తప్పుడు మెడికల్ సర్టిఫికెట్ సమర్పించి.. కోర్టును మోసగించి.. మధ్యంతర బెయిల్‌ను పొడిగించుకున్నారని వెల్లడించారు. కోర్టు ఆదేశాలతో మెడికల్ సర్టిఫికెట్ వాస్తవికతపై పోలీసులు దర్యాప్తు చేశారని, అది తామిచ్చింది కాదని ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేశాయని.. హైకోర్టుకు బోరుగడ్డ ఫోర్జరీ సర్టిఫికెట్ సమర్పించినట్లు గుంటూరు ఎస్పీ నివేదిక ఇచ్చారంటూ వివరాలు కోర్టు ముందుంచారు. పైగా చెన్నై అపోలో ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తే పిటిషనర్ తల్లి గత నెల 23నే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు తేలిందన్నారు. తప్పుడు మెడికల్ సర్టిఫికెట్‌తో బోరుగడ్డ ఈ నెల 1న హైకోర్టును ఆశ్రయించే నాటికి అతడి తల్లి ఆస్పత్రిలో లేరన్నారు. ఫోర్జరీ సర్టిఫికెట్, తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిన నేపథ్యంలో అతడిని ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతి కోరుతూ అనంతపురం పోలీసులు అనుబంధ పిటిషన్ వేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మధ్యంతర బెయిల్ పొడిగించాలన్న అభ్యర్థనను వ్యతిరేకించారు. వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. మధ్యంతర బెయిల్ పొడిగించేందుకు నిరాకరించారు.



చట్టం కంటే పోలీసులు ఎక్కువేమీ కాదు

- వ్యక్తుల స్వేచ్ఛను తేలిగ్గా తీసుకుంటున్నారు
- ఇలాగే వదిలేస్తే కోర్టులోనే అరెస్టు చేస్తారేమో!
- వైసీపీ సానుభూతిపరుడు అవుతు శ్రీధర్‌రెడ్డి జ్యుడీషియల్ రిమాండ్ ఉత్తర్వులు రద్దు




అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసుల వ్యవహారశైలిపై హైకోర్టు మండిపడింది. నిందితుల అరెస్ట్ విషయంలో చట్టనిబంధనలు అనుసరించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. చట్టంకంటే పోలీసులు ఎక్కువేమీ కాదని ఘాటుగా వ్యాఖ్యానించింది. వ్యక్తుల స్వేచ్ఛను పోలీసులు చాలా తేలిగ్గా తీసుకుంటున్నారని, పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపింది. పోలీసుల చర్యలను తేలిగ్గా తీసుకుంటే రేపు కోర్టుకు వచ్చి కూడా అరెస్టులు చేస్తారని వ్యాఖ్యానించింది. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో వైసీపీ సానుభూతిపరుడు అవుతు శ్రీధర్‌రెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ విజయవాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్(ఎఫ్‌ఏసీ) ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. వాటిని చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించింది. మెజిస్ట్రేట్ యాంత్రికంగా వ్యవహరించారని వ్యాఖ్యానించింది. తాము ఇచ్చిన ఉత్తర్వులు ఈ కేసులో దర్యాప్తు కొనసాగించేందుకు అడ్డంకి కాబోవని, పోలీసులు చట్టనిబంధనలు ప్రకారం నడుచుకోవచ్చని తెలిపింది. కోర్టు ఉత్తర్వులు అందిన వెంటనే శ్రీధర్‌రెడ్డిని విడుదల చేయాలని నెల్లూరు జిల్లా జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ద్విసభ్యధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) యతీంద్రదేవ్ ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 47(1) కింద పోలీసులు ఇచ్చిన నోటీసులను తీసుకొనేందుకు నిందితుడు నిరాకరించారని తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పప్పుడిప శశిధర్‌రెడ్డి వాదనలు వినిపించారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో అవుతు శ్రీధర్‌రెడ్డిని విజయవాడ సూర్యారావుపేట పోలీసులు అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా గత నెల 25వ తేదీన జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అయితే, విజయవాడ మెజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి, రద్దు చేయాలని కోరుతూ శ్రీధర్‌రెడ్డి సతీమణి జాన్సీ వాణిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

'వర్రా' మెడనొప్పి హంగామా!

- కడప జైలు నుంచి వచ్చేందుకు ససేమిరా
- వైద్య పరీక్షల్లో నొప్పి కేవలం డ్రామా అని తేలడంతో ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లుకు తరలింపు

కడప/జగ్గయ్యపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియాలో బూతులు పోస్టు చేసి కడప జైల్లో ఉన్న జగన్ సతీమణి భారతి పీఏ వర్రా రవీంద్రరెడ్డిని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు పోలీసులు పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. అయితే.. పోలీసులను చూసిన వర్రా.. తనకు మెడనొప్పిగా ఉందని, అక్కడికి రాలేనని డ్రామాలకు తెరదీశారు. దీంతో పోలీసులు రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించి, ఎలాంటి ఇబ్బందులు లేవని, మెడనొప్పి కేవలం డ్రామానేనని గుర్తించి తమ వెంట ఎన్టీఆర్ జిల్లాకు తరలించారు. వర్రా రెండు నెలలుగా కడప సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్నారు. అతనిపై పలు జిల్లాల్లో కేసులు నమోదయ్యాయి. చిల్లకల్లులో కూడా కేసు నమోదైంది. దీంతో వర్రాను జగ్గయ్యపేట మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచడానికి పీటీ వారెంట్‌పై చిల్లకల్లు ఎస్సై టి. సూర్యశ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం కడపకు వచ్చారు. కాగా, కడప సెంట్రల్ జైలులో వర్రాకి వైసీపీ నేతల సహకారంతో కొందరు అధికారులు సకల సౌకర్యాలు కల్పించినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాకు వెళితే అక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్న ఆలోచనతో తనకు మెడనొప్పిగా ఉందని తాను రాలేనని డ్రామాకు తెరదీశారు.


కడప రిమ్స్ వద్ద వర్రా రవీంద్రరెడ్డి

ఫ్యాన్సీ నంబర్.. ఆర్మీ స్టిక్కర్!

- కారులో 150 కిలోల గంజాయి రవాణా
- తూర్పుగోదావరి జిల్లాలో ఐదుగురి అరెస్టు

రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 3333 ఫ్యాన్సీ నంబరుతో కారు.. ముందు, వెనుక అద్దాలపై ఆర్మీ పేరుతో స్టిక్కర్! ఇక మనల్ని ఎవరు అపుతారులే అనే నమ్మకం!! పైగా ఆ కారుకు ముందు కొంత దూరంలో పైలట్‌గా ఒక ఆటో! ఏంటి ఇదంతా అనుకుంటున్నారా?? భారీయెత్తున గంజాయి రవాణాకు అక్రమార్కులు వేసిన సినిమా తరహా ప్లాన్ ఇదీ. అయితే వారి ప్లాన్‌ను తూర్పుగోదావరి జిల్లా పోలీసులు ముందస్తు సమాచారంతో మాటు వేసి అడ్డుకున్నారు. కారు డిక్కీలోని రూ.30 లక్షల విలువైన 150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి ఎస్పీ నరసింహ కిషోర్ వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం రాజానగరం ఎస్ఐ మనోహర్, ఇతర పోలీసు సిబ్బంది మాటు వేశారు. రంపచోడవరం వైపు నుంచి వస్తున్న ఏపీ 39ఏ 3333 నంబరు గల కారులోని వ్యక్తులు పోలీసులను చూసి కంగారుపడ్డారు. ఆ వెంటనే పోలీసులు కారును చుట్టుముట్టారు. వాహనాన్ని తనిఖీ చేయగా.. కారు డిక్కీలో 2 కిలోల చొప్పున ప్యాకింగ్ చేసిన 75 ప్యాకెట్ల గంజాయి ఉంది. దీని విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని ఎస్పీ చెప్పారు. కారులో ఉన్న ప్రకాశం జిల్లా కంభం పట్టణానికి చెందిన షేక్ ఇంతియాజ్, సింగరాయకొండకు చెందిన షేక్ అబ్దుల్ సలీంతో పాటు పైలట్ వాహనంగా వెళ్తున్న ఆటోలోని రంపచోడవరానికి చెందిన సుంకురు బుచ్చిరెడ్డి(బుచ్చి), ముర్ల చిన్నారెడ్డి(జెట్టీ), ఉలుగుల రవికిరణ్ రెడ్డి(పండు)లను అరెస్ట్ చేశామని తెలిపారు. కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే గంజాయిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనేది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. ఏపీ-ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి ఈ గంజాయిని తీసుకొస్తున్నట్టు అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. కారుపై ఆర్మీ స్టిక్కర్ ఉండడంతో సులువుగా గంజాయి రవాణా చేయవచ్చని నిందితులు భావించినట్లు తెలుస్తోంది. ఓ ఆర్మీ మాజీ ఉద్యోగి తన కారును కిరాయికి ఇస్తుండగా.. నిందితులు దాన్ని తీసుకొని గంజాయి రవాణాకు వినియోగించారని చెబుతున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.